13-05Pg1exHMNWJQERS.qxd:13-05Pg1exHMNWJQERS.qxd 01/01/01 9:55 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 101 పేజీలు: 12 వెల: 6.50


టెస్టులకు విరాట్ కోహ్లి గుడ్‌బై ఆటలో

# ఉగ్రవాదుల్ని ఊడ్చేశాం

## వారు కలలో కూడా ఊహించని దెబ్బకొట్టాం

మన త్రివిధ దళాలు ఎప్పుడూ సర్వసన్నద్ధం

మహిళల సిందూర రక్షణకే 'ఆపరేషన్ సిందూర్'

పాక్ క్షిపణులు భారత్‌లోకి రాలేకపోయాయి

భారత్ సైన్యానికి, శాస్త్రవేత్తలకు నా సెల్యూట్

### జాతినుద్దేశించిన ప్రసంగంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మే 12:** ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనివిధంగా భారత సైన్యం దెబ్బతీసిందని, భారత మహిళల నుదుట సింధూరాన్ని దూరంచేస్తే మూల్యం ఎలా ఉంటుందో కూడా వారికి తెలిసొచ్చేలా చేసామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భారత్ పాక్‌లమధ్య కాల్పుల విరమణ అనంతరం సోమవారం ఉదయం నుంచి విస్తృత స్థాయిలోరక్షణరంగ సమీక్షలు నిర్వహించిన ప్రధాని మోడీ రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్ అనేది ఒక ఆపరేషన్ కంటే మన భారత మహిళల ఆవేదన అని ఆయన అన్నారు. ఉగ్రవాదాన్ని వీడకపోతే పాకిస్తాన్‌కు మనుగడ అనేదే ఉండదని, ఉగ్రవాదులు భవిష్యత్తులో దాడిచేస్తే ఆపరేషన్ సింధూర్‌కు రెట్టింపుస్థాయిలో జవాబిస్తామని హెచ్చ రించారు. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా తుదముట్టిస్తామన్నారు. అణ్వాయుధాలను బూచిగా చూపించి ఉగ్రకార్యకలాపాలకు పాల్పడతామంటే సహించేదిలేదని, సమూలంగా పెకలించివేస్తా మన్నారు. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే పాకిస్థాన్‌తో చర్చలుంటాయని ఆయన స్పష్టంచేసారు. పాకిస్థాన్‌తో చర్చలు అంటూ జరిగితే కేవలం ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. గడచిన నాలుగురోజులుగా మన సైన్యం సామర్థ్యాన్ని మనంచూసామని, నిఘా వర్గాల సామర్థ్యం, శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని దేశం చూసిందని మనదేశ అసమాన వీరత్వం ప్రదర్శించిందని మోడీ ఈసందర్భంగా వారికి శెల్యూట్‌చేసారు. పహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరు అడిగి మరీ కుటుంబ సభ్యులముందే, భర్తలను దారుణంగా కాల్చిచంపారని, వ్యక్తిగతంగా ఇది తనకెంతో బాధాకరం అనిపించిందని అన్నారు. చనిపోయిన ఉగ్రవాదులనుచూసి పాకిస్థాన్ అధికారులు కన్నీళ్లుపెట్టుకోవడం మనం చూసామని, దీన్నిబట్టిచూస్తే పాకిస్థాన్‌లో ఉగ్రస్థావరాలు, ఉగ్రవాదులకు పాకిస్తాన్ అధికారుల ప్రోత్సాహం, మద్దతు ఉందని అన్నారు. పాకిస్థాన్‌లోని బహావల్పూర్, మురిద్కే వంటి స్థావరాలు ఉగ్రవాద యూనివర్సిటీలుగా ఉన్నాయని, అమాయక యువతను ప్రలోభపెట్టి వారిని లోంగదీసుకుని ఈ కేంద్రాల్లోనే శిక్షణ ఇచ్చి వారిని భారత్‌పైకి ఉసిగొలుపుతున్నారని, అందుకే ఉగ్రవాద మూలాలను ధ్వంసం చేసామని ప్రధాని మోడీ అన్నారు. కేవలం ఉగ్రవాదంపైనే అనుకుంటే పొరుగుదేశం మన స్కూళ్లు, మందిరాలు, మసీదులు, గురుద్వారాలు, సామాన్యుల ఇళ్లపైనా దాడులు చేసిందని, ఇక సహించలేకనే మన శక్తిసామర్థ్యాలను చూపించామన్నారు. >>2



జమ్ము సరిహద్దుల్లో రాత్రి కాల్పులు జరిపిన పాక్

డ్రోన్లను కూల్చివేసిన భద్రతా దళాలు

జలంధర్, ఫిరోజ్‌పూర్‌లో బ్లాకౌట్

# మళ్లీ ఉల్లంఘన

**న్యూఢిల్లీ, మే 12:** కాల్పుల విరమణ ఉల్లంఘనను పాకిస్థాన్ నిస్సిగ్గుగా ఉల్లంఘించింది. రెండుదేశాల డిజిఎంఒల చర్చల అనంతరం కూడా పాకిస్తాన్ ఈ నిర్వాకానికి పాల్పడింది. రెండురోజులపాటు తీవ్రస్థాయి దాడులు చవిచూసిన తర్వాతకూడా పాక్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. జమ్ముకాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖవెంబడిసాంబ, కతువా జిల్లాల్లో డ్రోన్లను ప్రయోగించి దాడులకు పాల్పడిందని సైనిక వర్గాలు ధృవీకరించాయి. దీనితో సరిహద్దు రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తంచేసింది .పంజాబ్, రాజస్థాన్, జమ్ము, గుజరాత్ రాష్ట్రాల్లోని కీలక స్థావరాలున్న ప్రాంతాలను బ్లాకౌట్‌ప్రకటించింది. పంజాబ్‌లోని జలం ధర్, ఫిరోజ్‌పూర్లలో కూడా బ్లాకౌట్ అమలు చేసారు. మరోపక్క వాస్తవాధీనరేఖ వెంబడి పాక్ సైన్యం జరుపుతున్న దాడులను భారత్‌రక్షణ వ్యవస్థ తిప్పికొట్టింది. డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా ప్రధాని మోడీ ప్రసంగం తర్వాతనే పాకిస్థాన్ రెచ్చిపోయింది. డ్రోన్లను >>2



## భారత్, పాక్ అణుయుద్ధాన్ని నేనే ఆపా: ట్రంప్

2లో


# ఏజెన్సీలో ఉద్యోగాలు పూర్తిగా గిరిజనులకే

### జీవో నం-3 పునరుద్ధరణకు చర్యలు

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తాం

ప్రత్యేక పథకాలు కూడా అమలు చేస్తాం

గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, మే 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2000 ఏడాదిలో జీ.వో నెంబర్ 3 తెచ్చామని సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3 పునరుద్ధరణకు తీసుకావల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే... 2020 లో రద్దయిన జీ.వో నెంబర్ 3 పునరుద్దరణకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. ఈ రివ్యూలో గిరిజన సంక్షేమ శాఖ, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు టీచర్ పోస్టుల్లో 100 శాతం రిజర్వేషన్లు తెచ్చాం. దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో మళ్లీ పెరిగిన మహిళ రిజర్వేషన్ల శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో జీవో ఎంఎస్ నంబర్ 3తెచ్చాం. దీన్ని అమలు చేయడం ద్వారా సుమారు 4,626 టీచర్ ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు దక్కాయి. అయితే జీవో నెంబర్ 3 పై 2002లో కొందరు కోర్టును ఆశ్రయించగా వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఈ ఉత్తర్వులను సుప్రీం కోర్టు రద్దుచేసింది. అయితే గత ప్రభుత్వం దీనిపై రివ్యూ పిటిషన్ వేయడంలో తీవ్ర అలసత్వం పాటించింది. దీంతో రివ్యూ పిటిషన్ ను కూడా సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ కారణంగా గిరిజనులు జీవో నెంబర్ 3 ద్వారా లభించే లబ్దిని కోల్పోయార్ు అని సిఎం అన్నారు.

**చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం**

జీవో నెంబర్ 3 పునరుద్దణ లేదా అదే తరహా న్యాయం చేసేందుకు గిరిజనులకు ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు జీ.వో నెంబర్ 3 రద్దు అనంతర పరిణామాలపై అధికారులతో సీఎం చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో జీవో 3 ద్వారా నాడు గిరిజనులకు కలిగిన లబ్దిని పునరుద్దరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాల గురించి, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకుల గురించి చర్చించారు. జీ.వో నెంబర్ 3పునరుద్దరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గిరిజనుల, గిరిజన సంఘాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని సిఎం అధికారులకు >>2

# ఎపి భవన్‌కు చేరిన 400 మంది విద్యార్థులు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** భారత సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఢిల్లీ లోని ఏపీ భవన్‌కు చేరుకున్న విద్యార్థుల సుమారు సంఖ్య 400కి చేరింది. జమ్మూకాశ్మీర్,పంజాబ్‌ల్లోని పలు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వీరంతా ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్వస్థలాలకు తిరుగుపయనమయ్యారు. ఢిల్లీ చేరుకున్న వీరికి ఏపీ భవన్ అధికారులు తాత్కాలిక వసతి,భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 91 మంది విద్యార్థులు ఉండగా,ఆదివారం నాటికి ఆ సంఖ్య 350కి చేరింది. ఇక్కడి సిబ్బంది వారికి రైలు టికెట్ కన్ఫర్మేషన్ చేయించడంతో పాటు, ఎయిర్‌పోర్టు,రైల్వే స్టేషన్లకు వెళ్ళటానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సమయంలో దేశ >>2

# సైనికులతో సమానంగా నర్సులు సేవలందించాలి

## రాష్ట్ర వైద్య,ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైంది, గౌరవనీయమైందని,ఎంతో చిత్తశుద్ధితో నిర్వహించాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.రోగులకు చిరునవ్వుతో సేవలందించాలన్నారు.వారిని అదే చిరునవ్వుతో ఆస్పత్రి నుంచి పంపించేలా మాట్లాడుతూ మొదటిసారిగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ప్రదానం చేపట్టామన్నారు..ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నర్సుల సేవలు అనితర సాధ్యమైనవని, నర్సులు సంపదను సృష్టిస్తారని దానికి కారణం మనిషి ఆరోగ్యాన్ని సంరక్షించి వారి జీవిత కాలం పెరగ డటమేనన్నారు. సమస్యల పట్ల ఉదాసీనంగా ఉంటే ఫిర్యాదులు వస్తాయన్నారు. ప్రజలకు పటిష్టమైన వైద్యం అందించాల్సిన బాధ్యత మంత్రిగా నాపైన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పైన ఉందన్నారు. అందుకోసమే బడ్జెట్ లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించారన్నారు. హక్కుల గురించి మాట్లాడుతున్నపుడు బాధ్యతలను కూడా మర్చిపోకూడదన్నారు. ప్రజలకు మేం జవాబుదారీ కాబట్టి బాధ్యతల నిర్వహణపై ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తామని, మానవతా దృక్పథంతో కూడా ఆలోచిస్తామన్నారు. నేను బాధ్యతల గురించి మాట్లాడితే నన్నే ప్రశ్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తుందన్నారు. మా స్థాయిలో మేము సమస్యలు పట్ల సానుకూలంగా ఉంటూ, క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నా, క్షేత్ర స్థాయికి వెళ్లటంలేదనే విమర్శలు చేస్తున్నారన్నారు. ఇవన్నీ వాస్తవాలు కాదని వారికి కూడా తెలుసునన్నారు. ఇటీవల ఒక ఉద్యోగి నన్ను బెదిరిస్తూ నాకు కామెంట్ పెట్టారని, అదే గత ప్రభుత్వం అయితే ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించేదన్నారు. నేను అలా చేయలేదని, కాని మేము అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఇటీవల అనంతపురంలో బేబీ మిస్సింగ్ లో మీడియా లో వచ్చిన వార్తలు వల్ల నర్సు మీద చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని, నిజం తెలుసుకుని తర్వాత సరిచేసామన్నారు. ఏపీ లో నర్సింగ్ కౌన్సిల్ లో రాష్ట్ర విభజన తరువాత 1,20,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వం చెప్పిన జీరో వేకెన్సీ పాలసీలో డొల్లతన మేం బయటపెట్టామన్నారు. రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో 5,300 నర్సింగ్ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రతీ సంవత్సరం 2,600 మంది ఇతర దేశాల్లో నర్సింగ్ ఉద్యోగాల కొరకు రిజిష్టర్ చేసుకుంటున్నారన్నారు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఎంవోయూ చేసుకుని 8 విదేశీ భాషలు వారికి నేర్పిస్తామన్నారు. దీనివల్ల మన వాళ్లు విదేశాల్లో కూడా నర్సుల ఉద్యోగాల ద్వారా సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. సరైన అర్హత లేని నర్సులు ఎక్కడా ఉండకూడదని ఈ విధంగా వృత్తి నైపుణ్యంలో కూడా శిక్షణను అందిస్తామన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సింగ్ కాలేజీలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

## జూన్ 13 దాకా హైకోర్టుకు సెలవులు

**విజయవాడ,మే 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టుకు ఈ రోజు సోమవారం నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తిరిగి జూన్ 16 నుంచి పూర్తిస్థాయి కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యాజ్యాల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పాటు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి దశ వెకేషన్ కోర్టులు ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విచారణలు చేపడతాయి. ఇందులో భాగంగా మే 15, 22వ తేదీల్లో న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా విచారణలు చేయనున్నారు. మే 29న జస్టిస్ ఎన్.హరి >>2

## తమిళ ప్రజలకు జనసేన తోడ్పాటు

### డి. సిఎం పవన్

**విజయవాడ, మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారం అంటే ప్రజాక్షేమాన్ని ఆలోచించే మార్గమని నేను నమ్ముతానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.అదే భావనతో జనసేన పార్టీని స్థాపించామన్నారు. రాజకీయం బాధ్యత దీన్ని గుర్తించామన్నారు.అందుకే ఓట్లు, సీట్ల లెక్కలు వేసుకోకుండా ప్రజలకు మేలుచేసే దారిలో ముందుకెళ్లామన్నారు. ప్రజలు దాన్ని అర్థం చేసుకుని ఆశీర్వదించారు. తమిళనాడు ప్రజలకు మేలుచేసే విషయాల్లో అవసరమైన తోడ్పాటు అందిస్తాం అని జనసేన అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.మంగళగిరిలోని >>2

## హెలికాప్టర్‌పై దాడి కేసు

# మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డిని విచారణ చేసిన పోలీసులు

### చెన్నేకొత్తపల్లి పిఎస్‌లో సాగిన విచారణ

నేడు రానున్న పైలట్ అనిల్ కుమార్

లింగమయ్య హత్య కేసులో పరిటాల శ్రీరామ్‌పై కేసు ఎందుకు పెట్టలేదన్న తోపుదుర్తి



**సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి**

**అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో గత నెల ఎనిమిదో తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలో హెలికాప్టర్‌పై దాడి జరిగిన కేసులో వైసీపీ నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. చెన్నె కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 3 గంటల పాటు పోలీసుల విచారణకు హాజరయ్యారు. చెన్నేకొత్తపల్లి సిఐ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీస్ విచారణ జరిగింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు దూసుకురావడం వల్ల వైఎస్ జగన్ ప్రయాణించిన హెలికాప్టర్ దెబ్బతిన్న విషయం హెలి కాప్టర్ దాడి కేసులో ఇప్పటికే హెలికాప్టర్‌కు సంబంధించిన సంస్థకు, పైలెట్, కో పైలెట్‌కు పోలీసులు నోటీ నోటీసులు జారీ చేయగా గతంలో హెలికాప్టర్ సంబంధించిన సంస్థ ఒక న్యాయవాది ద్వారా తన అభిప్రాయాన్ని తెలియజేసింది. ఇదే సమయంలో కో పైలట్ కూడా విచారణకు హాజరై పోలీసుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అయితే గతంలో పోలీసు విచారణకు హెలికాప్టర్ పైలెట్ అనిల్ కుమార్ హాజరు కాలేదు. మళ్లీ రెండోసారి పైలట్ పోలీసులు నాటి నోటీసులు జారీ చేయగా మంగళవారం రోజు విచారణకు హాజరవుతున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో పైలట్ విచారణ పూర్తయితే ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిని మరోసారి అవసరం అయితే పిలుస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం రోజు చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. పోలీసు విచారణ పూర్తయిన తర్వాత స్టేషన్ బయట మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మీడియాతో ఏమన్నారంటే హెలికాప్టర్ వద్ద జరిగిన సంఘటనలో నా ప్రమేయం ఏమీలేదు. నేను జనాన్ని అదుపు >>2

# వడదెబ్బకు నలుగురు మృతి

## రాష్ట్రమంతా అత్యధిక ఉష్ణోగ్రతలు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎండలు దంచి కొట్టాయి. ఎన్టీఆర్,కృష్ణా,ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 43.1గా ఉన్నట్లు సమాచారం.ఎండ దెబ్బకు ఈ రోజు జనం అల్లాడారు. శీతల వాతావరణ సదుపాయాలు ఉన్న ఇండ్లలో సైతం జనం ఉండలేని పరిస్దితులు ఏర్పడ్డాయి. మధుమేహం,రక్తపోటు వంటి అనారోగ్య కారణాలు నలుగురు వ్యక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడ్డారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఒకరు.ఏలూరు జిల్లాలో ఒకరు గుంటూరులో ఇద్దరు వడదెబ్బకు మరణించారు. 70 మండలాల్లో వడగాడ్పులు వీసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. 29 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 41 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. తీవ్ర గాడ్పులు వీచిన మండలాల్లో శ్రీకాకుళంలో 6, విజయనగరంలో 9, పార్వతీపురం మన్యం 19, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాలు ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళం 7, విజయనగరం 14, పార్వతీపురం మన్యం 4, అల్లూరి సీతారామరాజు 4, అనకాపల్లి 4, కాకినాడ 4, తూర్పుగోదావరి 1, కృష్ణాలో 3 మండలాలు ఉన్నాయి.

నిన్న ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల, శ్రీకాకుళం జిల్లా జగ్గిలి బొంతులో 42.2 డిగ్రీల చొప్పున, తిరుపతి జిల్లా ఓజిలి, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 41.8 డిగ్రీల చొప్పున, ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, చిత్తూరు జిల్లా పిపల్లిలో 41.6 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తమ్మీద ఆదివారం 144 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్టోగ్రతలు నమోదు అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రానున్న మూడు రోజుల పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిస్తే, మరోవైపు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

ఐఎండీ అంచనా ప్రకారం మే 12 నుంచి 15 వరకు ఉరుములు మెరుపులతో పాటు బలమైన గాలులు వీస్తాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో ఉపశమనం కలిగించేలా ఉంటే, మరికొన్ని చోట్ల ఆందోళనకరంగా ఉంటా యని ఐఎండీ పేర్కొంది. దేశరాజధాని ఢిల్లీలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉండి తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది.

13-5pg2exHMNWJQE.qxd:13-5pg2exHMNWJQE.qxd 01/01/01 9:52 AM Page 1





చీనాబ్ నదిపై రామ్‌బాన్‌లో నిర్మించిన బాగ్లిహార్ హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ కేంద్రం

# ఉగ్రవాదుల్ని ఊడ్చేశాం

>> ఉగ్రవాదం చర్చలు ఒకే మార్గంలో నడవలేవని, ఉగ్రవాదం వాణిజ్య ఒకే బాటలో ఉండవని, అలాగే నదీజలాలు రక్తపుటేరులు ఒకే తీరులో ఉండబోవని పొరుగుదేశం గుర్తుంచుకోవాలనిమోడీ హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించేదిలేదని, ఏరూపంలో ఉన్నా ఎక్కడ ఉన్నా అణిచివేస్తామని నిర్మూలించివేస్తామన్నారు. మన మేడిన్‌ఇండియా సాంకేతిక వ్యవస్థలతో రూపొందిన యుద్ధసామగ్రితోనే పొరుగుదేశానికి, ఉగ్రవాదులకు మన శక్తిసామర్థ్యాలను రుచిచూపించామన్నారు. రెండుదశాబ్దాలుగా పాకిస్తాన్‌లో విశృంఖలంగా ఉన్న ఉగ్రవాద తాండాలను ఒక్కదెబ్బతో తుడిచిపెట్టామని భారత్ వ్యతిరేకంగా కుట్రలుచేస్తున్న ఉగ్రతాండాలను తుదముట్టించామన్నారు. దీనితోభారత్‌అచేతనావస్థలోకి వెళ్లిందని, ఎటూపాలుపోని పాకిస్తాన్ మనదేశంలోని జనావాసాలు, పాఠశాలలపై దాడిచేసిందన్నారు. పాక్‌నుంచి ప్రయోగించిన మిసైళ్లు, డ్రోన్లను భారత క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దుల్లోకి రాకుండానే కూల్చివేసిందన్నారు. పాకిస్థాన్‌లోని కీలకమైన వైమానిక స్థావరాలకు తీవ్రనష్టం కలిగించామని దీనితోనే పాక్ బెంబేలెత్తిపోయిందన్నారు. పాక్ వైమానికస్థావరాలు, రాడార్ స్టేషన్లలో భారత మిసైళ్ల విధ్వంసం సృష్టించాయన్నారు. ఇప్పటికే మెరుపుదాడులు, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సింధూర్ ఉగ్రవాదంపై మన వైఖరిని స్పష్టంచేసామని, ఉగ్రవాదంపై భారత్‌షరతులమేరకే చర్చలు ఉంటాయని, భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలుసాగుతాయని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. అణ్వాయుధాలను చూపించి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తామంటే భారత్ ఉపేక్షించదని, ఏరూపంలో ఎక్కడ నక్కినా భారత్ తుదముట్టిస్తుందని, అందుకు ఈమూడురోజులపాటుజరిగిన దాడులే నిదర్శనమని మోడీ అన్నారు. మరోసారి భారత త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలకు ప్రధానిమోడీ సెల్యూట్‌చేస్తున్నానని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను ప్రపంచం మొత్తంచూసిందని, భారతశక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనావేయవద్దని ఆయన సూచించారు. మేడిన్‌ఇండియా ఆయుధాలతోనే మా సత్తాచూపించామని మోడీ గుర్తుచేసారు. ఉగ్రవాదమౌలిక వనరులను నిలిపివేస్తే తప్ప పాకిస్తాన్‌కు మనుగడ లేదని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నంతసేపూ ఆదేశానికి అభివృద్ధి కష్టమేనని మోడీ స్పష్టంచేసారు. బుద్ధపూర్ణిమరోజని బుద్ధుడు మనకు శాంతిని ప్రబోదించాడని, అలాగే శాంతితోపాటు మన శక్తిసామర్థ్యాలనుచాటిచెప్పినపుడే శాంతిసామరస్యవాతావరణం నెలకొల్పగలుగుతామని మోడీ అన్నారు. ఇది యుద్ధాల యుగం కాదని, ఉగ్రవాదులయుగం కూడా కానేకాదని మోడీ చెపుతూ భవిష్యత్తులోకూడా భారత్ ఉగ్రవాదులు దాడులుచేయాలని ఆలోచిస్తే ఇంతకు రెట్టింపుస్థాయిలో జవాబిస్తుందని పాకిస్థాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు చేసారు.

## మళ్లీ ఉల్లంఘన

>> భారత్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలే టార్గెట్‌గా దాడులుచేసింది. హోషియార్‌పూర్‌లో సైరన్లు మోగించారు. సాంబా, ఆర్నియాలో డ్రోన్ల కదలికలను గుర్తించారు.

## భారత్, పాక్ అణుయుద్ధాన్ని నేనే ఆపా: ట్రంప్

**వాషింగ్టన్, మే 12:** భారత్ పాకిస్థాన్‌లమధ్య అణుయుద్ధాన్ని తానే ఆపానని, అణుయుద్ధంజరిగి ఉంటే లక్షలాదిమందిప్రాణాలు కోల్పోయేవారని అమెరికా అధ్యక్షుడుడొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. అందుకే తాను అణుయుద్ధాన్ని ఆపేలా భారత్ పాక్‌లపై ఒత్తిడి తెచ్చానన్నారు. యుద్ధం కొనసాగిస్తామంటే మీతో వ్యాపారంచేయనని చెప్పానన్నారు. దీనితో రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని దాయాది దేశాలు కాల్పుల విరమణ క్రెడిట్ నాదే అని ట్రంప్ వ్యాఖ్యలుచేసారు. అంతేకాకుండా యుద్ధం విషయంలోప్రస్తుతం భారత్‌తో చర్చలుజరుపుతున్నట్లు ట్రంప్ చెప్పారు. త్వరలో పాక్‌తోకూడా మాట్లాడతానని వివరించారు. కాల్పుల విరమణపరంగా గతంలో ఎన్నడూ వాణిజ్య అంశాలను ప్రస్తావించిన దాఖలాలు లేవని, తాను మాత్రమే వాణిజ్యం ప్రాతిపదికగా కాల్పుల విరమణకు ఒత్తిడితెచ్చానని ట్రంప్ అన్నారు.



ఇటీవల జమ్ములో వీరమరణం పొందిన బిఎస్ఎఫ్ జవాన్ ఇంతియాజ్ భౌతిక కాయాన్ని సోమవారం అంత్య క్రియల కోసం పాట్నాకు తీసుకు వచ్చిన దృశ్యం

# పాక్‌తో 'హాట్'లైన్..

## కాల్పుల విరమణపై చర్చించిన ఉభయ డిజిఎంఒలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత్‌పాకిస్థాన్ దేశాల డీజీఎంవోల చర్చలు ముగిశాయి. రెండు దేశాల డీజీఎంవోలు హాట్‌లైన్ ద్వారా చర్చలు జరిపారు. వాస్తవానికి ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం డీజీఎంవోలు ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకే చర్చలు జరగాల్సి ఉంది. కానీ అనివార్యంగా చర్చలను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఇవాళ వేసారు. సాయంత్రం 5 గంటలకు మొదలైన డీజీఎంల చర్చలు సుమారు గంటలపాటు జరిగాయి. భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్, పాకిస్థాన్ డీజీఎంవో కాశీఫ్ చౌదరిలుఈ చర్చల్లో పాల్గొన్నారు. కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకారం తెలిపిన అనంతర పరిస్థితులు, కాల్పుల విరమణ విధివిధానాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

హాట్‌లైన్‌లో ఇంకా ఏం చర్చించారనే వివరాలు సమగ్రంగా తెలియరాలేదు. చర్చల్లో ప్రధానంగా కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తతల తగ్గింపు, పివోకే తదితర అంశాలపైనే చర్చలుజరిగాయనిసమాచారం. కాగా ఏప్రిల్ 22న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోగల బైసరన్ లోయలో పర్యాటకులే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఆ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అందుకు ప్రతీకారంగా భారత్ పాక్‌లోని, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో సర్జికల్స్ స్ట్రైక్స్ చేసింది. అదే సమయంలో పాకిస్థాన్ సైన్యం అత్యుత్సాహంతో భారత్‌పై దాడులకు పాల్పడింది.

ఈ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ డీజీఎంవో భారత్‌కు కాల్పుల విరమణ ప్రతిపాదన చేశారు. అందుకు భారత్ కూడా అంగీకరించింది. సోమవారం మధ్యాహ్నం డీజీఎంవోలు చర్చలకు ప్లాన్ చేశారు. అయితే మధ్యాహ్నం జరగాల్సిన చర్చలు సాయంత్రానికి వాయిదాపడ్డాయి. సాయంత్రం ఇరుదేశాల డీజీఎంలోలు చర్చలు జరిపారు.

# తమిళ ప్రజలకు జనసేన తోడ్పాటు

>> ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో తమిళనాడుకు చెందిన రచయిత పర్యావరణ ఉద్యమకారుడు కేఎస్ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో తమిళ రచయిత పబ్లిషర్ మరవన్‌పులవు కె.సచ్చిదానందన్, ఎంజీఆర్ మనవడు సత్యరాజేంద్రన్, పలు ప్రజాసంఘాలు నాయకులు విద్యావంతులతో కూడిన బృందం శనివారం పవన్ కల్యాణ్‌తో సమావేశమైంది. తమిళనాడులోని వర్తమాన రాజకీయ పాలనాపరమైన పరిస్థితులు ఆ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు సంస్కృతి ధర్మపరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. తమిళనాడులోని సమస్యలు నా దృష్టిలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి జనసేన తన వంతు తోడ్పాటు అందిస్తుంది. ప్రజలకు మేలు చేకూరాలంటే బలమైన నాయకత్వం ఉండాలి. అప్పుడే భద్రంగా ఉన్నామనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం ఎంతటి శక్తిసామర్థ్యాలతో ఉన్నామో ప్రపంచం గుర్తించింది. అందుకు దేశానికి బలమైన నాయకత్వం ఉండటమే కారణం. సమాజంలో ఐక్యత ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం అని స్పష్టం చేశారు. మాజీ సీఎంలు ఎంజీఆర్ జయలలితలు శాంతిభద్రతలతోపాటు భిన్నత్వంలో ఏకత్వం సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆ స్ఫూర్తిని కొనసాగించాలి అని సూచించారు. ఎన్నో విశిష్టతల సమాహారం ద్రవిడ భూమి. ఏ రాష్ట్రంలో అయినా స్థిరమైన నాయకత్వం కావాలంటే ఎన్నికల్లో ఓట్ల చీలికను అరికట్టడం ముఖ్యం. దేశాభివృద్ధికి భవిష్యత్తు రాజకీయాల్లో బలమైన పొత్తు అవసరం ఉందని నమ్ముతా. దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుంది అని వివరించారు.

# కాశ్మీర్‌లో మళ్లీ మోగనున్న బడిగంట

**న్యూఢిల్లీ, మే 12:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అమలులోకి రావడం, సరిహద్దులోని పరిస్థితి సద్దుమణుగుతున్న నేపథ్యంలో కశ్మీర్‌లో మంగళవారం నుంచి మళ్లీ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. సరిహద్దు జిల్లాలైన కుప్వారా, బారాముల్లా, బండిపోరలోని గురెజ్ సబ్‌డివిజన్ మినహా కశ్మీర్ అంతటా ఈ నెల 13 నుంచి స్కూళ్లు తెరుచుకుంటాయని కశ్మీర్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రకటించారు. భారత్-పాక్ మధ్య పరస్పర కాల్పుల నేపథ్యంలో ఇంతకుముందు ఈ బడులను ముందుజాగ్రత్త చర్యగా మూసేశారు. కాగా, పంజాబ్‌లోని సంగ్రూర్ సహా ఐదు సరిహద్దు జిల్లాల్లో సోమవారం కూడా బడులు మూసే ఉంచారు. తక్కిన ప్రాంతాల్లో మాత్రం విద్యాసంస్థలు తిరిగి తెరుచుకున్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పఠాన్‌కోట్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, తరన్‌తరన్ జిల్లాల్లో పాఠశాలలు మూసే ఉంచారు. పాకిస్థాన్‌తో పంజాబ్‌కు 553 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22న ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చిచంపడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇందుకు ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేయడం, 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో యుద్ధపరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో ఇరుదేశాలు కాల్పుల విరమణకు ఈ నెల 10న అంగీకరించడంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణుగుతున్నాయి.

# మద్యం కుంభకోణం నిందితులను కఠినంగా శిక్షించాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం ద్వారా ప్రపంచం విస్తుపోయేలా వైకాంగ్రెస్ పార్టీ నేతలు అవినీతికి పాల్పడ్డారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ముఖ్యమంత్రే స్వయంగా డిస్టిలరీలు పెట్టడం, సొంత బ్రాండ్లు తయారు చేయించడం లాంటి విడ్డూరం ప్రపంచంలో ఎక్కడా చూడలేదన్నారు. మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సదస్సులో సత్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2014-19 మధ్య కాలంలో 49 వేల కిడ్నీ కేసులు నమోదైతే 2019-2024 మధ్య 91 వేలకు పెరిగాయన్నారు. కాలేయ సమస్యలకు సంబందించిన కేసులు సైతం భారీగా పెరిగినట్లు సత్యకుమార్ తెలిపారు. న్యూరో సంబంధిత కేసులు 380 నుంచి 7800కి పెరిగినట్లు చెప్పారు. గత ప్రభుత్వ నేతలు నాణ్యతలేని మద్యం తయారు చేయించి లక్షల మంది ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇది క్షమించరాని నేరమని బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరముందన్నారు.

# సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

**హైదరాబాద్,మే 12,ప్రభాతవార్త :** నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మన దేశానిది మన జీవఅవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సాంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వికులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు.. ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు.. పన్నెండేళ్లకు ఒక్కసారి పుష్కరాలు వస్తాయి.ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది యెక్క ప్రత్యేకత, రుగ్వేదం, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్తనదుల్లోనూ సరస్వతికి విశిష్టస్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... గంగే చయమునే చైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు..... అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈనెల 15 నుంచి 26 వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి.

మానా... సరస్వతి నది జన్మస్థానం సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రినాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామం. అక్కడ కూడా పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది అలకనంద నదికి ఉపనది కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా....ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగలో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్లోని పుష్కరలో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం. సరస్వతీ నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరంలో ప్రస్తుతం ఉన్న ఘాట్‌కు ప్రస్తుతం ఉన్న ఘాట్‌ను విస్తరిస్తూ సుమారు 86 మీటర్ల వెడల్పుతో నూతన ఘాట్‌ను నిర్మించారు. నూతన ఘాటపై 16 అడుగులు ఎత్తయిన సరస్వతి అమ్మవారి రాతి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు.పుష్కరాలు జరిగే 12 రోజులు నది హారతి నిర్వహించేందుకు హారతి ప్లాట్ ఫాంను ఏర్పాటు చేశారు.ప్రస్తుతం ఆ ఘాట్‌ను విఐపి ఘాట్‌గా పిలుస్తుండగా ఇక నుంచి సరస్వతి ఘాట్‌గా నామకరణం చేశారు.

# ఇడి విచారణకు మహేష్ బాబు గైర్హాజర్

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** టాలీవుడ్ హీరో మహేష్ బాబు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరు కాలేదు. సోమ వారం నాడు మహేష్ బాబు ఈడీ విచారణకు హాజరవుతారని వార్తలు వచ్చినా లండన్‌లో షూటింగ్‌లో వుండడంతో ఆయన రాలేదు. ప్రముఖ నిర్మాణ రంగ స ంస్థ సూర్య డెవలపర్స్‌తో పాటు సురానా సంస్థలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) గత నెలలో జరిపిన దాడుల తరువాత ఈ సంస్థ లకు ప్రమోటర్‌గా వున్న హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ రెండు సంస్థల ప్రాజెక్టులకు మహేష్ బాబు ప్రచారకర్తగా వ్యవ హరించారని ఈడీ గుర్తించడం విదితమే. ఇందుకుగానూ ఆయన 2.5 కోట్ల రూపాయల నగదు, 3.4 కోట్ల మేరకు చెక్ రూపంలో అందుకున్నట్లు ఈడీ నిర్ధారిం చి ఏప్రిల్ 28వ తేదీన హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మహేష్ బాబు ప్రచారం చేయడం తతవల్లే తాము ఈ సంస్థల్లో కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మోసపోయామని కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సాయి సూర్య డెవ లపర్స్‌తో పాటు సురానా సంస్థలపై ఈడీ దాడులు చేబట్టింది. అయితే షూటింగ్‌ల కారణంగా మహేష్ బాబు ఏప్రిల్ 28వ తేదీ విచారణకు రాలేదు. సోమవా రం నాడు ఆయన కచ్చితంగా వస్తారని భావించినా లండన్‌లో వుండడం వల్ల రాలేదని తెలిసింది. అయితే దీనిపై ఈడీ అధికారులు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మహేష్ బాబుకు మరో తేదీన విచారణకు రావాలని ఆదేశించే వీలుంది.

# బుద్ధవనంలో వరల్డ్ 'మిస్'లు గట్టి భద్రత మధ్య విహారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే12:** తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది కంటెస్టెంట్స్ బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది.ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్‌లో ఫోటోలు దిగారు.అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహాస్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. మహాస్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత, బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతకవనంలో బుద్ధ చరితంపై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్‌పి శరత్ చంద్ర పవార్,ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి,బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం,నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను, తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు.

# తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ద్రోణి ప్రభావంతో తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే రెండో రోజు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగులు వీస్తాయన్నారు.

# జూన్ 13 దాకా హైకోర్టుకు సెలవులు

>> నాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా కేసులు విచారించనున్నారు. రెండోదశ వెకేషన్ కోర్టులు జూన్ 5, 12వ తేదీల్లో విచారణ చేపడతాయి. జూన్ 5, 12వ తేదీల్లో జస్టిస్ జస్టిస్ ఎం.కిరణ్మయి, జస్టిస్ టి.సి. డి.శేఖర్ డివిజన్ బెంచ్, జస్టిస్ కుంచం మహేశ్వరరావు సింగిల్ బెంచ్ నిర్వహిస్తారు.

# 16న జిల్లా కేంద్రాల్లో తిరంగా ర్యాలీ

## బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**విజయవాడ,మే12,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ,భారత సైనికులు వెంటే జాతి యావత్తూ ఉందని తిరంగా ర్యాలీ లు నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపునిచ్చారు. బిజెపి శ్రేణులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ భారతీయుల మనోభావాలు కు సంబంధించిన విషయం, అదేవిధంగా స్వదేశీ ఆయుధాలు ఎంత శక్తివంతంగా పనిచేస్తుందో ప్రపంచానికి పరిచయం అయిందన్న విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలో ప్రస్తావించిన విషయాలు వివరిస్తూ ఎన్ డి ఎ కూటమి నేతలను, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి జిల్లా కేంద్రంలో 16వ తేదీన ర్యాలీ లు నిర్వహించాలన్నారు, అదేవిధంగా 18వ తేదీన మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. భారత సైనికులకు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మద్దతు తెలుపుతూ ర్యాలీలు నిర్వహించాలన్నారు.

# గెస్ట్ లెక్చరర్‌కు వేతనం పెంపు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గెస్ట్ లెక్చరర్ లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గంటకు ఇస్తున్న రూ.150 పారితోషికాన్ని రూ.375కు పెంచగా, నెలకు గరిష్టంగా రూ.27,000గా నిర్ణయించింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని తాజాగా విడుదలైన జీఓలో ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 475 జూనియర్ కాలేజీల్లో పని చేసే 1,177 మంది గెస్ట్ లెక్చరర్లు లబ్ధి పొందనున్నారు.

# మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డిని విచారణ చేసిన పోలీసులు

>> చేయడానికి ప్రయత్నించాను. పోలీసుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే నా పై కేసులు నమోదు చేశారు. వైసీపీ అధినేత జగన్‌కు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారు. దీనిని మేము ప్రశ్నిస్తే మా పై కేసులు పెట్టారు అని ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. తమనేత వైఎస్ జగన్ పర్యటన కోసం రామగిరి మండలంలో హెలిప్యాడ్ ఏర్పాట్లు నేను పర్యవేక్షించలేదని, ఇందుకోసం పోలీసుల అనుమతిని కూడా నేను కోరలేదని ఆయన చెప్పారు. హెలికాప్టర్‌పై అభిమానులు చొచ్చుకు వచ్చే సమయంలో డీఎస్పీ దగ్గరున్నా మైకు తీసుకొని నేనే కంట్రోల్ కూడా చేశానని, అయితే నేనే రెచ్చగొట్టినట్టు పోలీసులు నాపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సికెపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల విచారణలో మొత్తం 102 ప్రశ్నలు అడిగారు అని, అన్నింటికీ సమాధానం చెప్పాను అని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చెప్పారు. మొత్తం మీడియా, పోలీసులు పాపిరెడ్డి పల్లెలో జరిగిన కురుబ లింగమయ్య హత్యను పక్కదారి పటిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చమీడియా ఈ కేసును సైడ్ ట్రాక్ చేస్తోందని, లింగమయ్య హత్య సంఘటనను, పక్కనపెట్టి హెలికాప్టర్ ఘటనని చూపిస్తోందని ఆయన ప్రశ్నించారు. మీడియానే అన్నీ డిసైడ్ చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. హెలికాప్టర్‌పై దాడి కేసులో హైకోర్టు 41ఎ నోటీసులు ఇచ్చి విచారించమని చెప్పింది అని, అయితే నన్ను అరెస్ట్ చేయమని, లాక్కురండి అని చెప్పారని మీడియాలో ప్రచారం చేశారని ఆయన ఆక్రోసం వెళ్ళగక్కారు.అసలు లింగమయ్య హత్య పరిటాల శ్రీరామ్ పై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు.లింగమయ్య హత్య జరిగిన తర్వాత శ్రీరామ్ విదేశాలకు పారిపోయాడని, చంద్రబాబు హయాంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా ఆయన ప్రశ్నించారు.

# పూర్తిగా గిరిజనులకే

>> సూచించారు. ఈ నేపథ్యంలో తిరిగి ఈ ఉత్తర్వుల ద్వారా లభించే లబ్దిని గిరిజ నులకు తిరిగి అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఇందులో భాగంగా న్యాయపరమైన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, గిరిజన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని సిఎం అన్నారు.

**ముఖ్యమంత్రి ముందు మూడు ఆప్షన్లు**

జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ప్రస్తుతం ఉన్న మూడు అవకాశాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఆప్షన్‌గా ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండవ ఆప్షన్‌గా స్థానిక గిరిజనులకు వారి యెక్క జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం, మూడవ ఆప్షన్‌గా సుప్రీంకోర్టు సూచించినట్టు 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిక్షించడం వంటి అవ కాశాలను అధికారులు సిఎం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సిఎం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో గిరిజనుల హక్కులకు కట్టుబడి ఉన్నామని ఎన్నికలసమయంలో చెప్పినట్లు జీ.వో నెంబర్ 3 పునరుద్ధరించడం లేదా అదే స్థాయిలో గిరిజను లకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదిం పులు జరపాలి" అని సిఎం అన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు విద్యవైద్య సదుపాయాలు కల్పిస్తూ, ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని సీఎం అన్నారు. వారికి న్యాయం చేసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులు కునే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఎపి భవన్‌కు చేరిన 400మంది విద్యార్థులు

>> సరిహద్దుల్లోని రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఏపీ వాసులు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా సాయం కోసం 011-23387089, మొబైల్ నెంబర్లు 9871999430, 9871999053లలో సంప్రదించవచ్చని ఏపీ భవన్ రెసిడెంట్ కమీషనర్ తెలిపారు. ఏదైనా అదనపు సమాచారం,సహాయం కావాలంటే ఏపీ భవన్ డిప్యూటీ కమీషనర్ ఎంవీఎస్ రామారావు 9871990081,లైజన్ ఆఫీసర్ వి.సురేష్‌బాబు 9818396787లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 13-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి రా.12.35
విశాఖ ఉ.9.08
వర్జ్యం మ.1.34-3.21
దు.ఉ.8.13-9.05, 2) రా.11.40-12.32
శుభసమయం : ఉ.7.30-8.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**వృషభం :** ఉద్యోగాలలో స్వల్పమార్పులు వుంటాయి. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మిథునం:** బాకీలు వసూలవుతాయి. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభం.

**కర్కాటకం:** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో అంచనాలు నిజం చేసుకుంటారు.

**సింహం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో పదోన్నతులు, హోదాలు పొందుతారు.

**కన్య :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**తుల :** అనుకోని అవకాశాలు పొందుతారు. వాటిని సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** నిరుద్యోగుల యత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**ధనుస్సు:** ఉద్యోగాలలో సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కుంభం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మీనం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

GNT 13-05Pg3exHMNWJQEPSVLR-ff.qxd:13-05Pg3exHMNWJQEPSVLR-ff.qxd 01/01/01 10:43 AM Page 1



# కాలువల తవ్వకం పనులు మే నెలాఖరుకు పూర్తి చేయాలి

## - జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు


ఇరిగేషన్ అధికారుల టెలీకాన్ఫరెన్స్ లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా కాలువల్లో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు, షట్టర్లు, గేట్ల మరమ్మత్తులు, గ్రీజు పెట్టడం వంటి నిర్వహణ పనుల కోసం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 344 కోట్ల రూపాయలు విడుదల చేశారని, ఈ పనులను స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. సోమవారం విజయవాడలో జలవనరుల క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలు, ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారాయన. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, కడా కమీషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వర రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గుర్రపుడెక్క, తూటకాడ వంటి వాటి తొలగింపుకోసం, మందుల పిచికారీకి డ్రోన్లు సైతం వినియోగించుకోవాలని సూచించారాయన. అవసరమైన చోట్ల 7 రోజుల వ్యవధితో షార్ట్ టెండర్లు పిలవడానికి అనుమతిచ్చిందని, నిర్వహణ మరియు మరమ్మత్తు పనులను చేపట్టడం యొక్క ప్రధాన లక్ష్యం, 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందు నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావడం అని ఆయన అధికారులకు సూచించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్ కు ఇవ్వాలని ఆదేశించారు. సాగు నీటి సంఘాలు ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తిచేయాలి. ఇలా పనులను సకాలంలో పూర్తిచేయడానికి చీఫ్ ఇంజనీర్లు, సూపరిండెంట్ ఇంజనీర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి నిమ్మల రామానాయుడు, గతంలో మాదిరిగా కాకుండా మే చివరి నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యత తో పూర్తి చేయాలన్నారు.



# పొరుగు దేశాల మధ్య సమస్యల పరిష్కారానికి యుద్ధమే కీలకం కాదు

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** పొరుగు దేశాల మధ్య సమస్యలను పరిష్కరించుకోవడాని యుద్ధమే కీలకం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. మన దేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఉన్మాదాల శిబిరాలపై ఆపరేషన్ సింధూరను సీపీఐ సమర్ధించిందన్నారు. అయితే యుద్ధంపై తమ పార్టీ లైన్ తమకుందన్నారు. అందుకే అనివార్యమైతే తప్ప యుద్ధం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వద్దన్నారు. దీనిపై ఆయనను పాకిస్థాన్‌కు పంపించాలంటూ బీజేపీ సీనియర్ నేత ఎమ్మెల్సీ సోము వీర్రాజు మతిభ్రమించి విమర్శలు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఖండించారు. ట్రంప్ చెబితే ప్రస్తుతం భారత్ పాక్ యుద్ధం ఆగిందా? లేదా?, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజల విచక్షణను గాలికి వదిలి ట్రంప్ చెప్పిన మాటలు విని యుద్ధం ఆపేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లి గురువు ట్రంప్‌తో ఉంటే మంచిదని హితవు పలికారు. దేశం ఉనికి ప్రమాదం వస్తే వామపక్షాలు ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామన్నారు. మన దేశ ప్రజలపై యుద్ధం ప్రభావం ఉండకూడదన్నారు.

# ఎపి-ఇఎపిసెట్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

**విజయవాడ,మే 12,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ-ఈఏపీసెట్-2025కు సంబంధించిన హాల్‌టిక్కెట్లను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు కలిపి మొత్తం 3,61,299 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్నాయి. సందేహాలకు 0884-2359599,2342499 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.



# అమరావతి నిర్మాణపనులు పునఃప్రారంభం ఆనందం

## - మంత్రులు అచ్చెన్న, కొల్లురవీంద్ర

**తిరుమల,మే 12 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి పనులు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పునఃప్రారంభం కావడం ఆనందంగా ఉందని రాష్ట్రమంత్రులు కె. అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్ర తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని మంత్రులు ఉద్ఘాటించారు. రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులు అమలవుతున్నాయన్నారు. పోలవరం కూడా పూర్తిచేసేలా సిఎం చంద్రబాబుకు శక్తిని ఇవ్వాలని వేడుకున్నామన్నారు. సోమవారం ఉదయం తిరుమలేశుని ఆలయంలోనికి చేరుకున్న మంత్రులు విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి ఐఐటికి మహర్దశ

## రూ.2300కోట్లు నిధులు మంజూరు

### అంతర్జాతీయ స్థాయికి తీర్చి దిద్దుతాం: డైరెక్టర్ ప్రొ.సత్యనారాయణ


తిరుపతి ఐఐటి దృశ్యం

**శ్రీకాళహస్తి,మే 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తిరుపతి ఐఐటికి మహర్దశ వస్తుందని రాబోవు రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ఐఐటిని తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయనను ప్రభాతవార్త పలకరించినపుడు ఐఐటి రాబోవు 4 సంవత్సరాల్లో చేపట్టబోయే ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు. రాబోవు నాలుగు సంవత్సరాలకు గాను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తిరుపతి ఐఐటికి రూ.2300కోట్లు నిధులు మంజూరు చేసినట్లు సమాచారం అందిందన్నారు. రాబోవు నాలుగుసంవత్సరాల్లో ఐఐటికి మహర్దశ వస్తుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2015లో మంజూరు చేసిన ఐఐటిల్లో తిరుపతి పేరుతో ఒక ఐఐటిని, అలాగే ఐసర్‌ను ఏర్పాటుకు మంజూరు చేసారన్నారు. ఐఐటిని 539 ఎకరాల్లో నిర్మాణానికి ప్రణాళికలు రచించి అమలు చేసామన్నారు. 2017నుంచి నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. సుమారు 4 సంవత్సరాల పాటు తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలతో అతిధిగా విద్యాసంవత్సరాలను గడిపామన్నారు. అలాగే హస్టల్‌ను ప్రైవేటు భవనాల్లో గడిపామన్నారు. రెండేళ్ళ క్రితం ఏర్పేడు మండల కేంద్రంలో సొంత భవనాల్లోకి ప్రవేశించామన్నారు. 2017 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సర వరకు రూ.1100 కోట్లు వెచ్చించినట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. సకల సదుపాయాలతో సంపూర్ణ స్థాయిలో తిరుపతి ఐఐటి నిర్వహిస్తున్నామని వివరించారు. సొంత భవనాల్లోకి ప్రవేశించిన తరువాత ఎన్నో ఆవిష్కరణలు ఎన్నో ఒప్పందాలు జరిగాయన్నారు. అంతేకాక విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుటకు ప్రయత్నిస్తున్నామని అయితే తన సిబ్బంది సహకారం ఎంత చెప్పినా తక్కువే అన్నారు.

# మాజీ ఎంపి దరూరు పుల్లయ్య గుండెపోటుతో కన్నుమూత

## - కాంగ్రెస్ నుండి రెండు సార్లు ఎంపిగా ఎన్నిక

**ఉరవకొండ, మే 12 ప్రభాతవార్త** అనంతపురం మాజీ పార్లమెంటు సభ్యులు, సాగునీటి రంగ నిపుణులు దరూరు పుల్లయ్య (86) గుండె పోటుతో సోమవారం మధ్యాన్నం కన్నుమూశారు. కంప్లి కొట్టాల గ్రామంలోగల తమ పంట పొలాలను చూడటానికి వెళ్లి అక్కడే గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయన స్వగ్రామం ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం. ఆయనకు భార్య దరూరు సత్యవతి, కుమారుడు దరూరు రమేష్ (ఛాయాపురం గ్రామం మాజీ సర్పంచ్), ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. చాలా కాలంగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. దరూరు పుల్లయ్య 1939 జూన్ 20న మద్రాసు ప్రెసిడెన్సీ లో జన్మించారు. చెన్నైలోని లయోలా కళాశాలలో చదువుకున్నారు. మద్రాసు న్యాయ కళాశాలలో న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన 1977, 1980లో రెండుసార్లు 6వ, 7వ లోక్‌సభకు అనంతపురం నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. 1994లో కాంగ్రెస్ పార్టీ తరపున ఉరవకొండ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ చేతిలో ఓడిపోయారు. కొన్ని సంవత్సరాల తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో పాలొ ్గంటూ ప్రత్యేక వర్గాన్ని నిర్వహించారు. సాగునీటి రంగంపై అపారమైన అనుభవం కల్గిన దరూరు పుల్లయ్య రాష్ట్రంలోని ప్రధానమైన జలాశయాలు,

ప్రాజెక్టులు వాటి పుట్టుపూర్వోత్తరాలపై అనేక అధ్యయనాలు చేశారు. కరువు పీడిత రాయలసీమ, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కరువును, వెనుకబాటు తనాన్ని రూపుమాపడానికి ప్రభుత్వాలకు ఎంతో విలువైన సలహాలు, సూచనలు చేసి అనేక ఉద్యమాల్లో సైతం పాల్గొని తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి పథకంకు అమలుకు ఆయన కృషి చేశారు. జిల్లా అభివృద్ధి కోసం పార్టీలు పక్కనబెట్టి కమ్యూనిస్టు యోధులు వి.కె.ఆదినారాయణరెడ్డితో కలిసి పనిచేశారు. వి.కె మరణానంతరం వి.కె.ట్రస్టు ఏర్పాటు చేయడంతోపాటు ఆయన పేరుమీద వి.కె ట్రస్టు భవనం నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. దాదాపు 15 సంవత్సరాలుగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా బళ్లారిలోనే నివశిస్తున్నారు.

# రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులా? దిగజారిన శాంతిభద్రతలు : సజ్జల

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను నీరుగారుస్తూ, రాజకీయ కక్షసాధింపులకు వినియోగిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలపై వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అందుబాటులో ఉన్న పార్టీ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ కక్షసాధింపు చర్యలు, పోలీసులను వినియోగించుకుంటున్న తీరు, దిగజారిన శాంతిభద్రతలు, తాజాగా మాజీ మంత్రి విడదల రజిని పట్ల స్థానిక సీఐ అమానుషంగా వ్యవహరించిన వైనంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రాష్ట్రంలో పోలీసులు పరిధి దాటి వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటూ, రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థనే నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలపై ఉదాహరణలతో సహా సమావేశంలో ప్రస్తావించారు. తాజాగా మాజీ మంత్రి విడదల రజిని పట్ల పోలీస్ అధికారి వ్యవహరించిన తీరు రాష్ట్రంలో పోలీసుల ద్వారా ప్రభుత్వం చేయిస్తున్న దౌర్జన్యకాండకు నిదర్శనమని పలువురు నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, పోలీస్ యంత్రాంగాన్ని తప్పుదోవలో నడిపిస్తున్న వైనంను ప్రజలు ముందు పెట్టేందుకు వైయస్ఆర్‌సీపీ ఒక కార్యాచరణను సిద్ధం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి సర్కార్ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తోందని, ఎవరైనా ప్రభుత్వ వైఫ్యలాలను నిలదీస్తే పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు సైతం కేసుల నమోదులో చట్టపరమైన నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో పరిస్థితులు దిగజారి పోయాయని, డీజీపీకి ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఇవ్వక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నిసార్లు డీజీపీ అపాయింట్‌మెంట్ కోరినా స్పందించ పోవడం దేనికి సంకేతమని నిలదీశారు. ఈ మొత్తం వ్యవహారంను వైయస్ఆర్‌సీపీ సీరియస్‌గా తీసుకుంటోందని, వ్యవస్థలను కాపాడేందుకు బాధ్యత గల ప్రతిపక్షంగా దీనిపై స్పందిస్తుందని అన్నారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, జోగి రమేష్, విడదల రజిని, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహన్‌రావు, అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులు దేవినేని అవినాష్, వేమారెడ్డి, పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల వివరాలు

**విజయవాడ,మే12.ప్రభాతవార్త ప్రతినిధి:** టైపురైటింగ్ మరియు షార్ట్ హ్యాండ్ పరీక్షల తేదీలను ప్రకటించినట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ బోర్డు కార్యదర్శి జి.వి.రామచంద్ర రావు, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ హ్యాండ్ పరీక్షను ఈ ఏడాది జూలై 12 మరియు 13వ తేదిలలో, టైప్ రైటింగ్ పరీక్షను, ఈ ఏడాది జూలై 19 మరియు 20 వ తేదిలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ను మే నెల చివరి వారంలో జారిచేయనున్నట్లు ఆయన చెప్పారు. పూర్తి వివరాలు మరియు పరిక్షలకు సంబంధించిన తాజా సమాచారం కొరకు అభ్యర్థులు రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ బోర్డు, మంగళగిరి, అధికారిక వెబ్ సైట్ ను సందర్శించాలని జి.వి.రామచంద్ర రావు కోరారు.

# పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టిక్కెట్లు రెడీ

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాల్ టికెట్లు విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ హాల్ టికెట్లను సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకో వచ్చుని విద్యార్థులకు ప్రభుత్వం సూచించింది. విద్యార్థులు.. తమ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్‌లో సైతం ఈ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చుని వివరించింది. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఎవరైనా వీటి ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చుని పేర్కొంది. విద్యార్థులు.. తమ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్‌లో సైతం ఈ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చుని వివరించింది. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఎవరైనా వీటి ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చుని పేర్కొంది. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది.



# తిరుమల రెండోఘాట్‌లో 'చిరుత'!

## - ద్విచక్రవాహనదారులు బెంబేలు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి కాలంలో అటవీప్రాంతంలో నీరు, ఆహారం దొరకక దారితప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు. తాజాగా సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో వినాయకుడి గుడి సమీపంలో ఓ చిరుతపులి అడవిలోంచి ఘాట్‌రోడ్డు దాటడాన్ని ద్విచక్రవాహనదారులు గమనించారు. వెంటనే భయంతో విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సాధారణంగా శేషాచలంఅటవీ ప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక, ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.

## రెండుటన్నుల పుష్పాలు, పత్రాలతో

# కపిలేశ్వరునికి పుష్పసోయగం

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 2టన్నులు పత్రాలు, 2టన్నులు పుష్పాలతో శోభాయమానంగా పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆకులతో కపిలేశ్వరస్వామి, కామాక్షిఅమ్మవారి ఉత్సవమూర్తులకు పుష్పాలతో స్పృశించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు పాలు, పెరుగు, తేనె, చెరకురసం, విబూది, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో కలశస్నపనతిరుమంజనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక ,తమిళనాడునుండి దాతలు విరాళంగా పంపిన పుష్పాలు, పత్రాలతో విశేషంగా అభిషేకించారు. ఆలయంలో ఇటీవల బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులవల్లగానీ, అర్చకులవల్ల, అధికారుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం జరిపించడం పరిపాటి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులు, ఎఇఒ సుబ్బరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, భక్తులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

# కల్తీనెయ్యి ఘటనపై ఛార్జిషీటు!

## - 15మంది నిందితులుగా పేర్కొన్న సిట్

**తిరుమల,మే 12 ప్రభాతవార్తప్రతినిధి:** హిందువులకు ఎంతో విశ్వాసమున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే సంచలన కేసులో సిబిఐ సిట్ అధికారులు ఛార్జిషీటు దాఖలుచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరు ఏసిబి కోర్టులో సిట్ దాఖలు చేసిన మొదటి ఛార్జిషీట్‌లో 15మందిని నిందితులుగా పేర్కొంది. ఇందులో ఆరుగురిని ఇప్పటికే సిట్ అరెస్టుచేసి, అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టి ఆధారాలు సేకరించింది. మిగిలిన వారిలో నెయ్యిసరఫరాకు



చెందిన సరఫరాదారులు, నిర్వాహకులు, ఉద్యోగులు ఉన్నారు. ఏఆర్‌డైయిరీ, బోలేబాబాడెయిరీ, వైష్ణవిడెయిరీల ఉద్యోగులను నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే. ఇద్దరు టిటిడి ఉద్యోగులును ఇప్పటికే అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచింది. 20మందిని టిటిడి ఉద్యోగులను సాక్షులుగా పేర్కొంది. సిబిఐ సిట్ అధికారులు పూర్తిగా గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని పూర్వటిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించారు. కల్తీనెయ్యికి సూత్రధారులు, పాత్రధారులు ఎవరని తేల్చేపనిలో మూలాలు కదిలించనున్నారు. ఇప్పుడు నెయ్యిసరఫరాకు కీలకంగా అనుమతించడంలో పూర్వ టిటిడి బోర్డు పెద్దలు, ఓ ఉన్నతాధికారికి నోటీసులు ఇవ్వాలని ఆలోచనలో ఉన్నారనేది సమాచారం.

# నిండుపౌర్ణమిన వేడుకగా గరుడసేవ

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** చల్లట వాతావరణంలో ఆకాశం ప్రశాంతంగా మబ్బులతో ఉన్న వేళ పౌర్ణమి ఘడియల్లో పున్నమివెలుగుల్లో సోమవారం రాత్రి శ్రీమలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరు కున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకారభూషితుడైన మలయప్పను



కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగింది. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.


**AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)**
(CIN Number : U93000AP2015SGC105535), Email : ccdmc.amaravati@gmail.com
54-15-1, Venkateswara Nagar, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008.

**Request for Proposal**

NIT No. 409/ADCL/IPD/2025 Dated: 12.05.2025

Request for Proposal (RFP) for Engagement of Project Management Consultant (PMC) for (i) Construction of Roads, Storm Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts for Power & ICT, Reuse Waterline, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture in E16, N1, N2, N3A&3B, N5 Roads in Amaravati and (ii) Construction of Road, Storm water Drainage, and Utilities for (a) E15 Road Extension to Old National Highway Mangalagiri and (b) E13 Road Extension to National Highway-16; including DLP 2 years in Andhra Pradesh.

The RFP can be downloaded on AP e-procurement portal from 13.05.2025 to 04.06.2025 up to 15.30 Hrs. Due date for submission of Bid is 04.06.2025 up to 16.00 Hrs, Technical Bid opening is on 04.06.2025 @16.30 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in

Sd/- Chairperson and Managing Director, ADCL, Vijayawada



**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - విశాఖపట్నం**
గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ భవన్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020.

**ఓ.ఎ.నెం.85/2025**

డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రక్రియ) రూల్స్, 1993 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సమన్లు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గణపవరం), ప్రాతినిధ్యం వహించువారు మేనేజర్ & అధీకృత సంతకందారు ... దరఖాస్తుదారు

మరియు

గూడే తిరుపతయ్య

టు,
**శ్రీ గూడే తిరుపతయ్య,** తండ్రి : వెంకట స్వామి, ఫ్లాట్ నెం.101, 2వ అంతస్తు, బృందావనం అపార్ట్‌మెంట్, జాస్మిన్ సౌత్ బ్లాక్, ఏటుకూరు, గుంటూరు జిల్లా - 522003. వేరొక చిరునామా: డి.నెం.7-83, గూడేవారిపాలెం, పెదవలపూడి, ప్రకాశం జిల్లా - 523111. ... ప్రతివాది

**పేపరు ప్రచురణ ద్వారా ప్రతివాదులకు సమన్లు**

గౌరవనీయ ప్రిసీడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ వారి సమక్షమున **ఓ.ఎ.నెం.85/2025, తేది.28.05.2025న** జాబితా (లిస్టెడ్) చేయటమైనది.

రుణం **రూ.32,92,611.84** పై వసూలు కొరకు మీ పైన వేసిన దావా (ఓ.ఎ) ననుసరించి, చట్టం యొక్క 19(4) సెక్షన్ క్రింద సదరు దరఖాస్తు పైన గౌరవనీయ ట్రిబ్యునల్ సమన్లు / నోటీసు జారీ (దరఖాస్తు డాక్యుమెంట్లు కాపీలు వగైరాతో మా సమక్షమున అందచేయబడతాయి) చేయబడినది.
చట్టం యొక్క 19వ సెక్షన్ (4) వ సబ్-సెక్షన్ తదనుగుణంగా, మీరు, ప్రతివాదులు ఈ క్రింది అంశాలు గమనించవలెను:
1) సమన్లు జారీ చేసిన 30 రోజులలోగా కోరిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి.
2) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన ఎస్సెట్స్ లేదా ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు మరియు ఎస్సెట్స్ వివరాలను వెల్లడించాలి.
3) ఆస్తులు ఎటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉన్నందున, సెక్యూర్డ్ ఎస్సెట్స్ లేదా అటువంటి ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన వాటితో లావాదేవీలు చేయుట లేదా విక్రయించుట నుండి మిమ్మల్ని నిరోధించడమైనది.
4) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన లేదా బహిరంగ పరచిన సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఎస్సెట్స్ మరియు / లేదా ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు పైన మీరు సాధారణ వ్యాపారం మినహా, వాటిని ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించుట, లీజు లేదా ఇతరత్రా లావాదేవీల ద్వారా మీరు బదిలీచేయ వీలులేదు.
5) సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు అమ్మకం ద్వారా వచ్చిన అదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అట్టి విక్రయ ఆదాయాన్ని సదరు ఆస్తులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ కలిగియున్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థలు నందు నిర్వహిస్తున్న ఖాతా నందు జమ చేయవలెను.
ఇందుకు సంబంధించి లిఖిత స్టేట్‌మెంట్‌ను దాని కాపీని దరఖాస్తుదారునికి దాఖలు చేస్తూ **తేది.28.05.2025న ఉదయం 10.30 గంటలకు** ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమక్షంనకు హాజరు కావలసినదిగా కూడా మీకు సూచించడమైనది అట్లు చేయనిచో దరఖాస్తు మీ పరోక్షమున విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.
(ఇది నా స్వహస్తాలతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో 05 మే, 2025న ఇవ్వడమైనది)

సం/- అధీకృత అధికారి వారి సంతకం
సమన్లు జారీ చేయు వారు



**pnb Housing Finance Limited** Ghar Ki Baat

**అనుబంధం-IV-A - ఇ-వేలం-స్థిరాస్తి (లు) యొక్క బహిరంగ అమ్మకపు ప్రకటన**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ద్వారా చదువవలసిన రూల్ 8(6) నిర్దేశిత ఇ-వేలం స్థిరాస్తుల అమ్మకపు ప్రకటన
నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ- 110001. ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com
B.O. విజయవాడ : #39-3-1, 2వ అంతస్తు, ఆంజనేయులు జెవెల్లర్స్‌పైన, M.G. రోడ్, విజయవాడ-520010.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకించి కాలమ్ నెం.ఎ యందు పేర్కొనబడిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)లకు నోటీసు జారీ చేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ వద్ద తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన కాలమ్ నెం.డి యందు తెలుపబడిన స్థిరాస్తు(ల)ను, (కాలమ్ నెం. సి యందు పేర్కొనబడిన) వానిని M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్, నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసికొని యున్నారు మరియు దిగువ తెలుపబడిన వివరముల ప్రకారం "ఏది ఎక్కడ" ఉందో అక్కడే, ఏది ఎలాగుందో అలాగే, మరియు ఏదైతే ఉందో దానిని" ప్రాతిపదికన అధీకృత అధికారిచే వేలం ద్వారా విక్రయించబడును. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యందు ఇటీ తేదీ నాటికి సవరింపబడిన విధంగా గల రూల్ 8(6) మరియు 9 ప్రకారం కాలమ్ నెం. ఎ యందు తెలిపిన విధంగా కేసును బట్టి రుణగ్రహీతలు/తనఖాదారులు (మృతి చెంది ఉన్నట్లయితే) వారి యొక్క రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/చట్టబద్ధవారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెలిసినవారు లేదా తెలియనివారు), ఎగ్జిక్యూటర్లు, పాలనాధికారులు, సక్సెసర్లు, అసైనీలకు నోటీసులు ఇవ్వబడుచున్నవి. మరిన్ని సవివరమైన నియమ నిబంధనల కొరకు విక్రయానికి సంబంధించి M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యందు ఇవ్వబడిన లింకును, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్‌ను అనగా www.pnbhousing.com చూడవచ్చును.

| రుణం నెం./రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/హామీదారు/చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనత స్వభావం(C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు వెల (RP) (E) | బయానా(RP యొక్క10%) (F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంట్ రేట్(H) | ఇన్‌స్పెక్షన్ తేది మరియు సమయం(I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు ఏవైనా ఉన్నట్లయితే (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/VJWD/1221/935682 పోలాబత్తిన గాయత్రి, పోలా బత్తిన అవసూయ, M/s. సంజీవిని క్రీస్ పాయింట్ B.O.: విజయవాడ | రూ.27,00,960 & 18.07.2023 | సింబాలిక్‌గా స్వాధీనం | గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్‌రిజిస్ట్రీ, తాడేపల్లిమండలం, గుండిమెడ గ్రామం Do, పంచాయత్, ఐ.నం. 306B, ROR అడంగల్ ప్రకారం ఐ.నం. 305లో ప్లింత్ ఏరియా 777చ+., కామన్ ఏరియా 287చ+, పార్కింగ్ ఏరియా 121చ+.,తో ఆరాధ్య అవాస్ యొక్క నాల్గవ అంతస్తులోని 508నం. కలిగిన ఫ్లాట్ దానిలోని ఒక ఫ్లాట్‌తో సహా స్థలం యొక్క 3391.35చ.గజాలు (2835.60చ.మీటర్లు) మొత్తం విస్తీర్ణంలో అవిభాజ్య వాటా యొక్క 43.894చ.గజాలు (36.70చ. మీటర్లు) యొక్క విస్తీర్ణం. సరిహద్దులు: స్థలసరిహద్దులు. తూర్పు: కుర్రె శేషారత్నం యొక్క ఆస్తి. దక్షిణం: బట్టిగం భాస్కరరెడ్డి యొక్క ఆస్తి. పడమర: సర్వీస్ రోడ్. ఉత్తరం: బొమ్మారెడ్డి ధనలక్ష్మి యొక్క ఆస్తి/ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: బహిరంగం. దక్షిణం: బహిరంగం. పడమర: కామన్ కారిడార్, ఉత్తరం: ఫ్లాట్ నం.408. | రూ.18,55,000 | రూ.1,85,500 | 28-05-2025 | రూ. 10,000 | 19-05-2025న 11 గం.నుండి సా.5గం. | 29-05-2025 ఉ.02 గం.నుండి మ.3గం. | తెలియవు |

* దీనికి తదుపరి వడ్డీ, @ 18% P.A వర్తించే తగు వ్యయములు, ఖర్చులు మొదలైనవి చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా రియలైజేషన్ వరకు ** PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి యొక్క ఎరుక మరియు సమాచారం మేరకు పైన తెలుపబడిన స్థిరాస్తి పై కాలమ్ నెం. కె యందు తెలుపబడినవి తప్పించి మరెటువంటి ఇతర అభ్యంతరములు/క్లెయిమ్‌లుగానీ లేవు. తదుపరి అట్టి అభ్యంతరములు ఉన్నచో, అట్టి వానిని కొనుగోలుదారు/బిడ్డరు చెల్లించవలసి యుంటుంది. ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డర్లు తెలుపబడిన విధంగా ఏవైనా అభ్యంతరములు ఉన్నచో వాటిని తామే స్వయంగా తెలుసుకోవలసి యుంటుంది.
1. పైన తెలుపబడిన స్థిరాస్తులు/సెక్యూర్డ్ ఆస్తులపై ఈ తేది వరకు PNBHFL/PNBHFL యొక్క అధీకృత అధికారి సదరు ఆస్తి విక్రయించేందుకు కేటాయించేందుకు, మరియు/లేదా అమ్మివేయుటకు ఎటువంటి ఆటంకపరిచే ఆర్డరుగాని, మరియు కోర్టువారి ఇంజక్షన్ గానీ లేదు. 2. కాలమ్ నెం.కెలో తెలిపిన విధంగా ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డరు మరియు ఆసక్తి గల పార్టీలు స్వతంత్రంగా ఏవేని అభ్యర్థనలు వగైరాలు ఉన్నచో వానిని పర్యవేక్షించుకొనగలరు. కానీ టైటిల్ యొక్క డాక్యుమెంట్ల పరిమితిలో కాదు ఇందుకు సంబంధించిన టైటిల్ PNBHFL కార్యాలయం యందు బిడ్డింగ్‌లో పాల్గొనే ముందు టెండరు/బిడ్ దరఖాస్తునకు ముందు లేదా ఆఫర్లు ఇచ్చేముందు అన్ని విధాలుగా పరిశీలించి సంతృప్తి చెందేందుకుగాను లభ్యంగా గలదు. బిడ్డర్లు బిడ్ ఫారమ్‌తోపాటుగా ఈ వేలానికి సంబంధించిన అన్ని నియమ నిబంధనలపై సంతకం చేయవలసి ఉంటుంది. 3. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యందలి రూల్ 9(3) నిబంధనలను అనుసరించి, బిడ్డర్లు/కొనుగోలుదారు అమ్మకపు మొత్తం (బయానా ధరావతును ఒకవేళ డిపాజిట్ చేసినట్లయితే దానితో సహా) అమ్మకపు విలువలో 25% మొత్తాన్ని చట్టబద్ధంగా జమచేయవలసి ఉంటుంది. అట్టి దానిని అదే రోజున లేదా తదుపరి పని దినాన జమ చేయవలెను. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నిబంధన 9(2) ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా నిర్ణయించిన విధంగా అమ్మకపు విలువలో 25% మొత్తాన్ని జమచేసిన మీదట మాత్రమే సేల్ బిడ్డరు(ల) యొక్క పేరిట నిర్ధారించబడుతుంది. విక్రయ పరిగణన మొత్తం యొక్క మిగతా 75% మొత్తం కొనుగోలుదారునిచే విక్రయ నిర్ధారణ పత్రం యొక్క ఎక్నాలెడ్జ్‌మెంట్ తేదీ నుండి 15 రోజులలోగా జమ చేయవలసి ఉంటుంది. విఫలమైతే ఆస్తి/సెక్యూర్డ్ చేయబడిన ఆస్తి సర్ఫాసీ చట్టం యొక్క ఏర్పాట్లు ప్రకారం పునర్ విక్రయించబడుతుంది. 4. ఇట్టి ఇ-వేలం ద్వారా అమ్మకం విషయంలో తన కార్పొరేట్ కార్యాలయం ఫ్లాట్ నం.68, 3వ అంతస్తు, సెక్టార్-44, గుర్‌గావ్, హర్యానా 122003 యందు గల M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధీకృత అధికారి సహాయం చేస్తుంది. వెబ్‌సైట్ www.bankeauction.com ఆస్తి యొక్క పరిశీలనకు సంబంధించి ఎటువంటి సహాయం కోసమైనా లేదా బిడ్ డాక్యుమెంట్లను పొందేందుకైనా మరియు ఏదేని ఇతర సందేహ నివృత్తి లేదా రిజిస్ట్రేషన్ కొరకైనా, PNBHFL యొక్క అధీకృత అధికారి అయిన Mr. పల్లూరి ఉదయ్ భాస్కర్/విజయ్ సంప్రదియాల్ 9703801419/7428193765 టోల్ ఫ్రీ నెం. - 1800 120 8800, ఇ-మెయిల్: auction@pnbhousing.com లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము : గుంటూరు, తేది : 13.05.2025 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

వార్త

ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.

-మహాత్మాగాంధీ

# దాయాదికి తీవ్ర హెచ్చరికలు!


భారత్‌పాక్ పరస్పర దాడుల తర్వాత ప్రధాని మోడీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ఉగ్రవాదులకు ఒక హెచ్చరిక చేసినట్లయింది. అదే క్రమంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఉగ్రస్థావరాలకు అన్ని హంగులు కల్పిస్తున్న దాయాదికి తీవ్ర స్థాయి హెచ్చరికలు కూడా చేసింది. పహల్గావ్ దాడి ప్రపంచాన్ని మొత్తం కుదిపేసిందని, మన మహిళల నుదుట సింధూరం దూరంచేస్తే మూల్యం ఏ స్థాయిలో ఉంటుందో కూడా చూపించామని చెపుతూనే మోడీ ఉగ్రవాదులకు, పాకిస్తాన్ పాలకులకు గట్టి హెచ్చరికలు పంపించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా కూడా మట్టిలో కలిపేస్తామని ముందు నుంచీ చెపుతున్న మోడీ పొరుగుదేశంతో చర్చలంటూ ఉంటే కేవలం ఉగ్రవాదం, ఉగ్రవాదుల దుశ్చర్యలపైనే ఉంటాయని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను అప్పగించిన తర్వాతనే ఏ చర్చలయినా ఉంటాయని చెపుతూ వచ్చారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా మోడీ ఇచ్చిన సందేశం ఉగ్రవాదంపై మరింత స్పష్టతనిచ్చింది. కేవలం ఒక్కరాత్రిలోనే భారత సత్తాను చూసిన పాకిస్తాన్ బెంబేలెత్తిపోయిందని, అగ్రరాజ్యాలను ఆశ్రయించి ప్రాధేయపడిందని ఇదంతా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంవల్లనే కాదా అన్న ప్రశ్నలు కురిపించారు. పాక్ స్వయంగా కాల్పుల విరమణకు వద్దామని ప్రాధేయపడితేనే అంగీకరించామన్న సంకేతాలు కూడా ఇచ్చారు. కాల్పుల విరమణ తర్వాత మరే ఇతర చిన్న సంఘటన జరిగినా కూడా కూకటివేళ్లతో ఇకపై పెకలించివేస్తామన్నారు. ఆపరేషన్ సింధూర్ అంటే ఒక పేరు కాదని, ఒక ప్రతిజ్ఞ అని అది ఎలా ఉంటుందో ఈ మూడు రోజుల దాడుల్లోనే తెలిసివచ్చేలా చేసామని, భవిష్యత్తులో దాడులుచేయాలంటే ఇకపై ఎలా ఉంటుందో పాక్ తెలుసుకోవాలన్న సంకేతాలు మోడీ ప్రసంగంలో కనిపించాయి. ఒక్కరాత్రిలోనే పాక్ గుండెలను ఎగిసి తన్నామని భయంతో, రక్షణ కోసం ప్రపంచదేశాలను ఆశ్రయించిందని కూడా గుర్తుచేసిన మోడీ ఉగ్రవాదంపై భారత్ విధివిధానాలు ఇక ఎంతమాత్రం మారబోవని తెగేసి చెప్పారు. ఇదే సంకేతాలు ఇతర ప్రపంచదేశాలకు కూడా పంపించారు. అటు చైనా అయినా ఇటు బంగ్లా దేశ్‌కు కూడా ఈ సంకేతాలు బలంగా వెళ్లాయనే చెప్పాలి. యుద్ధరంగంలో ప్రతిసారి ఓటమి చవిచూసినా పాకిస్తాన్‌కు బుద్ధిరాలేదు. ఇపుడు ఆపరేషన్ సింధూర్‌లో కూడా పలాయనం తప్పలేదు. అణ్వాయుధాలను బూచిగా చూపించి ఉగ్రవాదులను పంపిస్తామన్నా, దాడులు చేస్తామంటే ఎంతమాత్రం భారత్ ఉపేక్షించదని, భారత్ అందుకు సర్వసన్నద్ధంగా నిరంతరం ఉంటుందన్న హెచ్చరికలను మోడీ పంపించారు. ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసి 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని, ఉగ్రవాదుల మృతదేహాలను చూసి పాక్ ఆర్మీ అధికారులు కన్నీళ్లు పెట్టుకున్నారంటే ఉగ్రవాదాన్ని ఆదేశం ఎంతమేర ప్రోత్సహిస్తున్నదో అవగతం అవుతోందని, ప్రపంచదేశాలు పాకిస్తాన్ వైఖరిని కూడా అర్థంచేసుకోవాలని మోడీ తన ప్రసంగంలో పిలుపునిచ్చినట్లయింది. వాస్తవానికి ఓ పక్క దాడులు జరుగుతున్నా మరోపక్క నిరంతరం డిజిఎంఒలు, త్రివిధ దళాల అధిపతులు, రక్షణమంత్రి, విదేశాంగ మంత్రులతోపాటు జాతీయభద్రతా సలహాదారులతో నిత్యం సమీక్షలు జరిపిన మోడీ ఎప్పటికప్పుడు దాడుల సమాచారాన్ని రప్పించుకున్నారు. యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలు కూడా వారితో చర్చించారు. పాకిస్తాన్ వైపు నుంచి ఒక్కతూటా పేలితే మీరు క్షిపణిని పేల్చండంటూ త్రివిధ దళాలకు స్వేచ్ఛనిచ్చారు. భారత్ పాక్‌ల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ల హాట్‌లైన్ చర్చలపరంగా అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి ఉద్బోధించారు. తర్వాత కూడా మోడీ అత్యున్నతస్థాయి సమీక్షలు నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణను కూడా సిద్ధంచేయాలని సూచించారు. మూడురోజుల పాటు పాకిస్తాన్‌పై జరిపిన దాడుల్లో కేవలం పౌరజీవనానికి అంతరాయంలేని విధంగా లక్ష్యాలను ధ్వంసం చేసిన విధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. అదే క్రమంలో సరిహద్దుల్లో కాల్పులకు తెగబడటం, 26 కీలక స్థావరాలను టార్గెట్ చేసుకుని ఉపక్రమించడం వంటి చర్యలతోపాటు భారత్‌లోని విద్యాసంస్థలు, మందిరాలు, మసీదులు గురుద్వారాలపైనా పాక్‌చేసిన దాడులను దృశ్యమాధ్యమంలో కూడా ప్రపంచానికి చేరవేసేలా వ్యూహాలు అమలుచేయడం వెనుక ప్రధాని ఆలోచనే ఉందని తెలుస్తోంది. భారత్‌పై ఇప్పటి వరకూ మూడు సార్లు యుద్ధాలుచేసిన పాకిస్థాన్ ఏ ఒక్క యుద్ధంలో కూడా గెలవలేదు సరికదా తోకముడిచింది. ఇపుడు ఆపరేషన్ సింధూర్‌లో కూడా అదేతీరులో వ్యవహరించింది. ఇకపై దాడులతీరును పరికిస్తే భారత్ తన స్వదేశీ తయారీ ఆయుధ సామగ్రిని వినియోగించ డం ద్వారా రక్షణరంగ వ్యవస్థలో కూడా భారత్ స్వయం సమృద్ధితో కొనసాగుతున్నదన్న సందేశంఇచ్చారు. డిఆర్డీవో రూపొందించిన ఆకాశ్ క్షిపణి అయినా ఇజ్రాయిల్ పరిజ్ఞానంతో భారత్‌లోనే తయారుచేసిన డ్రోన్లు అయినా మన రక్షణ రంగం ఇతర దేశాలకు తీసిపోదన్న భావనను కూడా కల్పించారు. ఈ క్రమంలో కాల్పుల విరమణ జరిగినప్పటికీ ఆపరేషన్ సింధూర్ ఇక్కడితో ఆగిపో లేదని చేసిన హెచ్చరికలు కూడా పాక్‌కు అనునిత్యం భయంతో వణికించేవేనని చెప్పవచ్చు. ఇకపై ఎలాంటి దాడులు జరిగినా యుద్ధచర్యలుగానే పరిగణిస్తామని, పర్యవసానాలు ఇలాగే ఉంటాయని, మోడీ తన ప్రసంగంద్వారా భారత్‌ను శాసించాలనిచూసే వారికి హెచ్చరికలు పంపించినట్లయింది.

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏం చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.



నెహ్రూ

ఒకరితో స్నేహం చేసేటప్పుడు నెమ్మదిగా ప్రారంభించాలి. స్నేహం కలిసిన తర్వాత మరెన్నడూ విడిచిపెట్టకూడదు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



## డ్రాగన్ విషపు చూపు

**కేవలం** ఇరవై అయిదు నిముషాలలో ఆపరేషన్ సింధూర్ తొమ్మిది ఉగ్రవాదుల ప్రదేశాలలో కాల్పులు జరిపి వంద మందిని చంపామని భారత్ ప్రకటించింది. చాలా సంతోషం. ఇంకా వందలకొద్ది మిగిలే ఉన్నారని అంటున్నారు. పాకిస్తాన్ తాను తలచుకుంటే ప్రపంచాన్నే నాశనం చేయగలమని అంటున్నది. మన ప్రధాని మోడిని ఒదలిబెట్టబోమని అని ఏవేవో కారు కూతలు కూస్తున్నది. వీటిని తేలిగ్గా తీసిపారవేయక నిత్యం అప్రమత్తతను కలిగివుండాలి. దొంగదెబ్బలు తీయడంలో ఘటికురాలీ ఉగ్రదేశం. ఎన్నో అనుభవాలను చవి చూసింది మన దేశం. అలాగే డేంజరస్ డ్రాగన్ విషపు చూపుల పట్ల కూడా అహర్నిశలుజాగ్రత్తలు పాటించాలి. మన పూర్వ ప్రధాని ఇందిరా గాంధి ఈ రెండు సరిహద్దు దేశాల కదలికల్ని ఎప్పటికప్పుడు ఓ కంటితో గమనిస్తూండాలనే వారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఐక్యత ముఖ్యం

**తాము** మాత్రమే దేశ సమస్యలను పరిష్కరించగల సమర్థులమని మరొకరికి అది చేతకాదని గొప్పలు చెప్పుకోవటం పార్టీలను, వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం రాజకీయాలు మాట్లాడటం తప్పు. దేనికైనా సమయం, సందర్భం ఉంటుంది. దేశంపై ఉగ్రదాడి జరిగినప్పుడు పార్టీ నాయకులు సంయమనం పాటించాలి. అన్ని పార్టీల వారు ఉగ్రవాద సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయాలి.

-మిథునం, హైదరాబాద్

## పథకాలతో ప్రయోజనాలు

**ఇటీవల** తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమి లేని నిరుపేదల పాలిట వరం. ఎందుకంటే రాజ్యగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరుల పనికి హక్కును కల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగాస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్దమొత్తంలో అందిస్తూ మహిళలలో నాయకత్వ బాధ్యతను సమిష్టి తనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగాస్వాములను చేయాలి.

-భారత అవినాష్, జనగామ

## కులగణన

**తెలంగాణ** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు కూడా ఇదే కోరుతూవస్తున్నాయి. ఎంత మంది కోరినా కేంద్రంలో పనిచేస్తున్నదిబిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు. కులగణన చేపట్టే ప్రయత్నాలు చేయలేదు. తమకసలు కులగణన చేపట్టే ఉద్దేశ్యమే లేనట్టు వ్యవహరించింది. అలాంటిది హఠాత్తుగా దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలనే నిర్ణయం ఎందుకు తీసుకుంది. పహల్గాం దాడి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికా? లేక బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికా? లేక మరైదానా కారణం ఉందా? అనే అనుమానాలు చాలా మందికి కలుగుతున్నాయి. ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకుని ఉంటే ఎవరికి ఎలాంటి అనుమానాలు వచ్చేవి కావు.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## ప్రజలు అన్ని గమనిస్తున్నారు

**తెలంగాణలో** కె.సి.ఆర్, ఆంధ్రలో జగన్ పదవుల్లో ఉన్నంత కాలం ఇష్టానుసారంగా ప్రవర్తించారు. ప్రజలను నానా కష్టాలు పెట్టారు. అందుకే ప్రజలు వారిని చాపలా చుట్టి మూలన పడేశారు. మోడీని హెచ్చరించి వదిలేశారు. అధికారం శాశ్వతమనుకుంటు అహంకారం ప్రదర్శిస్తే వారికి పట్టిన గతే ప్రస్తుత పాలకులకీ పడుతుంది.

-ఎం.ఎస్.శర్మ, హైదరాబాద్

## సీనియర్లకు ఎక్కువ వేతనాలుండాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో విద్యా శాఖకు సంబంధించి మే జూన్ నెలల్లో స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వడానికి, ట్రాన్స్ఫర్లు చెయ్యడానికి ప్రభుత్వం సమాయత్తమవుతుంది. ఈ నేపథ్యంలో ఎవరు ప్రాతినిధ్యం వారు చేస్తూ ఉన్నారు. ప్రమోషన్లు ఇప్పుడు ప్రాతిపదిక సీనియారిటీ అవ్వాలి కానీ గత కొన్ని దశాబ్దాలుగా అలా జరగడం లేదు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కుంటివారు గుడ్డివారు మొదలగు అంగవైకల్యం ఉన్నవారు, మనోవైకల్యం ఉన్నవారు, ఆటగాళ్లు పాటగాళ్లు అనేక రకాల చట్టాలను లోని లోపాలను అడ్డుగా పెట్టుకుని ప్రమోషన్లు పొందుతూ ఉన్నారు. తత్ఫలితంగా పాఠశాల పర్యవేక్షణ సమంగా జరగడం లేదు. ప్రమోషన్లు ప్రక్రియ ప్రారంభించినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు డైరెక్ట్ రిక్రూట్మెంట్ వాళ్ళకి పోస్టింగ్ ఇవ్వరాదు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

# క్రమబద్ధీకరణలో నిరుద్యోగులకూ న్యాయం జరగాలి

***రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో నియామకాలపై వైస్ ఛాన్సలర్లతో సమీక్ష నిర్వహించారని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని మినహాయించి మొత్తం 1588 పోస్టుల్లో కేవలం 402 సహాయ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వార్తలువచ్చాయి. ఇదే జరిగితే ఏండ్ల తరబడి అధ్యాపక వృత్తిలో కొనసాగాలని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మరోసారి నిరాశే మిగులుతుంది. గతంలో ఆర్థికశాఖ చేత ఆమోదం పొందిన పోస్టులు కాకుండా చాలా మంది అధ్యాపకులు ఇటీవలి కాలంలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో మరొక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. యూజీసీ నుండి కూడా రావాల్సిన నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.***

**డాక్టర్. అశోక్ మంద**

తెలంగాణ ఉద్యమానికి ఆయువు పట్టుగా నిలిచిన యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ జరిగి దాదాపు 14 ఏండ్లు గడిచింది. గత ప్రభుత్వం అధ్యాపకుల భర్తీ కోసం యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బిల్లు తెచ్చినా అది పలు కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ కోసం జి.వో నం.21 తీసుకువచ్చింది. ఈ జీ.ఓ. నిబంధనల ప్రకారమే నియామకాలు జరుగుతాయి. జి.వోలో వంద మార్కులకు గాను డిగ్రీ, పీజీలకు కలిపి 20 మార్కులు కేటాయిస్తూ, పీహెచ్‌డికి కేవలం పది మార్కులే కేటాయించడం, వివిధ సబ్జెక్టుల్లో జాతీయ స్థాయిలో నెట్ ఉత్తీర్ణతకు, రాష్ట్ర స్థాయిలో సెట్ ఉత్తీర్ణతకు సమానంగా మార్కులు కేటాయించడం వల్ల ఉద్యోగార్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్(నెట్)లో ఉత్తీర్ణత సాధించడం, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్(సెట్)తో పోల్చితే కఠినంగా ఉంటుంది. ఇదిలా ఉంటే ఏండ్ల తరబడి అధ్యాపక పోస్టుల భర్తీ చేయకపోవడం వల్ల యూనివర్సిటీలతో పాటు వాటి అనుబంధ కళాశాలల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులతో విద్యార్థులకి బోధించడం అనివార్యమైంది. ఇప్పుడు వాళ్లు కూడా తమకు ఉద్యోగ భద్రత కావాలంటూ, రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన చేపడుతున్నారు. యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం లేదా తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 16లో పేర్కొన్న సమాన అవకాశాల సూత్రాన్ని ఉల్లంఘిస్తుంది. ఈ ఆర్టికల్ ప్రకారం ప్రతి పౌరుడికీ ప్రభుత్వ ఉద్యోగాలకు సమాన హక్కు ఉండడమే కాకుండా నియామకాలు పారదర్శకంగా, పోటీ ఆధారంగా జరగాలి. కాంట్రాక్టు లేదా తాత్కాలిక అధ్యాపకులను నేరుగా క్రమబద్ధీకరిస్తే, యూజీసీ నిబంధనల ప్రకారం నెట్/సెట్, పిహెచ్‌డి వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు అవకాశాలు తగ్గుతాయి. తెలంగాణలో వేలాది మంది అభ్యర్థులు జే.ఆర్ ఎఫ్, నెట్ ఉత్తీర్ణతతో పాటు పిహెచ్‌డి పూర్తి చేసి యూనివర్సిటీ అధ్యాపక ఉద్యోగాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఒక వేళ క్రమబద్ధీకరణద్వారా ఈ ఖాళీలు భర్తీ అయితే ఇక నిరుద్యోగులకు మిగిలేది ఏముంటుంది?. ఆయా సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం, నెట్/సెట్, పీహెచ్‌డి లేని వారిని క్రమబద్ధీకరిస్తే, అది విద్యా ప్రమాణాలను తగ్గించడమే కాకుండా, అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేసినట్లు అవుతుంది. దీనివల్ల యూనివర్సిటీలలో బోధనా నాణ్యత కూడా దెబ్బ తినే ప్రమాదం ఉంది. క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు నిరుద్యోగ యువత పక్షాన నిలిచి వారికి అనుకూలంగా ఉన్నాయి. 2024 నవంబర్‌లో తెలంగాణ హైకోర్టు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జివో నం.16ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ జివో ద్వారా విద్యాశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. అయితే హైకోర్టు, ఈ ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లకు విరుద్ధమని, సమాన అవకాశాలను హరిస్తుందని స్పష్టం చేసింది. ఈ తీర్పు యూనివర్సిటీ నియామకాలకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే యూనివర్సిటీలు కూడా ప్రభుత్వ నిధులతో నడుస్తాయి. నిమాయక ప్రక్రియ నియమ నిబంధనలు



రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడి ఉండాలి. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇలాంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు తప్పనిసరిగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా ఇతర ప్రభుత్వ నియామక సంస్థల ద్వారా పారదర్శకంగా జరగాలని ఉన్నత న్యాయస్థానాలు సూచించాయి. యూనివర్సిటీల విషయంలో, యూజీసీ నిబంధనల ప్రకారం నియామకాలు జరగాలని, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగులకు ప్రత్యేక హక్కు ఉండదని కూడా కోర్టులు వివిధ సందర్భాల్లో స్పష్టం చేశాయి. ఆయా ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలు, అభ్యర్థుల మధ్య పోటీ ఆధారంగా నియామకాలను చేపట్టాలని తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే అధ్యాపకుల భర్తీ కోసం తీసుకువచ్చిన జి.వో 21లో కొన్ని మార్పులు చేయాలని ఉద్యోగార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తే వేలాది మంది అభ్యర్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. కాంట్రాక్టు లేదా తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణ వల్ల పోరాడి సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల్ని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా, క్రమబద్ధీకరణ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, రాజకీయ ఒత్తిళ్లు, నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తిని పెంచుతాయి. కొంతమంది పైరవీల ద్వారా కూడా గతంలో అర్హతలు లేకుండానే కాంట్రాక్టు ఉద్యోగులుగా చెలామణి అవుతున్నారనే వాదనలు కూడా ఉన్నాయి. వీటన్నిటి వల్ల నిరుద్యోగ యువత నుండి ప్రభుత్వం మీద వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వ యూనివర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలంటే, అత్యుత్తమ ప్రతిభావంతులైన అధ్యాపకుల్ని భర్తీ చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల్లో కూడా చాలామంది ప్రతిభావంతులు, అన్ని అర్హతలు కలిగిన వాళ్లు కూడా ఉన్నారు. కానీ వీరి కన్నా ఎన్నో రెట్ల మంది అభ్యర్థులు అధ్యాపక వృత్తిలో కొనసాగటానికి కావాల్సిన అన్ని అర్హతలున్నా కూడా జీవనోపాధి లేకుండా నిరుద్యోగులుగా బయట మిగిలే ఉన్నారు. వారి పరిస్థితిఅగమ్యగోచరంగా మారింది. యూనివర్సిటీ స్థాయి బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలంటే పారదర్శకతతో కూడిన నియామక ప్రక్రియ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల సేవలను గౌరవిస్తూనే, నిరుద్యోగ యువతకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషించాలి. ఉదాహరణకు, కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులకు పోటీ పరీక్షల్లో వయోపరిమితి సడలింపుతోపాటు బోధనా అనుభవానికి గాను మార్కులు ఇవ్వడం ద్వారా వారికి అవకాశం కల్పించవచ్చు. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో నియామకాలపై వైస్ ఛాన్సలర్లతో సమీక్ష నిర్వహించారని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని మినహాయించి మొత్తం 1588 పోస్టుల్లో కేవలం 402 సహాయ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వార్తలువచ్చాయి. ఇదే జరిగితే ఏండ్ల తరబడి అధ్యాపక వృత్తిలో కొనసాగాలని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మరోసారి నిరాశే మిగులుతుంది. గతంలో ఆర్థికశాఖ చేత ఆమోదం పొందిన పోస్టులు కాకుండా చాలా మంది అధ్యాపకులు ఇటీవలి కాలంలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో మరొక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. యూజీసీ నుండి కూడా రావాల్సిన నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.

# శాంతి చర్చలు సఫలమయ్యేనా?

**కనుమ ఎల్లారెడ్డి**

దాదాపు మూడు సంవత్సరాలకు పైగా జరుగుతున్న రష్యా, ఉక్రెన్ యుద్ధంలో ఇరుదేశాలు నష్టపోయాయి. కాకపోతే ఉక్రైన్‌కు భారీ నష్టం సంభవించింది. యుద్ధ నిర్వహణలో రెండు దేశాల సైనిక వ్యవస్థ పలు సమస్యలు ఎదుర్కొన్నాయి. యుద్ధవీరుల లక్ష్యం కూడా శాంతిని కోరు కోవడమే. ఈ దిశలో టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో టర్కీ అధ్యక్షుడు ఎర్దోగాన్ రెండు దేశాలను సమన్వయ పరచి చర్చలు ప్రారంభిస్తారు. ఈ చర్చలకు పుతిన్, జెలెన్ స్కి ఒప్పుకోవడం ముదావహం. ఈ గురువారం నుంచి ఇస్తాం బుల్‌లో చర్చలు మొదలవుతాయి. మేం మానవతా దృక్ప థంతో వ్యవహరిస్తున్నాం. అందుకే ఈస్టర్ డే, విక్టరీ డే సందర్భంగా కాల్పుల విరమణ పాటించి తమ పారదర్శకత నిరూపించుకున్నాం అని పుతిన్ వ్యాఖ్యణించారు. కాని దురదృష్టం ఉక్రైన్ వీటిని పెడ చేవిన పెట్టిందని పుతిన్ వాపోయారు. అయినా సమర్ధవంతంగా ఉక్రైన్ దాడులను అడ్డుకున్నామని పుతిన్ చెప్పారు. ఇప్పుడు రష్యా ప్రకటించిన శాంతి చర్చలకు సిద్ధం అని జెలెన్స్కి వ్యాఖ్యానించడం అతనికి యుద్ధంపై గల నష్టం తెలిసి వచ్చినట్లుంది. యుద్ధం ద్వారా అశాంతే రగులుతుందని, అభివృద్ధి కుంటు పడుతుందని అటు జెలెన్ స్కికి ఇటు పుతిన్‌కు తెలియడం గమనార్హం. ఇరు దేశాలు పట్టు విడుపులకు, మాటల పంతాలకు పోక శాంతిని కాంక్షించాలి. రష్యా, ఉక్రైన్ యుద్ధం ముగింపుకు విశ్వం అంతా ఎదురుచూస్తోంది. దానికిమొదటి అడుగు కాల్పుల విరమణ. రెండు దేశాలు కాల్పుల విరమ ణకు చర్యలు తీసుకోవాలి. అందుకు ఉక్రైన్ అంగీకరించడం, సోమవారం నుంచి మొదలయ్యే ముప్పై రోజుల కాల్పుల విరమణకు రెండు దేశాలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఒక వేళ ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఉల్లం ఘిస్తే ఆంక్షలు విధిస్తాం అని బ్రిటన్ వెల్లడి చేయగా, పలు వురు ఐరోపా నాయకులు కూడా కాల్పుల విరమణే శాంతి ని ప్రోది చేస్తుందని వక్కాణించారు. ఇప్పుడు బంతి రెండు దేశాల మధ్య ఉంది. శాంతా, యుద్ధామా అనేది రష్యా, ఉక్రైన్ దేశాలు నిర్ధారించుకోవాలి. అంది వచ్చిన అవకాశాన్ని ఎవరు వదులుకోకూడదు. యుద్ధం ఆగాలని టర్కీ చేస్తున్న రాయబారం ఫలించాలని, ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు ఫలించాలని కోరుకుందాం. ఈ దిశలో రష్యా, ఉక్రైన్ దేశాలు కూడా శాంతికి ప్రాముఖ్యత ఇవ్వడం శుభ పరిణామం. మూడు ఏళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో ముఖ్యంగా పౌరులు, వారి బంధువులు నష్టపోయారు. రెండు దేశాలలో పసి పిల్లలు, గర్భిణీస్త్రీలు మరణించారు, వారు ఎదుర్కొన్న అవస్థలు వర్ణించలేం. యుద్ధం ఎప్పుడు ఆగునా అని ఎదురు చూస్తున్నారు. రెండు దేశాలకు పర్యాటకులు రాక పోవడంతో ఆదాయం కూడా గణనీయంగా తగ్గి పోయింది. యుద్ధ నష్టం పూడ్చుకోవటంతోనే సరిపోయింది. అనేక చారిత్రక కట్టడాలు, సుందర భవనాలు నేల మట్టం కావడం దురదృష్టం. ఈ విపత్కర పరిస్థితులు చూసే టర్కీ ముందుకు వచ్చి రెండు దేశాల అధ్యక్షులతో చర్చించి

# సోషల్ మీడియా వేదికగా అమరావతిపై మరో కుట్ర?

**అన్నవరపు బ్రహ్మయ్య**

అధికారం కోల్పోయినప్పటికీ వైఎస్ఆర్ నేతలు ప్రజలను భయపెట్టే విధంగా మాట్లాడుతూనే వున్నారు. అయినా ప్రధాన మంత్రి పర్యటన అనంతరం వైఎస్ఆర్ సిపి నాయకుల వ్యాఖ్యాలను, మాటలను ప్రజలు అవాకులు చవాకులుగానే భావిస్తున్నారు. మరల ఏదో రకంగా అమరావతిపై, అధికార తెలుగుదేశం పార్టీపై సోషల్ మీడియా వేదికగా కుట్రపన్నుతున్నారు. ఉదాహరణకి విశాఖపట్నంలో ఉర్సా సంస్థకు ఎకరం 50నుంచి కోటి రూపాయల వంతున స్థలం కేటాయిస్తే 99 పైసలకే ఎకరం కేటాయించినట్టు అభూతకల్పనలు ప్రచారం చేశారు. ఒక మతప్రచారకుడు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదంలో మరణిస్తే దానిని హత్యగా ప్రచారం చేస్తున్నారు. ముంబాయి నటి కాడంబరి జత్వాని కేసులో అరెస్టు అయినా పోలీసు ఉన్నతాధికారి అడ్డుపెట్టుకొని కులపరమైన విద్వేషాలు ప్రచారం చేసే పనిలో వున్నారు. నటి జత్వానిపై ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 6.30 గంటలకు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేవలం అర గంటకే అంటే 7 గంటలకు పోలీసులు విమానంలో ముంబాయి బయలు దేరి వెళ్లారు. కేసు బుక్ చేసిన అరగంట ముంబాయి వెళ్లడం ఒక వింత అయితే, ఫిబ్రవరి 2వ తేదీన నమోదు చేసిన కేసు నిమిత్తం జనవరినెలలో విమాన టిక్కెట్లు బుక్ చేయడం మరో వింత. ఈఅంశాల గురించి వివరణ ఇవ్వ కుండా పిఎస్ఆర్ ఆంజనేయులు సత్యసంధుడు అంటూ అరెస్టును కులపరమైన విషయంగా ప్రచారం చేయడానికి సిద్ధం అయ్యారు. అమరావతి వరదలకు మునిగిపోయిందని, అమరావతి ప్రాంత భూములు నిర్మాణాలకు పనికి రావంటూ అవాకులు చవాకులు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ నుంచి విడిపోయిన సమయంలో కూడా ఆంధ్ర లో నూతన రాజధాని ప్రాంతం నిర్ణయంకోసం ఏర్పాటు చేసిన కమిషన్ ఎంపిక చేసిన అయిదు ప్రాంతాలలో విజయవాడగుంటూరు ప్రాంతం కూడా వుంది. ప్రధాన మంత్రి మోడీ అమరావతి పనుల పునః ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ నేతల తీరు చూస్తుంటే మూడు రాజధానుల భ్రమనుంచి బయటకు వస్తున్నట్టు కనిపించడం లేదు. నాడు అధికారంలో వుండగా సజ్జల రామకృష్ణారెడ్డి నిర్వహించిన పాత్రను నేడు అంబటి రాంబాబు నిర్వహిస్తున్నారు. అమరావతి అభివృద్ధికి వైఎస్ ఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తే నాడు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశంపార్టీ అడ్డుపడింది అంటూ ప్రధాన మంత్రి పర్య టన అనంతరం అంబటి మాట్లాడిన తీరుతో ప్రజలు విస్తు పోతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ అధికారంలో వున్న అయిదు సంవత్సరాలు చంద్రబాబు నిర్మించిన సచివాలయ భవనాల నుంచి పరిపాలన సాగించిన బొత్స సత్యనారాయణ, అంబటిరాంబాబు, గుడివాడ గుర్నాథం వంటి మంత్రులు అమరావతిలో భవనాలు ఎక్కడ వున్నాయి. అంతా స్మశానమే అని వ్యాఖ్యానించిన నేతలు, తాము అధికారంలో వుండగా అమరావతి అభివృద్ధికి కృషి చేశామనని చెప్పడం చూస్తుంటే నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు అన్నట్టువుంది. రాష్ట్ర విభజన అనంతరం తొలివిడతలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు



నాయుడు ఆ సమయంలో ఎన్డీఎ కూటమిలో సభ్యునిగా లేకపోయినప్పటికీ దేశప్రధాన మంత్రిని గౌరవించాలనే మర్యాదతో మోడీతో అమరావతి పనులకు శంకుస్థాపన చేయించడమే కాకుండా ఆనాటి సభకు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరును కూడా ఆహ్వానించారు. రెండో విడత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి అమరావతికి ద్రోహం చేస్తూ మూడు రాజధానుల ప్రతిపాదన ముందుకు తెచ్చా రు. అమరావతికి భూములిచ్చిన రైతులుచేసిన తిరుగులేని పోరాటం, న్యాయపరమైన అభ్యంతరాల నేపథ్యంలో జగన్మోహనరెడ్డి అమరావతి అభివృద్ధికి తట్టెడు మట్టికూడా వేయకపోగా ప్రారంభానికి సిద్ధంగావున్న అనేక భవనాలను పాడుపెట్టారు. మూడో విడత తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలతో కూడిన ఎన్డీఎ కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమిలో భాగస్వామిగా వున్న బిజెపి కేంద్రంలో అధికారంలో వున్న నేపథ్యంలో అందిస్తున్న సహకారంతో రాజధాని అమరావతి మరల ఊపిరిపోసుకోవడం ప్రారంభమైంది. మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రూ.64,721 కోట్ల రూపాయల అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమ రావతికి అవుటర్ రింగ్ రోడ్, మెట్రో రైల్వే, అమరావతితో జాతీయ రోడ్డుల అనుసంధానం, అమరావతి నూతన రైల్వే లైను ఏర్పాటు వంటి అనేక అభివృద్ధిపనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అమరావతి అభివృద్ధికి ఇంత పెద్దమొత్తం నిధులను సమీకరించడంలో సహకరించిన ప్రధాన మంత్రి మోడీ చేత పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించడాన్ని కూడా రాజకీయం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిజానికి రాజధాని అమరావతి (విజయవాడ, గుం టూరు)పై కుట్ర ఈనాటిది కాదని చెప్పవచ్చు. 1953లో మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సమయంలో కూడా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు ప్రకటన వెలువడిన తర్వాత సాంకేతిక అంశాలను నిర్ణయించడానికిభారత ప్రభుత్వం నాడు రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వున్న కె.ఎన్. వాంఛను నియమించింది. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలిగా రాజధానిగా విజయవాడనే నిర్ణయించారు. కాని, రాజధాని విజయవాడలో ఏర్పాటు చేయడం వల్ల ఒక సామాజిక వర్గం ప్రాబల్యం పెరిగి వారు ఆర్థికంగా స్థిరపడతారనే కారణంతో పాటు కమ్యూనిస్టులు బలపడతారనే ప్రచారంకూడా చేశారు. రాయలసీమకు చెందిన ఆనాటి నాయకులుకర్నూలులో రాజధాని ఏర్పాటు చేయాలని పట్టు పట్టారు. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ముందుగా నిర్ణయించినట్టుగా విజయవాడ కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయడంలో వివిధ రాజకీయకారణాలతో పాటు సామాజికవర్గాల రాజకీయపోరు కూడా వుందనినాడు పలుపత్రికల్లో వార్తాకథనాలువచ్చాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా అమరావతి ఎంపికకు అసెంబ్లీ సాక్షిగా మద్దతు పలికారు. రాజధాని పరిధిలోని ఉండవల్లిలో ఇల్లు నిర్మించు కున్నానంటూ ఎన్నికల వేళ జగన్మోహనరెడ్డి మోసపూరిత మాటలను నమ్మిప్రజలు అధికారం కట్టపెట్టారు. ఏరుదాటేవ రకు ఓడమల్లన్న ఏరుదాటిన తర్వాత బోడిమల్లన్న అన్న రీతిలో జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని ఒక రియల్ ఎస్టేట్‌అని లేనిపోని సాకులు చెబుతూ మూడురాజధానులు అంటూ మాటమార్చారు. అమరావతి కోసం ఉద్యమం నిర్వహించిన రైతులు, ప్రధానంగా మహిళలను అధికార బలంతో అణచివేయాలని చూశారు. చివరకు రాజధాని కోసం భూములు ఇచ్చిన ఎస్సిల రైతులపై ఎస్‌ఎసి, ఎసిటి అట్రా సిటీకి పెట్టారు. చూసిన నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సాధారణ, తటస్థ ప్రజలు ఆపార్టీ నేతల చేష్టలు, మాటలకు, భీతిచెందారు. ఆ కారణంగా చంద్రబాబు ఏమిస్తారు, ఏమిచేస్తారు అని కాకుండా రాజ ధాని నిలిస్తే

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# భావన్నారాయణ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**రాష్ట్ర దేవాదాయ మరియు ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**బాపట్ల,మే12,ప్రభాతవార్త:** భావన్నారాయణ స్వామి ఆశీస్సులతో దేశ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ మరియు ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం స్వామివారి రథోత్సవ కార్యక్రమంను కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్లలోని, భావపురి కాలనీలో కొలువైన శ్రీ మత్స్యుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీర భావనారాయణ స్వామి 1432వ బ్రహ్మోత్సవాలలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని దేవాదాయ మరియు ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. స్వామి వారికి ఆయన పట్టు వస్త్రాలు సమర్పించారు. భావనారాయణ స్వామి నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరుగుచున్నాయని ఆయన తెలిపారు.భావనారాయణ స్వామి వారి కొరకు 1.50 లక్షల ఖర్చుతో నూతన రథాన్ని తయారు చేయడం జరిగిందని ఆయన అన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 9వ రోజున శ్రీ మత్స్యుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీర భావనారాయణ స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం నూతనంగా నిర్మించబడిన దివ్యరథంలో నగరోత్సవం నిర్వహించడం చాలా శుభపరిణామమని ఆయన అన్నారు. భావనారాయణ స్వామి కొలువైన బాపట్లలో నివసించే ప్రజలందరూ ఎంతో ధన్యులని ఆయన అన్నారు. స్వామి వారి ఆశీస్సులతో దేశ,రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. స్వామివారి దివ్య రథ నగర ఉత్సవంలో బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, చీరాల శాసనసభ్యులు ఎం.ఎం కొండయ్య, గుడి వంశపార పర్య ధర్మకర్త రమణబాబు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి. గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.



## గిరి ప్రదక్షిణలో వ్యక్తి మృతి



నరసరావుపేట క్రైం, మే 12 ప్రభాతవార్త : కోటప్పకొండలోని గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న ఒక భక్తుడు ఆకస్మికంగా మృతిచెందారు. గిరి ప్రదక్షిణలో జరిగిన అపశృతి వివరాలను కుటుంబసభ్యులు స్థానికులు తెలియజేశారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ప్రతి నెల గిరి ప్రదక్షిణ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి చిలకలూరిపేట మండలం పురుషోత్తమపట్నం గ్రామానికి చెందిన ప్రసాద్ (50) హాజరయ్యారు. ప్రదక్షిణ మార్గంలో నడుస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన భక్తులు ఆయనను వైద్యశాలకు తరలించేలోపే ఊపిరి వదిలారు.

గుంటూరు వార్త



## త్రికోటేశ్వరస్వామికి లక్షమల్లెపూల పూజ



**నరసరావుపేట, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామికి లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. దేవస్థానం సహాయక కమిషనర్, కార్య నిర్వహణాధికారి డి.చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది వైశాఖ పౌర్ణమి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. దాతల సహకారంతో విజయవంతంగా స్వామికి లక్ష మల్లెపూల పూజ జరిగిందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# ప్రతి సమస్యను వారం రోజులలో పరిష్కరిస్తాం

**ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రాష్ట్ర పౌరసరఫరాలు,వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్**

**కొల్లిపర,మే 12 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు,వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపర శ్రీజగన్నాథస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంత్రి మనోహర్,జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎ.భార్గవతేజ,తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ పాల్గొని ప్రజల నుండి 200 పైగా పిర్యాదులు స్వీకరించారు. తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం..అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు.ాఁ ఒవిన్యూ,నూతన రైస్ కార్డుల కొరకు ధరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో అందాయన్నారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి నెల 9600 మందికి రూ.40 కోట్లు రూపాయలు ఎన్టీఆర్ పెన్షన్ క్రింద అందజేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా ఒక కోటి 46 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇవ్వటానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు.అర్హత కలిగిన వారు సచివాలయంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు.కొల్లిపర మండలంలో రైతులకు సంభంధించి డొంకరోడ్లు అభివృద్ధి కోసం రూ.10 కోట్లు తీసుకురావటం జరిగిందన్నారు.రైతులకు మ ంచి జరగాలనే ఉద్దేశంతో మొట్టమొదటగా కొల్లిపర మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయటంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో రూ.12 వేల కోట్లు నగదును జమ చేసినట్లు చెప్పారు.సంక్షేమం..అభివృద్దే ధ్యేయంగా దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వరకు రోడ్డును విస్తరణ చేయటంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయటానికి ఇప్పటికే ఆర్‌అండ్ బి అధికారులతో మాట్లడటం జరిగిందన్నారు.పారిశుద్ద్యం విషయంలో ప్రతి గ్రామంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.గతంలో తాను స్వీకర్గా ఉన్నప్పుడు రక్షిత మంచినీటి పథకానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు.గ్రామాల్లో దొంగతనాలు పెరిగి పోతున్నాయని పోలీస్‌శాఖపై పిర్యాదులు వస్తున్నాయన్నారు.దొంగతనాలు అరికట్టడానికి పోలీస్‌శాఖ ద్వారా గట్టి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.యువత గంజాయికి అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని నెల రోజుల లోపులో గంజాయిని అరికట్టనున్నట్లు తెలియజేసారు.రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల సంక్షేమ గృహాలకు సన్నబియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

**కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి మనోహర్ :** మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి మనోహర్ ఆకస్మిక తనికీ నిర్వహించారు.ఓపిని పరిశీలించి రోగులను సరైన సమయంలో వైద్యం అందిస్తున్నారా..మందులు సక్రమంగా ఇస్తున్నారా అడిగారు..హాస్పిటల్‌లోని గదులన్నింటికీ తాళాలు వేసి ఉండటంతో వైద్యసిబ్బందిపై మండిపట్టారు.కోట్లాది రూపాయలతో హాస్పిటల్ నిర్మాణం చేపడితే మీరు సక్రమంగా వైద్యం ఎందుకు అందించటంలేదని వైద్యులను ప్రశ్నించారు.సక్రమంగా వైద్యసేవలు ఎందుకు అందించటం లేదు..మీకు వైద్యం చేయటం మీద ఇంట్రస్ట్ లేకపోతే ఇంటికి వెళ్ళిపోండి..హాస్పిటల్‌కు వచ్చిన రోగులను ఇబ్బంది పెడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వైద్యసిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని పిర్యాదులు వస్తే సహించేదిలేదని హెచ్చరించారు.రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు.ఈ కార్యక్రమాలలో సర్పంచ్ పిల్లి రాధిక,ఎంపీపీ భీమవరపు పద్మావతి,ఎంపీడీఓ విజయలక్ష్మి,మెడికల్ సూపర్‌డెంట్ డాక్టర్ భరత్,మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వంగా సాంబిరెడ్డి,నాయకులు అడపా నారాయణరెడ్డి,అద్దంకి వేణుగోపాలగౌడ్,భీమవరపు కిషార్‌రెడ్డి,కొండా కిషోర్‌రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి,సంభంధిత అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







# వెనుకబడిన పల్నాడుకు జీవం పోయండి.!

**ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ఎమ్మెల్యే జూలకంటి**

మాచర్ల, మే 12 ప్రభాతవార్త: వెనుకబడిన పల్నాడుకు జీవం పోయాలంటే అధికారుల పాత్ర కీలకమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వీవీఎన్ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు.



ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సమన్వయంతోనే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**రెవెన్యూ, పోలీసులు నిర్లక్ష్యం వీడాలి!**

మాచర్ల నియోజకవర్గంలో గత ప్రభుత్వవ హయాంలో రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై, ప్రభుత్వ, ప్రైవేటు భూములను కాజేశారని ఎమ్మెల్యే జూలకంటి ఆరోపించారు. అధికారుల అవినీతికి ఎందరో భూయజమానులు రోడ్డున పడ్డారని వాపోయారు. అక్రమార్కులు ఆన్‌లైన్ పేర్లు మార్పు చేసి, భూయజమానుల ప్రమేయం లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు పొందారన్నారు. పోలీసులు కూడా కొన్ని కీలక కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలిస్తే, ఇంత వరకు రికవరీ చేయడంలో అలసత్వం వహిస్తున్నారని చెప్పారు. అలాగే మాచర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు, స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని చెప్పుకొచ్చారు. వాటిపై దృష్టిసారిస్తే చాలా మేరకు ప్రజా సమస్యలు పరిష్కరించవచ్చని ఆయన అధికారులను ఉద్దేశించి ప్రస్తావించారు.

**సమస్యలన్నీ సజీవంగానే ఉన్నాయి... నిధులివ్వండి!**

నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో భూఆక్రమణలు, నకిలీ భూపత్రాలతో రుణాలు, నివేశన స్థలాలు, ఇళ్ల భూకబ్జాలు వంటివి పెద్దఎత్తున జరిగాయని, ఆ సమస్యలన్నీ నేటికీ సజీవంగానే ఉన్నాయని ఎమ్మెల్యే జూలకంటి వాపోయారు. అధికారులు ప్రజాసమస్యలపై స్పందించక పోవడం వల్లనే ప్రజలు నన్ను వెతుక్కుంటూ వస్తున్నారని చెప్పారు. అధికారులు గ్రౌండ్ లెవల్ సమస్యలను పరిష్కరిస్తే.. ప్రజాప్రతినిధులకు వారి గోడు విన్నవించ ుకోవాల్సి న పరిస్థితి ఉండదని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో రేషన్ బియ్యం సరిగా అందడం లేదని, సివిల్ సప్లయి అధికారులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. అంతేకాక వెనుకబడిన పల్నాడుకు అందాల్సి న నిధులు, సబ్సిడీలను వెంటనే అందేలా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చొరవ చూపాలని కోరారు.

**వెల్లువెత్తిన ప్రజాసమస్యలు**

మాచర్ల నియోజకవర్గం పరిధిలో కారంపూడి, దుర్గి, మాచర్ల రూరల్, వెల్దుర్తి, రెంటచింతల మండలాల నుంచి ప్రజా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో జరిగిన భూదందాలు, కబ్జాలు, సామాజిక పింఛన్లు, రైతాంగ సమస్యలు వంటివి అధిక మొత్తంలో ఫిర్యాదులు





అధికారులకు అందాయి. మండలాల వారీగా చూసుకుంటే కారంపూడి 12, దుర్గి 65, రెంటచింతల 25, వెల్దుర్తి 87, మాచర్ల రూరల్ 111, మాచర్ల మున్సిపాలిటీ 152 కాగా, మొత్తం 452 ఫిర్యాదులను ప్రజలు అధికారులకు అందజేశారు. దుర్గి మండలం కంచరగుంట గ్రామానికి చెందిన రవినాయక్ 100 శాతం పోలియోతో బాధపడు తుండగా అధికారులు గుర్తించి కలెక్టర్, ఎమ్మెల్యే బ్రహ్మానందాె ౦డ్డి చైతుల మీదుగా ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్, ధనుంజరు గనోరె, డీఆర్వో మురళీకృష్ణ, ఆర్డీవో మురళీ, డీఎఫ్ఓ కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ప్రతి ప్రాంతానికి సమగ్రంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి : నగర మేయర్

**గుంటూరు కార్పొరేషన్,మే12,ప్రభాతవార్త:** గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతానికి సమగ్రంగా త్రాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ 2.0లో భాగంగా సమగ్ర త్రాగునీటి పథకం అమలుకు రూపొందించిన డిపిఆర్ పై సలహాలు, సూచనలు కోసం నగరంలోని స్టేక్ హోల్డర్స్,



సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్వహించిన సమావేశంలో మేయర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2014 నుండి 24/7 త్రాగునీరు అందిస్తామని జిఎంసి ప్రకటిస్తున్నా ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. ఇప్పటకే పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తుతుందని, రానున్న కాలంలో ప్రతి ప్రాంతానికి నీటిని పుష్కలంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోరంట్ల కొండ మీద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనుల పురోగతిపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి వారం పురోగతిపై నివేదిక అడుగుతున్నారన్నారు. కనుక జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన గోరంట్ల ప్రాజెక్ట్ పూర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నగరంలోని రిజర్వాయర్లను ప్రతి నెల నిర్దేశిత సమయానికి తప్పనిసరిగా శుభ్రం చేయించాలని, అవసరమైన ప్రాంతాల్లో ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణ ప్రతిపాదనలు సిద్దం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అమృత్ 2.0ని రానున్న 30 ఏళ్ల వరకు ప్రజలకు త్రాగునీటి అవసరాలను అంచనా వేసి అమృత్, యుఐడిఎఫ్ నిధుల ద్వారా షుమారు రూ.540 కోట్ల అంచనాలతో డిపిఆర్ రూపొందించామని, పనులను 2 ఏళ్ల కాల పరిమితితో పూర్తీ చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్దం చేసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ లు పూర్తయితే నగర ప్రజలకు త్రాగునీటి సమస్య ఎక్కడా తలెత్తే అవకాశం ఉండదన్నారు. డిపిఆర్ పై ప్రజా ప్రతినిధులు, స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్లు అందించే సూచనలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. తొలుత సిఆర్డీఏ మాజీ సిఈ ఆంజనేయులు పిపిటి ద్వారా డిపిఆర్ ని వివరించారు. అనంతరం కార్పొరేటర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపారు.సమావేశంలో ఎంఎల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ డి.శ్రీనివాస్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, రేట్ పెయర్స్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరుతూర్పు,మే12,ప్రభాతవార్త:** ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డుల మంజూరు, ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ విన్నవించారు. రాష్ట్ర సచివాలయంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ను ఎమ్మెల్యే నసీర్ మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే టీచర్లు విద్యార్థులను తీర్చిదిద్దడంలో శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని, వీరు ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనారోగ్యానికి గురైనప్పుడు చికిత్స తీసుకునే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రైవేటు టీచర్లు కరోనా సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉర్దూ సాహిత్యానికి ప్రోత్సాహం, ఉర్దూ మాధ్యమంలో చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ అమలు ద్వారా చేయడంపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తుతం కర్నూలులో మాత్రమే ఉందని, అమరావతి రాజధానిలో కూడా యూనివర్సిటీ రీజనల్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాజధానిలో రీజనల్ బ్రాంచ్ ఏర్పాటు ద్వారా ఉర్దూ మాధ్యమంలో వృత్తి, సాంకేతిక విద్యను అందించడానికి ఈ ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లోనూ ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నూతనంగా ఉర్దూ పాఠశాలలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పార్టీని తమ భుజస్కందాలపై మోసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని విన్న వించారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి జెండా అని చెప్పారు. పై సమ స్యలను సావధానంగా ఆలకించిన మంత్రి నారా లోకేశ్ ప్రతి సమస్యా పరిష్కారంపై తగిన చర్యలు తీసు కుంటామని ఎమ్మెల్యే నసీర్ కు హామీ ఇచ్చారు.

## ఎస్సీ కమిషన్ చరిత్రలో చరిత్ర సృష్టించిన కూటమి ప్రభుత్వం

**మంగళగిరి, మే 12, ప్రభాతవార్త :** ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించడం పట్ల



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నేతృత్వం లోని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర,న్యాయవాది చిలువూరు నాగ రాజుమాదిగ హృదయపూర్వక కృతజ్ఞతలు సోమవారం ఒక ప్రకటనలోతెలియజేసారు. దశాబ్దాల ఎస్సీ కమిషన్ చరిత్రలో చైర్మన్ గా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి , ప్రస్తుత కొవ్వూరు ఎమ్మెల్యే కే ఎస్ జవహర్ ను నియమించిన కూటమి ప్రభుత్వ చరిత్ర సృష్టించిందని ఆయన కొనియాడారు. ఈ నేపథ్యంలో చిలువూరు నాగ రాజు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి కొన్ని దశాబ్దాల నుండి కేవలం మాల సామాజిక వర్గానికి కేటాయించడం రాజకీయ పార్టీలకు ఆనవాయితీగా మారిందని ఎస్సీల్లో అధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వకపోవడం అన్యాయం అని ఈసారైనా సదరు పదవి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని రాష్ట్రంలోని లక్షలాది మాదిగ సామాజిక వర్గం తరపున కేవలం ఉసురుపాటి బ్రహ్మయ్య నేతృత్వంలోని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ బలంగా గళం వినిపించి, అనేక పోరాటాలు చేసిందని సందర్భాన్ని గుర్తు చేసారు. ఆనవాయితీ చరిత్రను తిరగ రాస్తూ నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించ ున్న మాదిగ జాతి ఉద్దండుడు మాజీ మంత్రి , ప్రస్తుత కొవ్వూరు ఎమ్మెల్యే కే ఏస్ జవహర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. సమాజంలో అణగారిన ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాలపై నిర్దిష్ట పర్యవేక్షణ నిర్వహించి విచారణ చేపట్టి ఎస్సిల్లోని అన్ని సామాజిక వర్గాల ఉపకులాల అంబేద్కర్ రాజ్యాంగ హక్కుల రక్షణకు నడుం బిగించి వారికి సామాజిక భద్రతను కల్పించే కోణంలో జవహర్ సమర్థవంతంగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తారని ఆకాంక్షిస్తూ వారు భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని నాగరాజు మాదిగ ఆశాభావం వ్యక్తం చేశారు.


## ఘనంగా అనుపు రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

**విజయపురిసౌత్, మే 12 ప్రభాతవార్త:** పవిత్ర కృష్ణానదీ తీరాన కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం ఆలయ ధర్మకర్త రాయప్రోలు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కురుమేటి శ్రీపాద సుబ్రహ్మణ్యం



ఆధ్వర్యంలో స్వామివారికి గణపతిపూజ, పుణ్యావాచనం, అంకురారోహణ, నవగ్రహ ఆరాధన, మండప ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. గోపవరపు సుబ్బారావు సహకారంతో 6000 మందికి అన్నదానం నిర్వహించారు. తెదేపా నేత కొల్లూరి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంఓ పురావస్తు శాఖ సూపరింటెండెంట్ దిపేందర్ బోయి, డీఈ శివకుమార్, క్యూరేటర్ కమలహాసన్, సీఏ వెంకటయ్య, తెదేపా నేత బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, పర్వతాలు, వట్టికొండ జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీపత్రాలు సమర్పించిన 17మంది న్యాయవాదులను బార్ కౌన్సిల్ నుండి తొలగింపు




**గుంటూరు లీగల్,మే 12,ప్రభాతవార్త :** విద్యకు సంబంధించి నకిలీ ధృవపత్రాలతో న్యాయవాదులుగా కొనసాగుతున్న 17మందిని రాష్ట్ర బార్ కౌన్సిల్ నుండి తక్షణమే తొలగిస్తూ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత సోమవారం ఆదేశాలు జారీ చేశారు. న్యాయవాదులుగా నమోదు అయ్యే సమయంలో రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు వీరంతా అర్హత లేకుండా తప్పుడు మార్గంలోవిద్యకు సంబంధించిన దృవపత్రాలు సమర్పించారు.రాష్ట్ర ఎన్‌రోల్‌మెంట్ కమిటీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఈ అంశాన్ని తెలియజేయగా,ఏపి బార్ కౌన్సిల్ రోల్స్ నుండి వారి పేర్లు తొలగించాల్సిందిగా ఆదేశాలు అందాయి.ఈ నకిలీ న్యాయ వాదులంతా రాష్ట్ర హైకోర్టుతోపాటు వివిధ ప్రాంతాల్లో న్యాయవాద వృత్తి కొనసాగించారు.ఈ 17మందిని తక్షణమే తొలగిస్తున్నట్లు నోటిఫికేషన్ వెలువరించారు.

## అవగాహనలో బుద్ధ జయంతి

గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త : భారతీయ తత్వవేత్త,సంస్కర్త బుద్ధుడి జీవితం విశ్వానికి వెలుగైందని ఎందరికో ఆత్మోద్ధరణకు దారి చూపిందని అందుకే ఈనాటి వైశాఖ పూర్ణిమను బుద్ధపూరి ్ణమ అంటారని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన బుద్ధజయంతి కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సీనియర్ సభ్యులు మాట్లాడుతూ అన్నారు.సంస్థ కార్యాలయంలో బుద్ధపూర్ణిమ సందర్భంగా బుద్ధుని బోధనలు ఇప్పటికీ అనుసరణీయమే అన్న అంశంపై పాల్గొన్నవారు మాట్లాడారు.

# వైకాపా ప్రభుత్వంలో జరిగిన అరెస్టులు సక్రమమా? చట్టప్రకారం ఇప్పుడు చేసేవి అక్రమమా?

## -విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులు

**చిలకలూరిపేట,మే12,ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వ హయంలో టిడిపి నేతల అరెస్ట్‌లు అన్నీ చట్టప్రకారం జరిగాయా అని మాజీమంత్రి విడదల రజినిని తెలుగుదేశం పార్టీ నాయకుల ప్రశ్నించారు. సోమవారం టిడిపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ



టిడిపి బిసి నేతలు అచ్చెనాయుడు, కొల్లు రవీంద్ర, చింతకాయల అయ్యన్న పాత్రుడుపై తప్పుడు కేసులు పెట్టినప్పుడు రజిని ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పట్టణంలోని పేద ప్రజలకు ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా మంచినీరు అందించే పథకం ప్రారంభానికి వెళ్లిన ప్రత్తిపాటిని అడ్డుకొని ఆయనపై తప్పుడు కేసులు పెట్టించినప్పుడు ఆమెకు చట్టం గుర్తుకురాలేదా? మోసగాడు శ్రీకాంత్ అరెస్ట్‌తో రాష్ట్రమే ఆందోళనకు గురవుతున్నట్లు రజిని వ్యవహరించిందని వారు విమర్శించారు. బిసి మహిళనని చెప్పుకునే ఓసీ రజిని బీసిలపై ఆమెది కపట ప్రేమ అని వారు వివరించారు. శ్రీకాంత్‌రెడ్డి అరెస్ట్‌పై వైసిపి నేతల వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నా యన్నారు. తమ దోపిడి కోసం ప్రశాంతమైన చిలకలూరిపేట నియోజకవర్గాన్ని మాజీమంత్రి విడదల రజిని అరాచకాలు, ఫ్యాక్షన్ అడ్డాగా మార్చిందని వారు విమర్శించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో రజిని చేసిన అవినీతి, ప్రజలకు చేసిన మంచిపై ఆమె బహిరంగచర్చకు రావాలని టిడిపి నేతలు సవాల్ విసిరారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరికి ఏ పని కావాలన్నా పర్సంటేజీలు వసూలు చేసిన ఘనత రజినిదని, ఆమె అవినీతి దాహానికి పోలీస్‌శాఖ బలైందన్నారు. ఆమె కాలంలో పనిచేసిన ఐదుగురు సిఐలు ఏకంగా విఆర్‌కు వెళ్లడమే అందుకు నిదర్శనమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా తెలిపారు స్వంత పార్టీకే తలనొప్పిగా మారిన రజిని తీరు సహించలేకనే ఆమెను వైసిపి అధిష్ఠానం గుంటూరుకు పంపించిందన్నారు. ఆమె అవినీతి

జాబితా చెంతాడుకు కూడా మించి పోతుందన్నారు. తప్పుడు పనులను చేసినవారిని కాపాడేందుకు మాజీమంత్రి రజిని ప్రయత్నించడం సిగ్గుచేటని ఆయన ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా చంద్రబాబునాయుడు ఆరెస్ట్ సమయంలో ఎంత నిరంకుశత్వంగా వ్యవహరించిందో రాష్ట్ర ప్రజానీకం చూసిందని అన్నారు. పల్నాడుజిల్లా ఆత్మకూరుకు వెళ్లకుండా చంద్రబాబును అడ్డుకొని ఆయన ఇంటి గేటుకు తాళాలు వేయించింది మీరుకాదా అని ప్రశ్నించారు. కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చిన స్వంతపార్టీ యంపి లావు శ్రీకృష్ణ దేవరాయలపై రజిని చేయించిన దాడి ఇప్పటికి మరచిపోలేదని మున్సిపల్ టిడిపి పక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు అన్నారు. అప్పులు చేసి ప్రజలను మోసం చేసి పారిపోయిన శ్రీకాంత్‌రెడ్డి, రజిని పంచన చేరాకే కోటీశ్వరుడయ్యాడని టిడిపి నాయకులు యంవి రత్నారెడ్డి విమర్శించారు. 2019కు ముందు శ్రీకాంత్‌రెడ్డి ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలియదని, అప్పులు చేసి తన పొలం తాకట్టుపెట్టి యడ్లపాడులో ఒక సినిమాహాల్ నిర్వహిస్తూ వ్యాపారం పేరుతో ప్రజలను మోసగించాడని రత్నారెడ్డి తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన ఒక్క నెలలోనే తాకట్టులో ఉన్న తన పొలం విడిపించుకొని, భారీ భవనం కట్టించాడని అంత సొమ్ము అతనికి ఎలా వచ్చిందో రజిని చెప్పాలని రత్నారెడ్డి డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌రెడ్డిని నమ్మి తాను డబ్బులు ఇచ్చి మోసపోయానని ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, తుపాకుల అప్పారావు, పిల్లి కోటి, మురకొండ మల్లిబాబు, ముద్దన నాగేశ్వరరావు తదితరులు పాల్గొని విడదల రజిని అక్రమాలపై ధ్వజమెత్తారు.

# పొగాకు రైతుల ఆందోళన

## 15వేల కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్

**యడ్లపాడు, మే 12, ప్రభాతవార్త :** నల్ల బర్లి పొగాకు రైతులు సోమవారం గిట్టుబాటు ధర కోసం యడ్లపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా రైతులు నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తపరిచారు. కంపెనీలు, ప్రభుత్వం నాణ్యత పేరుతో



దిగుబడులను తిరస్కరిస్తూ ప్రైవేట్ వ్యాపారులకు సైతం విక్రయించనీయ కుండా చేస్తున్న చర్యలను నిరసిస్తూ రైతులు తీవ్రంగా విమర్శించారు. రైతు సంఘాలు ప్రజా సంఘాలు ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నాయి. రైతులకు న్యాయం జరిగే వరకు తమ సంఘాలు భరోసా వెన్నంటే ఉంటాయని అయా సంఘాల నాయకులు హామీ ఇచ్చారు. గత రెండేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పెట్టుబడి, శ్రమకు సరైన లాభం లేని పరిస్థితులను నాయకులు వివరించారు. ఈ సందర్భంగా నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దాసరి వరహాలు, తదితరులు మట్లాడారు. రైతన్న కష్టాన్ని గాలికొదులుతున్న ప్రభుత్వం తక్షణమే స్పందించి నల్ల బర్లికి స్పష్టమైన మద్దతు ధర నిర్ణయించాలి అని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర 15వేలు తగ్గకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలో 5హెక్టార్లు ఈ ఏడాది పొగాకు సాగు అయిందన్నారు. సాగు చేసిన వారంతా చిన్న సన్న కారు రైతులేనని కనీసం తాము పండించిన పొగాకును భద్రపరుచుకునేందుకు కూడా అవకాశం లేక పంట పొలాల్లోనే ఉంచుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారన్నారు. బర్లి రకాన్ని బోర్డులో చేర్చాలని, కంపెనీలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని లేకుండే ప్రభుత్వాలే వాటిని కొనాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన ధశల వారీగా ఉధృతం చేస్తామని నాయకులు రైతులు తెలిపారు. ఆందోళన అనంతరం రైతులు తమ సమస్యలు, డిమాండ్లు పేర్కొన్న వినతిపత్రాన్ని డిప్యూటి తహశీల్దార్ అనురాధకు అందజేశారు. దీనిని ప్రభుత్వానికి పంపి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు పొగాకు రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్నారైలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు

**మంగళగిరి, మే 12, ప్రభాతవార్త:** ఎన్నారై మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ నందు అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సులు ఆరోగ్య సంరక్షణకు గుండెకాయ లాంటివారని, కరుణ మరియు అంకితభావానికి కట్టుబాటి సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశాన్ని కాపాడుతూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు సంతాపం తెలిపారు. గౌరవ అడ్మినిస్ట్రేటర్ మండవ



విష్ణువర్ధన్ మాట్లాడుతూ, మెరుగైన పని పరిస్థితుల కోసం యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని, మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ శ్రేయస్సుకు కూడా తగిన ప్రాధాన్యతను ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లక్ష్మి ,మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వేంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ బైజూ పాల్గొన్నారు.

## జూన్ 6నుండి వేద పాఠశాల పునఃప్రారంభం

**గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త :** స్థానిక మారుతీనగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆర్షధర్మ సమితి వేద స్మార్త సంస్కృతి శాస్త్ర పాఠశాల 2025-26సంవత్సరాలకు సంబంధించి వేద పాఠశాల జూన్ 6వ తేదీ నుండి పునః ప్రారంభించబడుతుందని, పాఠశాల్లో చేరి వేదం స్మార్తము అభ్యసించదలచిన విద్యార్థులు 8నుంచి 13సంవత్సరాల్లోపు ఉండి, విద్యార్థులు ఉపనయనం అయిన వారు అర్హులు ఇతర వివరాలకు కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ 9848872729 నెంబర్ ద్వారా గాని ప్రత్యక్షంగా దేవాలయ ప్రాంగణంలో గల కార్యాలయంలో సంప్రదించగలరని, అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆలయపాలకమండలి తెలియజేశారు.

## పార్టీకి అంకితభావంతో పని చేసిన వారికి నామినేటెడ్ పదవులు

**పెదకూరపాడు, మే 12 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ నిబద్ధతతో, విశ్వాసంతో, సేవా దృక్పథంతో కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవుల రూపంలో గౌరవం లభించటం హర్షణీయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ వెంటే నిలబడి, ప్రజల్లో



తెలుగుదేశం ఆశయాలను ముందుకు తీసుకెళ్ళినవారికి సముచిత స్థానం కల్పించిన తెలుగుదేశంపార్టీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. నామినేటెడ్ పదవులలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం కల్పిస్తూ 22 కార్పోరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించడం సంతోషకరమన్నారు. నామినేటెడ్ పదవులు కష్టపడిన వారి నిస్వార్ధ సేవలకు పార్టీ ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. కష్టపడి పని చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుం దన్నారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవులు పొందిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అభినందనలు తెలిపారు.

## ఆర్యవైశ్య పేద మహిళలకు పింఛన్లు పంపిణీ

**చిలకలూరిపేటటౌన్,మే12,ప్రభాతవార్త:** పట్టణం లోని ఆర్యవైశ్య కళ్యాణమండపం, వాసవీ జ్ఞాన మందిరంనందు సోమవారం వాసవీక్లబ్, వాసవీ గ్రేటర్ ఫ్యామిలీ మరియు ప్లాటినం క్లబ్‌ల





ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య మహిళలకు నెలవారీ ఫించన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షులు ఐతా వెంకటప్రసాద్, కార్యదర్శి కొత్తమాసు పూర్ణచంద్రరావు, కోశాధికారి శనగపల్లి వెంకటేశ్వరరావు, కళ్యాణ మండపం అధ్యక్షులు డాక్టర్ ఎవియస్ సురేష్‌కుమార్, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కొలిశెట్టి శివసుబ్రహ్మణ్యం, వాసవి జిల్లా డిపిఆర్ఒ మద్ది వెంకట అప్పారావు, గ్రంధి రామకృష్ణ, టి కృష్ణ, చేవూరి కృష్ణమూర్తి, పొట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వాసవీ ఫ్యామిలీస్ క్లబ్‌క చెందిన నాయకులు కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, తవ్వా నాగమల్లేశ్వరరావు, ఆర్వపల్లి సత్య నారాయణ, దామిశెట్టి నాగేంద్రం, హేమలత, చిన నాగేశ్వరరావు, శ్రీహరి, కిషోర్, వివి కోటేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పోలేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే12,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారసంస్థ భామా ఫ్యాషన్స్ అధినేత కొంజేటి నాగ పోలేశ్వరరావు ఇటీవల మృతిచెందిన సంగతి విదితమే. కాగా పోలేశ్వరరావు పెద్దకర్మను పట్టణంలోని వారి నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని పోలేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్తిపాటితో పాటు టిడిపి



నాయకులు ఇనగంటి జగదీష్‌బాబు, పఠాన్ సమద్‌ఖాన్, కొత్త కోటేశ్వరరావు, గట్టినేని రమేష్, షేక్ బాజీ, పూల పాపారావు, గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ మంత్రి కే ఎస్ జవహర్ ఎంపికపై హర్షం

మంగళగిరి, మే 12, ప్రభాతవార్త :ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కే ఎస్ జవహర్ కు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు సోమవారం ఒక ప్రకటనలోతెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు కట్టెపోగు ఉదయభాస్కర్ ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాల ఎస్సీ కమిషన్ చరిత్రలో ఛైర్మన్ గా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కే ఎస్ జవహర్ ను నియమించిన కూటమి ప్రభుత్వ చరిత్ర సృష్టించిందని ఉదయ భాస్కర్ కొని యాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవి కొన్ని దశాబ్దాల నుండి కేవలం మాల సామాజిక వర్గానికి కేటాయించడం రాజకీయ పార్టీలకు ఆనవాయితీగా మారిందని ఎస్సీల్లో మాదిగ సామాజిక వర్గానికి కమిషన్ ఛైర్మన్ పదవి ఇవ్వకపోవడం అన్యాయం అని ఈసారైనా సదరు పదవి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని రాష్ట్రంలోని లక్షలాది మాదిగ సామాజిక వర్గం తరపున కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తులు ,వినతి పత్రాలు అందజేయడం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చేసిన విజ్ఞప్తిని కూటమి ప్రభుత్వ గుర్తించి ఆనవాయితీ చరిత్రను తిరగ రాస్తూ నూతన ఛైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్న మాదిగ జాతి ఉద్దండుడు మాజీ మంత్రి కే ఏస్ జవహర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు అభినందనలు ఉదయ భాస్కర్ తెలియజేశారు. సమాజంలో అణగారిన ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాలపై నిర్దిష్ట పర్యవేక్షణ నిర్వహించి విచారణ చేపట్టి ఎస్సీల్లోని అన్ని సామాజిక వర్గాల ఉపకులాల అంబేద్కర్ రాజ్యాంగ హక్కుల రక్షణకు నడుం బిగించి వారికి సామాజిక భద్రతను కల్పించే కోణంలో జవహర్ సమర్థవంతంగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తారని ఆకాంక్షిస్తూ వారు భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని టిడిపి నాయకులు కట్టెపోగు ఉదయ భాస్కర్ ఆకాంక్షించారు.

## చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ బాలలు ఆశ్రమాన్ని సందర్శించిన అధికారులు

**రాజుపాలెం, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని కోట నెమలిపురి పంచాయితీ పరిధిలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో




నడుపుతున్న చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ ని బాలలు ఆశ్రమాన్ని సోమవారం జిల్లా ప్రొబేషనరీ ఆఫీసర్ సౌందర్య, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సొరాజు, చైల్డ్ జిల్లా ప్రొటెక్షన్ యూనిట్ కృష్ణారెడ్డి, సిడిపిఒ శ్రీలత, ఏసిడిపిఒ శాంతి, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రశాంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రశాంత్‌కుమార్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వసతి వసతి ఉంటున్న బిల్డింగ్‌ను, రికార్డ్స్‌ను, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆహారాన్ని, స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ గతంలో లైసెన్స్ పొంది ఉన్నారని, ప్రస్తుతం లైసెన్స్ గడువు ముగియడంతో సొసైటీని సందర్శించడం జరిగిందన్నారు. ఈ గృహం చుట్టూ పరిశుభ్రమైన వాతావరణం పరిశుభ్రంగా ఉందన్నారు. ఆశ్రమంలో రికార్డ్స్‌ను తనిఖీ చేసి అంతా సంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా బాలబాలికల కోసం అనుమతులు లేకుండా అనాధ ఆశ్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా బాల బాలికల కోసం ఆశ్రమాలు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోవాలన్నారు.

## తెదేపా నాయకుడు మద్ది శివశంకర గుప్తా చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే12,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, 20వ వార్డు పార్టీ అధ్యక్షుడు మద్ది శివశంకరగుప్తా ఇటీవల మృతి చెందిన సంగతి విదితమే. కాగా ఆయన పెద్దకర్మను సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



పాల్గొన్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శివశంకరగుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు టిడిపి నాయకులు ఇనగంటి జగదీష్‌బాబు, పఠాన్ సమద్‌ఖాన్, గట్టినేని రమేష్, గంజి పోలయ్య, చేవూరి కృష్ణమూర్తి, రాచుమల్లు సూర్యారావు, షేక్ రఫీ, షేక్ భాషా, ఆర్యవైశ్య ప్రముఖులు బంగారు గుప్తా, కొత్త కోటేశ్వరరావు, ఆర్వపల్లి సురేష్‌కుమార్, శిఖాకొల్లి శ్రీనివాస గుప్తా తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ అందజేత

**పెదనందిపాడు మే 12 (ప్రభాతవార్త)** బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కామ్రేడ్ కొల్లా వెంకయ్య చేసిన సేవలకు గుర్తింపుగా .పెదనందిపాడులో వారి పేరు మీద ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఇటీవల ఉచిత కంప్యూటర్



శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు సహకరించడం తమకెంతో సంతోషంగా ఉందని .ఇంకా వారి అభివృద్ధి కోసం పలు రకాల సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు కామ్రేడ్ కొల్లా వెంకయ్య మనుమడు డాక్టర్ కొల్లా అమర్ అన్నారు. సోమవారం స్థానిక కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో. నిర్వాహకులు ఇటీవల కంప్యూటర్‌ఉపాధ్యాయులుసిద్ధా బత్తునినాగేశ్వం ✓రావు. ద్వారా పలువురు మహిళలకు ఉచితంగా కంప్యూటర్ లో .డిప్లమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ (డి.సి.ఏ) లో శిక్షణ తరగతులు నిర్వహించారు. అందులో శిక్షణ పూర్తి చేసుకున్న 16 మందికి కామ్రేడ్ కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీ వారి సర్టిఫికెట్లను. డాక్టర్ కొల్లా అమర్ .డాక్టర్ చిగురుపాటి లిఖిత లు అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయురాలు జవహార్ రాణి మాట్లాడుతూ. డాక్టర్ కొల్లా రాజమోహన రావు సూచన మేరకు మహిళలకు సర్ఫ్. ఫినాయిల్. సోప్ ఆయిల్. జండూబామ్‌ల తయారీలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈ శిక్షణ పొందుగోరు వారు తమ పేరును గ్రంథాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. డాన్స్ మాస్టర్ జూపూడి సుబ్బారావు మాట్లాడుతూ ఐదు ఆరు సంవత్సరాలు పైబడిన పిల్లలకు భరతనాట్యం. పద నృత్యం. దేశభక్తి గీతాలు. కూడా ఉచితంగా నేర్పుతామన్నారు ఆసక్తి కలవారు ఈ గ్రంథాలయంలో వారి పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సంఘ నాయకులు రమేష్. కొల్లా రామన్. నిర్మల రామన్. బోడావుల హనుమంతరావు. కొల్లా వెంకయ్య చౌదరి. లావు చౌడేశ్వరి. ఏ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## చిట్టా ఈశ్వరమ్మకు నివాళులర్పించిన డాక్టర్ గజ్జల

**సత్తెనపల్లి, మే 12 ప్రభాతవార్త :** ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి మాతృమూర్తి ఈశ్వరమ్మ దశదిన కార్యక్రమంలో సోమవారం సత్తెనపల్లి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం



చారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి వెంట కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, వల్లెం నరసింహారావు, యాసారపు బాబు, సాయిమహేష్, కృష్ణారెడ్డి తదితరు ఉన్నారు.

## వైభవంగా నాదెండ్ల గ్రామంలో శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి రథోత్సవం




**నాదెండ్ల,మే12,ప్రభాతవార్త:** నాదెండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీసమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి రథోత్సవాన్ని వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని గ్రామంలోని అన్ని పురవీధులలో ప్రదర్శనగా తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను గైకొన్నారు.

## 13న ఇన్నర్‌వీల్ క్లబ్, ఓమేగా క్యాన్సర్ హస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**చిలకలూరిపేట,మే12,ప్రభాతవార్త:** ఇన్నర్‌వీల్ క్లబ్, ఓమేగా క్యాన్సర్ హస్పటల్, రామకృష్ణా మెమోరియల్ నర్సింగ్‌హోం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13వ తేది మంగళవారం ఉదయం 10 గంటలకు రామకృష్ణ మెమోరియల్ నర్సింగ్‌హోం నందు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సరోజని, నార్నె జయలక్ష్మీలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీలకు రొమ్ము క్యాన్సర్ పరీక్ష (మెమొగ్రాం), స్త్రీలకు గర్భసంచి ముఖద్వార క్యాన్సర్ పరీక్ష (పాప్‌స్మీయర్)పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు వారు వివరించారు. చిలకలూరిపేట ప్రాంతంలోని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిదిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా డాక్టర్ కొల్లా హేమంతీదేవి, డాక్టర్ కందిమళ్ల జయమ్మ, డాక్టర్ లావు అరుణలు పాల్గొంటారని వారు వివరించారు.

## ఓ వైపు చెత్త...మరో వైపు దుర్వాసన...మరో వైపు ప్లాస్టిక్ భూతం

**సత్తెనపల్లి, మే 12 ప్రభాతవార్త :** పట్టణంలోని 14వ వార్డు పరిధిలో వీరాంజనేయనగర్ ముందు చెంచు కాలనీకి స్టార్టింగ్ ప్రాంతంల చెత్త, వ్యర్థాల వాసనకు ఉండలేకపోతున్నామని స్థానికులు



వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా ఉపయోగం లేదని స్థానికులు చెప్తున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందిస్తే పరిష్కారం అయ్యే అవకాశం ఉందని వారు తెలియజేస్తున్నారు. సత్తెనపల్లిలో స్వచ్ఛ సత్తెనపల్లి అమలు ఎక్కడ అని వారు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు పట్టణం అంతా ఆవుల మందలు కనిపిస్తున్నాయన్నారు. సంబంధితశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు

**అమరావతి, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని లింగాపురం గ్రామంలో కిశోరి బాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై



గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధి బత్తుల బాబు అధ్యక్షత వహించారు. బాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయికి 19 సంవత్సరాలు నిండిన తర్వాత అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే పెళ్లి చేయాలన్నారు. అదే విధంగా ఆడపిల్లలకి ఎలాంటి సమస్యలు ఉన్నా 100, 1098, 112 లాంటి లాంటి ట్రోల్ ఫ్రీ నెంబర్స్‌కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సుపీరియర్, సిస్టర్ విన్నరసి విచ్చేసి మాట్లాడుతూ మా సంస్థ 74 దేశాల్లో ఆడపిల్లల, మహిళల హక్కుల కోసం పని చేస్తుందన్నారు. భారతదేశం కంప్యూటర్ యుగంలో ముందుకు దూసుకెళ్తున్నప్పటికీ బాలికలపై అత్యాచారం జరుగుతునే ఉందన్నారు. ఈ సామాజిక రుగ్మతలు తొలగించాలంటే ఆడపిల్లల్ని మగ పిల్లల్ని సమానంగా చూడాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల్ని వాళ్ళ కాళ్ళ మీద వారు నిలబడేంతవరకు చదివించాలన్నారు. అందుకే ప్రతి గ్రామంలో బాల పార్లమెంట ఏర్పాటు చేసి పిల్లలందరికీ చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు, బాలల హక్కులు, వారి యొక్క బాధ్యతల గురించి వారితో మాట్లాడుతూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లలితకుమారి, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## మెట్రోలజీ డే వారోత్సవాలు

**సత్తెనపల్లి, మే 12 ప్రభాతవార్త :** మెట్రోలజీ డే వారోత్సవాలను సోమవారం పట్టణంలో నిర్వహించారు. తూనికలు, కొలతలశాఖ జిల్లా అధికారి అల్లూరయ్య వ్యాపారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు అమ్మే ప్రతి వస్తువుపై తేదీ, ప్యాకింగ్, కంపెనీ పేరు, అడ్రస్, బార్ కోడ్, ఎక్స్‌పైర్ వివరాలు ఉండాలన్నారు. హోల్‌సేల్‌గా అమ్మే రైస్ బ్యాగ్స్‌లో 26 కేజీల తూకం ఉండాలన్నారు.




రైస్ బ్యాగులపై చిరునామా ఉండాలన్నారు. తూకాలలో మోసం చేస్తే ఊరుకోబోమన్నారు. ఈ నెల 20వతేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని అల్లూరయ్య తెలిపారు.

## శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

**మంగళగిరి, మే 12, ప్రభాతవార్త :** శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమబుద్ధా రోడ్డు



వద్ద శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం కార్యాలయం ప్రాంగణంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఛైర్మన్, శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా మందికి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు అనంతరం సంఘ అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో సేవాగుణంతో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రారంభం నుండి నిర్విరామంగా ప్రతిరోజు పాదచారులకు, వాహనదారులకు ఉచితంగా చల్లటి మినరల్ వాటర్ ను అందించడంతోపాటు దాతల సహకారంతో ప్రతి సోమవారం సుమారు1000 మందికి పైగా పాదచారులకు, వాహనదారులకు ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశ్యంతో తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ బృహత్తర కార్యక్ర మాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలు, ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ట్రస్ట్ ఛైర్మన్ సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంగళం ప్రసాద్, కర్నాటి శివసత్యనారాయణ, నల్లమోలు నాగరాజు, రమాదేవి, నల్లమోలు సుబ్రహ్మణ్యం, కగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రమణ్యం, పంచల శివన్నారాయణ, కల్వకొల్లు గోపీ, బేతపూడి మధుబాబు, దుంపసోములు, నంద్యాల గోపాల కృష్ణ, రెడ్డి వీరరాఘవులు, ఉద్దంటి మురహరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# విపత్తుల పర్యవేక్షణపై అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : బాపట్లజిల్లా కలెక్టర్

**బాపట్ల,మే12,ప్రభాతవార్త:** విపత్తు నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విపత్తు నిర్వహణ పర్యవేక్షణపై జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల



స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులందరికి శిక్షణా కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ విపత్తు సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రాణ నష్టాన్ని నివారించవచ్చున్నారు. రానున్న వర్షాకాలంలో విపత్తు నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. బాపట్ల జిల్లాకు అకాల వర్షం, ఉరుములు మెరుపులు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. జూన్ నుంచి డిసెంబర్ వరకు రెండు పర్యాయాలు తుపాను వచ్చే అవకాశం ఉందన్నారు. కృష్ణానది వరద విపత్తు రానున్న పరిస్థితులను పరిగణలోకి తీసుకుని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. పిడుగులు పడుతున్న సమాచారాన్ని 30 నిమిషాల ముందే ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విపత్తు నిర్వహణ సంస్థ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజల మొబైల్ ఫోన్లకు సమాచారం ఇస్తున్నామన్నారు. అందించిన సమాచారంతో ప్రజలు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి అవగాహన కల్పించాలన్నారు. సమాచారం అందిన వెంటనే సచివాలయాల పరిధిలో ప్రజలను చైతన్య పరచడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. తుపాను సమయంలో ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఆయన పలు సూచనలు చేశారు. అవగాహనతోనే విపత్తు నుంచి ప్రాణాలు రక్షించుకోగలమని ఏపీ ఎస్ డి ఎం ఏ సాంకేతిక నిపుణులు బస్వంత్ చెప్పారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి విపత్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. ఎస్ఎంఎస్, వాయిస్ రికార్డ్ ద్వారా సమాచారం అందిస్తున్నామన్నారు. ఇలాంటి సమాచారం ద్వారా ప్రజలు ముందస్తుగా ఏం చర్యలు తీసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం నుంచి తప్పించుకోగలమని విషయాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రథోత్సవం

## - భక్తులతో కిటకిటలాడిన స్వర్ణపురి వీధులు

**పొన్నూరు, మే 12, ప్రభాతవార్త:** శ్రీ భావదేవుని బ్రహ్మోత్సవాల్లో 9వరోజైన సోమవారం ఉదయం కళ్యాణమూర్తులైన శ్రీ సుందరవల్లి, రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారు వాహన సేవలో విశిష్టమైన గరుడవాహనంపై స్వర్ణపురి పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తి, పరాక్రమము, సేవానిరతి, చంచలమైన విశ్వాసము కలిగిన స్వామి వారికి అవసరతకు తగినట్లు ప్రవర్తించగలిగినవాడు గరుత్మంతుడు. ఆయన స్వామివారిని తన భుజములపై పెట్టుకుని వెళ్ళుటకు అమితానందం చెందుతాడు. సర్పదోషములు కలిగినవారు గరుడుని పూజించినచో ఆ దోషములు రహితమగును. అటువంటి గరుడవాహన సేవను దర్శించడం సర్వపాపక్షయకరం. తదనంతరం స్వామివారికి విశిష్టమైనటు వంటి రథోత్సవం జరిగింది. వైశాఖ పౌర్ణమిని భావయ్య పౌర్ణమి అని కూడా పిలుస్తారు. ఈ పౌర్ణమినాడు సాక్షి భావదేవుడు ఉభయ దేవేరులతో ఆసీనుడై ఉన్న స్వామివారు పురవీధుల్లో వెళ్ళి భక్తులకు కనువిందు చేశారు. "రథస్త కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అని శాస్త్ర ప్రమాణము. రథారూఢుడైన కేశవుని దర్శించిన వారికి పాపము నశించి మరలా జన్మ ఉండదని తెలియుచున్నది. ఈ రథోత్సవ సేవలో పాములపాటి వంశీయులు మేజర్ పి.టి. చౌదరి, పాములపాటి కృష్ణయ్య, పాములపాటి కమలేంద్రనాథ్ చౌదరి వారసులు శఠారి ధరించి ఆలయ మర్యాదలను అందుకున్నారు. తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ రథోత్సవానికి తొలుత పూజలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి జెండా ఊపారు. యాజ్ఞీకస్వామి ఎన్.ఎస్.కె.ఆర్.



భట్టాచార్యులు, అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, రొంపిచర్ల గౌతమ్ తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో జూనియర్ అసిస్టెంట్ మాజేటి జగన్నాథరావు, సిబ్బంది రత్నం, హరిబాబు ఏర్పాట్లు చేశారు. తెనాలి డిఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో పొన్నూరు అర్బన్ సిఐ లావూరి వీరానాయక్, తెనాలి రూరల్, త్రీటౌన్ సిఐలు నేతృత్వంలో అర్బన్, రూరల్ ఎస్సైలు వాగాల శ్రీహరి, గండు కిరణ్‌లతోపాటు పులువురు ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# అర్జీదారుల సమస్యలను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలి : బాపట్లజిల్లా ఎస్పీ

**బాపట్ల,మే12,ప్రభాతవార్త:** అర్జీదారుల సమస్యలను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను



ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి సంతృప్తికర రీతిలో పరిష్కారం చూపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు ఇతర సమస్యలపై 63 మంది అర్జీదారులు వారి సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన పోతుపాలేపు నాగరాజ తన సమస్యను చెప్పుకోవడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చినది. అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ స్వయంగా ఆమె వద్దకే వెళ్ళి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారికి ఫోన్ చేసి చట్ట పరిధిలో విచారించి త్వరిత గతిన సమస్యను పరిష్కరించి బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మే 12 ప్రభాతవార్త : మండలంలోని నందిగామ గ్రామంలో సోమవారం జరిగిన తాళ్ళూరి వారి వివాహ వేడుకకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా ఎమ్మెల్యే కన్నాకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

# పిజిఆర్ఎస్‌కు ఐదు అర్జీలు

**పొన్నూరు, మే 12,ప్రభాతవార్త:** ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌కు ఐదు అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి, జవాబుదారీ తనానికి పిజిఆర్ఎస్ ఎంతగానో దోహదపడు



తుందన్నారు. వచ్చిన మొత్తం ఐదు అర్జీలలో రెవెన్యూకు సంబంధించి మూడు అర్జీలు, సివిల్ సప్లయిస్‌కు సంబంధించి ఒక అర్జీ, సర్వేకి సంబంధించి ఒక అర్జీ అందినట్లు చెప్పారు. వీటిని ఆయా శాఖలకు పరిష్కారం కోసం పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, ఐసిడిఎస్ సిడిపిఓ ఎస్.వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య, ఆర్అండ్‌బి ప్రతినిధి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా అన్న సంతర్పణ

**బాపట్ల,మే12,ప్రభాతవార్త.:** పట్టణంలో వేంచేసియున్న క్షీర భావన్నారాయణ స్వామి వారి 1432 వ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమ వారం మాజి ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అధ్వర్యంలో



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజి ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ స్వామి వారి రథోత్సవం సందర్భంగా ప్రతి ఎడాది అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించటం చాలా అనందంగా ఉందన్నారు. ఇటువంటి అవకాశం రావడం తన పూర్వజన్మ పుణ్యఫలమన్నారు. సమాజంలో ఎంతో మంది ఉన్నప్పటికి ఇటువంటి ఆవకాశం రావడం తన అదృష్టంగా బావిస్తున్నానన్నారు. భావన్నా రాయన స్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయసహాకారాలను పూర్తిగా అందిస్తానన్నారు. శాసన సభ్యులు వేగేశననరేంద్రవర్మ మాట్లాడుతూ అన్నం సతీష్ ప్రభాకర్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్నలనుపొందా రన్నారు. స్వామి రథోత్సవాన్ని పురస్కరిం చుకుని ప్రతి ఏడాది అన్నదాన కార్యక్ర మాలు నిర్వ హించడం అభినంద నీయమ న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అబిమానులు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించండి: ఎమ్మెల్యే

మాచర్ల, మే 12 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని రైతాంగం ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. సోమవారం మాచర్ల పట్టణంలో జరిగిన ప్రజా సమస్యల



పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు వేసవిలో పచ్చిరొట్టకు బదులఉుగా దుక్కుల్లో వాడుకునే 30 రకాల ధాన్యాలతో కూడిన కిట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు పీజీఎస్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన పరిచే విధంగా మాచర్ల నియోజకవర్గంలో ఒక వ్యవసాయ క్షేత్రాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు అమలకుమారి, ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ వినోదా, సిబ్బంది అబ్దుల్‌నబీ, వాణి, వెంకటరెడ్డి, ఏడీఏ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవా భావంతో పనిచేస్తున్న డీలర్లు

## -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, మే 12,ప్రభాతవార్త:** పొన్నూరు రేషన డీలర్లు సేవా భావంతో సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి తిరునాళ సందర్భంగా ప్రతి ఏటా భక్తులకు ప్రసాద పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని, వారి సేవా దృక్పదానికి అద్దంపడు తోందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. తిరునాళ్ళ సందర్భంగా తహశీల్దార్



కార్యాలయ ప్రాంగణంలో భక్తులకు చక్కెరపొంగళి, పులిహోర ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కేంద్రాన్ని తహశీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలన్నారు. మానవసేవే మాధవ సేవ అన్నట్లుగా ప్రతి ఒక్కరూ మానవులకు సేవ చేయాలన్నారు. తిరునాళ్ళ సందర్భంగా వచ్చే భక్తులకు ఇలాంటి ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయడం శుభపరిణామమన్నారు. క్రమం తప్పకుండా ప్రతి ఏటా నిర్వహించడం పలువురికి ఆదర్శంగా నిలస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అవ్వారు వెంకటేశ్వరరావు, కొమ్మినేని రాంబాబు, వెంకటేశ్వరరావు, తీర్థానందబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం శాంతిని, అభివృద్ధిని ప్రజలకు అందిస్తుంది : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మే 12 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం శాంతిని, అభివృద్ధిని ప్రజలకు అందిస్తుందని



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. రొంపిచర్ల మండలం ఎడ్వర్డుపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు టిడిపి వారిపై దాడి చేసి గాయపరచడం శోచనీయమన్నారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు. పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి ఇటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడేవారు ఎవరైనా వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలపై వందల సంఖ్యలో కేసులు పెట్టారని గుర్తు చేశారు. అయితే గడిచిన ఏడాది కాలంలో అభివృద్ధి మాత్రమే ఆకాంక్షిస్తూ ముందుకు వెళ్తున్నామని, ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో అలజడులు సృష్టించవద్దని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. తొలుత వైద్యశాలలో పార్టీ నాయకులతో కలిసి గాయపడిన పార్టీ కార్యకర్తలను పరామర్శించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అరవింద్‌బాబు వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలి

## -మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ

**పొన్నూరు, మే 12,ప్రభాతవార్త:** భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశం మనది, ఇక్కడ ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాల్సిన అవసరం



ఎంతైనా ఉందని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ అన్నారు. పొన్నూరు తిరునాళ సందర్భంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో సోమవారం భక్తులకు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి, పొన్నూరు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, రస్నా, తదితర పానీయాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారూఖ్ షుబ్లీ మాట్లాడుతూ భారత దేశంలో నివసించేవారంతా భారతీయులేనని, అందరూ సోదరభావంతో జీవించడం దేశ సమైక్యతకు, ఐక్యతకు నిదర్శనమన్నారు. రథోత్సవం సందర్భంగా మైనార్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జాఫర్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మెమన్‌బాషా, సుల్తాన్, పఠాన్ ఫైజుల్లాఖాన్; ఉస్మాన్ మేస్త్రీ, బాజి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీప్రసన్నాంజనేయస్వామి పదో వార్షికోత్సవం

గురజాల, మే 12 ప్రభాతవార్తః పట్టణంలోని రెడ్డి బండ సెంటర్ వద్ద శ్రీప్రసన్నాంజనేయస్వామి పదో వార్షికోత్సవం వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజ, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి కమిటి సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.



# కనిపించే దేవత అమ్మ : పోలిశెట్టి పిచ్చయ్య

**మాచర్లటౌన్, మే 12 ప్రభాతవార్త:** తల్లి, తండ్రి, గురువు, దైవం అని పెద్దలు చెప్పినట్లుగా ముందు అమ్మకే పెద్దపీట వేశారని, అందుకే అమ్మ మాతృదేవత అయిందని మాచర్ల వాసవీ వయో వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గుడి లేని దైవం అమ్మ, కల్మషం



లేని ప్రేమ అమ్మ, అమృతం కన్నా కమ్మనైన పిలుపు అమ్మ అని పేర్కొన్నారు. అమ్మ మానవజాతి మనుగడకే ప్రాణం పోసిందని కొనియాడారు. అనంతరం వృద్ధులను సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, వాసవీక్లబ్ లక్ష్మి చెన్నకేశవ అధ్యక్షులు రిటైర్డు ప్రొఫెసర్ భవనారి సత్యనారాయణ, వాసవీక్లబ్ నాయకులు మేడం నాగేశ్వరరావు, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు మేడా వెంకటలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, చుండూరు సత్యనారాయణ, పోలూరి సత్యనారాయణ, కొలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరించండి : పల్నాడు జిల్లా ఎస్పీ

**నరసరావుపేట క్రైం, మే 12 ప్రభాతవార్త :** గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆర్థిక, కుటుంబ, ఆస్తి తగాదాలు, మోసం తదితర సమస్యలకు సంబంధించి 75 ఫిర్యాదులు వచ్చినట్లు సోమవారం వారు తెలిపారు. పిడుగురాళ్ళ మండలంలో బాధితు రాలు మరియమ్మ తన భర్తకు సంబంధించిన ఆస్తి



ఇప్పించాలని కోరారు. క్రోసూరు మండలానికి చెందిన బాధితుడు వెంకటేశ్వరరావు స్థలానికి సంబంధించిన వివాదం పరిష్కరించాలన్నారు. షాలేంనగర్‌కు చెందిన మోహన్‌రావు తన స్థలాన్ని బలవంతంగా వ్రాయించుకునేందుకు బెదిరిస్తున్నారని తెలిపారు. చిలకలూరిపేటకు చెందిన లక్ష్మి చీటీలు కట్టించుకుంటూ మెంబర్లకు సక్రమంగా డబ్బులు చెల్లించడం లేదని బాధితులు తెలిపారు. ఆయా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలిచ్చారు.

# లేబర్‌కోడ్స్ వద్దు : సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్

**కొల్లిపర,మే 12 ప్రభాతవార్త:** లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని..కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ పిలుపునిచ్చారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 20 జరిగే దేశవ్యాపిత సమ్మెలో



పంచాయతీ కార్మికులు కూడా పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కోటా చంద్రశేఖర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్ మండల అద్యక్షురాలు నిర్మలజ్యోతి, శేషారత్నం, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్వర్డుపేట గ్రామంలో గాయపడిన వారికి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి పరామర్శ

**రొంపిచర్ల, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని ఎడ్వర్డుపేట గ్రామంలో తెలుగుదేశంపార్టీ వారి దాడిలో



గాయపడిన కోడూరు చిన్న అంజిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మైనార్టీ కుటుంబాలపై తెలుగుదేశంపార్టీ వర్గీయులు చేస్తున్న దాడులను అడ్డుకున్నందుకు చిన్న అంజిరెడ్డి తలపగులకొట్టారని, కాళ్ళు, చేతులపై కర్రలతో దాడి చేశారని తెలిపారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అంజిరెడ్డికి వైద్యశాలలో చికిత్స జరుగుతుందన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఖచ్చితంగా పోలీసులు కఠినమైన శిక్షలతో కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంతో పాటు నరసరావుపేట నియోజక వర్గంలోనూ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. చిలకలూరిపేటలో మాజీమంత్రి, బిసి మహిళపై సి.ఐ. చేసిన దౌర్జన్యాన్ని మర్చిపోక ముందే నరసరావుపేటలో దాడులు చేయడం దారుణంగా ఉందని, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# మైనార్టీల ఆధ్వర్యంలో మదార్‌కు ఘనసన్మానం


**మాచర్లటౌన్, మే 12 ప్రభాతవార్త:** మాచర్ల మున్సిపాలిటీ ఛైర్మన్ మదార్‌సాహెబ్‌నుగురజాల నియోజక వర్గం ముస్లిం మైనార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పిడుగురాళ్లలోని ఓ కల్యాణ మండపం



లో జరిగిన సన్మాన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ మాజీ అధ్యక్షులు అమీర్‌వలి, పలువురు తెదేపా నాయకులు మదార్‌ను ఘనంగా దుశ్వాలువాలు, పూలదండలతో సత్కరించారు. మైనార్టీ సంక్షేమానికి తెదేపా కట్టుబడి ఉందని, ముస్లింలకు ఉన్నత పదవులు అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉందుంటారని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెదేపా నాయకులు ముటుకూరు సుభాని, షేక్ సైదా తదితరులు ఉన్నారు.

# మాచర్లలో హౌసింగ్ లేఅవుట్స్‌ను పరిశీలించిన పీడీ

**మాచర్ల, మే 12 ప్రభాతవార్త:** మాచర్లలో అర్ధంతరంగా నిలిచిపోయిన హౌసింగ్ లేఅవుట్స్‌ను నూతన పీడీ బీఏ రవీంద్ర సోమవారం పరిశీలించారు. లేఅవుట్స్‌లో బోర్లు



ఎండిపోవడం, కొన్ని బోర్లు మాయమవడం గమనించారు. నీరు లేని కారణంగా లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు ఇల్లులు కట్టుకోవడానికి ముందుకురావడం లేదని పేర్కొన్నారు. ఆప్షన్–3 ద్వారా కాంట్రాక్టర్లకు ట్యాగ్ అయిన గృహాలు కూడా నిర్మించడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టరుకు నివేదించనున్నట్లు పీడీ రవీంద్ర తెలిఆపరు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట హౌసింగ్ డీఈ బాలాజీనాయక్, ఏఈ సాతులూరి మరియదాసు తదితర సిబ్బంది ఉన్నారు.

# ఎన్ఇసిలో ముగిసిన ఆటో క్యాడ్ సాఫ్ట్‌వేర్ శిక్షణా తరగతులు

**నరసరావుపేట టౌన్, మే 12 ప్రభాతవార్త :** నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు ఐసిటి అకాడమీ ఆటో డెస్క్ సహకారంతో సోమవారం క్యాడ్ పై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ముగిసాయి. కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్ మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ ప్యాకేజీని ఆటో మొబైల్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్, ప్రొడక్ట్ డిజైన్, ఏరో స్పేస్ రంగాలలో ఎక్కువగా వాడుతారన్నారు. తమ కళాశాలలో అధ్యాపకులకు సాంకేతిక అంశాలపై, కంప్యూటర్ పరిజ్ఞానం అందించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగమని తెలియజేశారు. తాము తెలుసుకున్న అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా బోధించాలని వైస్ ఛైర్మన్ చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, శిక్షకులు కుమార్, ప్రియదర్శిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

# 30 రకాల విత్తనాలతో అనేక లాభాలు : డీపీఎం అమలకుమారి

**వెల్దుర్తి, మే 12 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలం మండాది గ్రామంలో అనంతవెంకటరెడ్డి రైతు పొలంలో 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ (ప్రీమాసూన్ డ్రైసోయింగ్) ద్వారా సాగు చేసి లబ్ధిపొందారని డీపీఎం అమలకుమారి తెలిపారు. మండు వేసవిలో కూడా పచ్చని పంటలతో కళకళలాడుతుందన్నారు. 365 రోజులు



భూమిని కప్పి ఉంచడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. రైతులు తమ పొలంలో పీఎండీఎస్ విత్తనాలు వేసుకోవడం వల్ల భూమిలో కర్బనశాతం పెరిగి అధిక లాభాలను రైతులు పొందవచ్చాన్నారు. వ్యవసాయశాఖ పరిధిలో ఉన్న రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. అలాగే పీఎండీఎస్ గురించి రైతులకు వివరించి ప్రతి రైతు ప్రయోజనం పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, యన్ఎఫ్ఏ మేరీ, ఎంటీ వినోద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# భావదేవా..పాహిమాం..

## అంగరంగవైభవంగా శ్రీ క్షీర భావన్నారాయణస్వామి రథోత్సవం



- పూజలు నిర్వహించిన మంత్రి అనం నారాయణరెడ్డి,శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ,ఎంపి కృష్ణప్రసాద్,ఎంఎం కొండయ్య, బిజెపి నాయకులు అన్నం సతీష్‌ప్రభాకర్,టిడిపి నాయకులు నరాలశెట్టి ప్రకాశరావు,జిల్లా కలెక్టర్ వెంకటమురళి,
- భక్తి పారవశ్యంతో నిండిన బాపట్ల







**బాపట్ల,మే12,ప్రభాతవార్త :** భావపురి ఇలవేల్పు..భక్తుల కొంగుబంగారం...పిలిస్తే పలికే భావదేవా పాహిమామ్ అంటూ భక్తులు జయజయధ్వనాలతో బాపట్ల పట్టణ ంలోని రథం బజార్ మారుమోగింది.గత నెల 25 వతేది నుంచి ప్రారంభమైన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి 1432నవాహ్నిక బ్రహోత్సవాల్లో సోమవారం స్వామివారికి కన్నుల పండుగగా రథోత్సవాన్ని నిర్వహించారు అదివారం అర్ధరాత్రి వేదపండితుల మంత్రోచ్ఛరణలనడుమ స్వామివారికి,అమ్మవార్లకు వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని గావించారు. మరసటి రోజైన సోమవారం సాయంత్రం సరిగ్గా 5.గం॥లకు స్వామి,అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై నెలకొల్పారు. వేదపండితులు రథోత్సవానికి ముందుగా హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలుచేశారు.

**పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారులు :** ఏడాదికి ఒకసారి జరిగే శ్రీ క్షీరభావన్నారాయణ స్వామివారి రథోత్సవానికి ముందుగా ఆనవాయితీగా పలువురు ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. సరిగ్గా సాయంత్రం 5.గం॥లకు ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో మంత్రి అనం నారాయనరెడ్డి,శాసన సభ్యులు వేగేశన,ఎంఎం కొండయ్య,ఎంపి కృష్ణ ప్రసాద్, మాజి శాసన మండలి సభ్యులు బిజెపి నాయకులు అన్నం సతీష్,మాజి మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాషరావులుపాల్గొన్నారు.కలెక్టర్ వెంకటమురళీ వేదపండితులు ఆర్చక స్వాములువిజయసారధి,వికనసమూర్తి, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆనవాయితీగా శాలువాలను కప్పి వారితో పూజలు చేయించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల ప్రజల దైవమైన భావదేవుని కృపతో నూతన బాపట్ల జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు.. ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుడ్ని ప్రార్థి ంచినట్లు తెలిపారు. ప్రతి ఏడాది స్వామివారి రథోత్సవంలో పాల్గొనటం జరుగుతుందని, ఈ ఏడాది పాడిపంటలు సమృద్ధిగా జరగాలని దేవుడ్ని కోరుకున్నట్లు చెప్పారు. మాజి శాసన మండలి సభ్యులు అన్నం సతీష్‌ప్రభాకర్ మాట్లాడుతూ బాపట్ల ప్రజల ఇలవేల్పు భావదేవుని ఆశీస్సులు అందరికి కలగాలని కోరుకుంటున్నానన్నారు. భావన్నారాయణ స్వామి ప్రజలను చల్లగా చూడాలని వేడుకున్నట్లు ఆయనతెలిపారు.

**భక్తిపారవశ్యంతో నిండిన బాపట్ల :** పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి మంగళహారతులిచ్చిన వేదపండితులు రథోత్సవాన్ని ముందుకు నడపాలంటూ ఆనవాయితీగా గంటను మ్రోగించారు. రథాన్ని లాగి తరలించాలని మదినిండా భక్తిని నింపుకున్న భక్తులు ఒక్కసారి మోకులు లాగేందుకు ముందుకు కదిలారు. ఒక్కసారిగా భావదేవా పాహిమామ్..భావదేవా బహుపరాక్ అంటూ జయజయ ధ్వనాలు చేశారు. భావదేవుని బ్రహోత్సవాన్ని తరిస్తూ భక్తులు వేడుకున్నారు. స్వామివారి రథోత్సవం ఏజీ కళాశాల రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామివారికి గుడి వద్దకు చేరుకుని అక్కడ పూజలు నిర్వహించి తిరిగి రాత్రి 7.30గం॥లకు దేవాలయానికి చేరుకుంది. స్వామివారి రథోత్సవానికి అడుగడుగునా భక్తులు నారికేళాలు సమర్పిస్తూ మమ్ము చల్లగా కాపాడయ్యా భావదేవా అంటూ వేడుకున్నారు.

**పటిష్ట పోలీస్ బందోబస్తు :** భావదేవుని రథోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. డిఎస్పీ రామాంజనేయులు అద్వర్యంలో పట్టణ సిఐ రాంబాబు,నేతృత్వంలో 4గురు ఎస్‌ఐలు, 40మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. రథోత్సవం జరిగేంతవరకు 214(ఎ) జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భావదేవుని రథోత్సవం ప్రారంభంనుంచి చివరి వరకు పోలీసు సిబ్బంది స్వయంగా మోకు లాగే భక్తులకు చూచనలు ఇస్తూ ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. ప్రత్యేకించి రథోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టి విజయవంతమైయ్యారు. స్వామివారి రథోత్సవం సందర్భంగా భక్తులకు స్వచ్ఛందంగా పలువురు,మజ్జిగ, పులిహోర,రస్నాలను అందించారు.

## ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసిన ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ శ్రీనివాసరావు



**చిలకలూరిపేట,మే12,ప్రభాతవార్త:** చిలకలూరి పేట 100పడకల ఆసుపత్రికి నూతనంగా సూపరింటెండెంట్‌గా నియమితు లైన డాక్టర్ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటిని టిడిపి క్యాంపు కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఆసుపత్రి యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ డాక్టర్స్, స్టాఫ్, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి, వచ్చే పేషెంట్లు, ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉంటూ అవసరమైన వైద్య సేవలు త్వరితగతిన అందించాలని సూచించారు. అలాగే ఆసుపత్రికి అవసరమైన స్టాఫ్ మరియు వైద్య పరికరాల గురించి పై అధికారులతో మాట్లాడి త్వరగా తెప్పించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పురుషోత్తమపట్నానికి చెందిన రక్షక ప్రసాద్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట,మే12,ప్రభాతవార్త:** పురుషోత్తమ పట్నానికి చెందిన ఆర్ రక్షక ప్రసాద్ సోమవారం కోటప్పకొండ గిరి ప్రదక్షిణ చేస్తూ గుండెపోటు రావడంతో అక్కడ పడిపోయాడు. అతనితోపాటు గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు సిపిఆర్ చేసినప్పటికి ప్రసాద్‌ను కాపాడలేకపోయారు. అనంతరం అతని భౌతికకాయాన్ని పురుషోత్తమపట్నంలోని తన నివాసానికి తీసుకొని వచ్చారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు వారి నివాసానికి వెళ్లి రక్షక ప్రసాద్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజారమేష్, టిడిపి నాయకులు తోట బ్రహ్మస్వాములు, ఇనగంటి జగదీష్, పఠాన్ సమద్‌ఖాన్, గట్టినేని రమేష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



**నరసరావుపేట, మే 12 ప్రభాతవార్త :** రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని పమిడిపాడు గ్రామంలో రైతు సదస్సును బాపట్ల వ్యవసాయ విద్యార్థినులు, రైతులతో అధికారులు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాటికి అనుగుణంగా సేంద్రియ ఎరువులను, రసాయనిక ఎరువులను ఎంత మేరకు వాడుకోవాలో తెలుసుకోవచ్చన్నారు. పంట మార్పిడి పద్ధతులు అవలంభించాలన్నారు. వ్యవసాయంతో పాటు పశువులు, కోళ్లు, గొర్రెలు వంటి పెంపకాలను చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతను తెలియజేశారు. మొక్కజొన్న సాగులో మెళకువలను వివరించారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ శ్రీనివాసరావు, ఏవో సురేంద్ర, ఏఈవో బ్రహ్మయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా పేరంటాలమ్మ తిరుణాళ్ళ

**కొల్లిపర,మే 12 ప్రభాతవార్త:** భక్తులు కోరిన కోర్కెలు తీర్చే పేరంటాలమ్మ అమ్మవారి కళ్యాణం,తిరుణాళ్ళ మహోత్సవం మండల పరిధిలోని దావులూరు గ్రామంలో సోమవారం కన్నుల పండువగా జరిగింది.గ్రామస్తులతో పాటు మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయి పొంగళ్ళు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి పసుపు,కుంకుమ,గాజులు,పూలు అమ్మవారికి సమర్పించారు.ఆలయ ఆవరణలో బాపమ్మ,గోపయ్య స్వామి వార్లకు వివాహ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేసారు.అనంతరం ఆలయంలో స్వామివార్లకు అర్చకులు రోకళ్ళును పంచామృతాలతో ముంచి ధాతువృద్ధి కోసం పూజలు చేసారు.రాత్రి సమయంలో ఆలయం ఎదుట శిడిమానోత్సవం కార్యక్రమం నిర్వహించారు .శిడిమానోత్సవం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యి ఉట్టికొట్టేందుకు పోటీపడ్డారు.గ్రామస్తులు వాహనాలు ఆలయం చుట్టూ తిప్పారు.ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది.తిరుణాళ్ళు ను పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు చిన్నారులకు ఆటవస్తువులు,పెద్దలకు తినుబండారాలు ఆలయం వద్ద అందుబాటులో ఉంచటంతో అమ్మకాలు బాగా జరిగాయి.కమిటీ సభ్యులు ఆలయంకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయటంతో దగదగ మెరిసింది. పేరంటాలమ్మ తిరుణాళ్ళను పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందొబస్తు ఏర్పాటు చేసారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించిన ఎమ్మెల్యే కన్నా



**సత్తెనపల్లి, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని రెంటపాళ్ళ గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మయ్య ప్రమాదవశాత్తు ఇటీవల మృతిచెందారు. అలాగే నకరికల్లు మండలం నకరికల్లు గ్రామానికి చెందిన సూర్తని ఏడుకొండలు కుటుంబానికి రూ.5 లక్షల విలువైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతులకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండడంతో టిడిపి ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును మృతుల కుటుంబాలకు అందజేయడం జరిగిందన్నారు. తెలుగుదేశంపార్టీ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం పని చేస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశంపార్టీ అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో లబ్దిదారులు పాల్గొన్నారు.

## మత పెద్దలతో పోలీసు అధికారుల సమావేశం



**నరసరావుపేట టౌన్, మే 12 ప్రభాతవార్త :** పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో వన్‌టౌన్ సి.ఐ. ఎం.వి.చరణ్ అధ్యక్షతన మావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.ఐ.లు అరుణారెడ్డి, వంశీకృష్ణలు పాల్గొని మాట్లాడారు. మత పెద్దలు ప్రార్ధనా స్థలాలలో చేసుకోవాల్సిన ఏర్పాట్ల గురించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద సి.సి.కెమేరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ చర్య ద్వారా భద్రతను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ప్రార్ధనలకు వచ్చే వారికి ఆస్థి, ప్రాణరక్షణ కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మత పెద్దలు పోలీస్ అధికారుల సూచనల పట్ల సానుకూలంగా స్పందించి తమ ఆమోదం తెలియజేశారు.

## శిథిలావస్థకు చేరిన ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్

**పెదకూరపాడు, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని ముస్సాపురం గ్రామ పంచాయితీలో నిర్వహించబడుతూ ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్ గత కొంతకాలంగా మూతబడింది. ఎట్టకేలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశంతో ఆర్.ఓ.వాటర్



ప్లాంట్‌లలో అనుభవం ఉన్న మండల టిడిపి నాయకులు గల్లా బాబురావు ద్వారా కొత్త మోటార్, ఫిల్టర్స్,మెమొరీని తెప్పించి బిగించారు. మండల పార్టీ అధ్యక్షులు ఆర్తిమళ్ళ రమేష్ చేతుల మీదుగా ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభింంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు ఆరోగ్యకరమైన మంచినీటిని అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రత్యేకంగా ప్లాంట్‌కు అవసరమైన సామాగ్రిని తెప్పించి ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఆర్.ఓ.మినరల్ వాటర్ ప్లాంట్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ ప్లాంట్ గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆర్తిమళ్ళ రమేష్ అన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామ టిడిపి నాయకులు దాసరి రాంబాబు, గ్రామ తెలుగుదేశంపార్టీ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## జవాన్ మురళీ నాయక్ పోరాటం యావత్ భారతావనికి స్ఫూర్తిదాయకం : నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



**గుంటూరు కార్పొరేషన్,మే12,ప్రభాతవార్త:** జవాన్ మురళీ నాయక్ పోరాటం యావత్ భారతావనికి స్ఫూర్తిదాయకమని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జమ్మూ కాశ్మీర్ సరిహద్దులో యల్.ఓ.సి (లైన్ ఆఫ్ కంట్రోల్) వద్ద పాకిస్తాన్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయి అమరుడైన ఆర్మీ జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి మేయర్ కోవెలమూడి రవీంద్ర,ఎమ్మెల్సీ చంద్రగిరిఏసురత్నం,నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు నివాళులు అర్పించారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ దేశం కోసం గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించిన జవాన్ మురళీ నాయక్ పోరాటం స్ఫూర్తిదాయకమని చెప్పారు. నీ వీరమరణంతో ధరిత్రి కన్నీటిలో తడుస్తోందని, నీ సాహసం,నీలాంటి వీరుడి త్యాగం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఉగ్రవాద పెనుభూతాన్ని పెంచి పోషిస్తోన్న దాయాది పాకిస్తాన్ చర్యలను దుయ్యబట్టారు. వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 75 తాళ్ళూరులో శ్రీ అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

**పెదకూరపాడు, మే 12 ప్రభాతవార్త :** మండలంలోని 75 తాళ్ళూరులో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీ అంకమ్మతల్లి వార్షికోత్సవం



సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయం అమ్మవారికి జలబిందెలతో అభిషేకించి పూజలు చేవారు. సామూహిక పొంగళి చేసి మహానివేదన చేశారు. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరునాళ్ళ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల విశేష అలంకర ణలు, పూజలను నిర్వహిం చారు. అలాగే అమ్మవారి ప్రభను గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించి రాత్రికి అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



## భక్తి శ్రద్ధలతో చండీహోమం

**గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి,నవగ్రహాలకు విశేషాభిషేకాలు,అర్చనలు, రుద్ర,లక్ష్మీగణపతి,చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య,ఉపాధ్యక్షులు లంకా విజయబాబు,సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రముఖ కవి బుర్రి కుమార్‌రాజుకు సాహితీరత్న జాతీయ ప్రతిభా పురస్కారం

**గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా శ్రీశ్రీ కళా వేదిక



ఉపాధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం కార్యదర్శి,కవి బుర్రి కుమార్ రాజు కు శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు,ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు,నిరంతర సాహితీ కార్యక్రమాలతో 32ప్రపంచ రికార్డులు సాధించిన సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్,జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి,జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం,జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.పార్థసారధి లు ముఖ్యఅతిధి బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు,విశిష్ట అతిధిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర మహిళా సభ్యురాలు నర్సిపల్లి హారిక తదితరులు కవి బుర్రి కుమార్‌రాజు సాహిత్య ప్రతిభను గుర్తించి సాహితీ రత్న పురస్కారం, జ్ఞాపిక,ప్రశంసాపత్రం బహుకరించి గౌరవించిందని ఈ సందర్భంగా కవి మిత్రులు ఎస్.ఎం. సుభాని,నానా,బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి,జానీ భాషా,జమదగ్ని తదితరులు అభినందనలు తెలిపారు.ఇంత గొప్ప సాహితీ పురస్కారం లభించడం ఆనందం కలిగించిందని తెలిపారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మాతృదినోత్సవ వవేడుకలు



**మాచర్లటౌన్, మే 12 ప్రభాతవార్త:** పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల పట్టణ ఎస్సై సంధ్యారాణి, రోటరీ క్లబ్ మెంబర్ శివపార్వతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్స్ రామకృష్ణ, శ్రీధర్‌గుప్తా, సదాశివరాజు, హరీష్‌చంద్ర,ప్రిన్సిపల్ హనుమంతరావులు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ కష్టాలను, నష్టాలను, బాధలను, తప్పులను అన్నింటినీ మనసులో పెట్టుకుని కేవలం ప్రేమను మనపై చూపించే దైవం అమ్మ అని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లులకు ఆటపాటలు వివిధ రకాల పోటీలు నిర్వహించి చిన్నారులచే తల్లులకు పాదసేవ చేయించారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన స్కూల్ యాజమాన్యానికి, మెగా డాన్స్ అకాడమీ వారికి విద్యార్థుల తల్లులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా అన్నమయ్య జయంతి వేడుకలు



**గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమాచార్య విగ్రహం వద్ద గాయత్రీ మహిళా సంగీత సన్మండలి,ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మూలవిరాట్‌కు వేదపండితులు సతీష్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు,అర చ్చనలు అలంకరణ జరిగాయి.కార్యక్రమంలో గాయత్రీ సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి,డాక్టర్ మైలవరపు లలితకుమారి,ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు,పుట్టగుంట ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృదినోత్సవం

**గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త :** ఆకాశమంత అనురాగం,అంతరిక్షమంత సహనం,ఎవరెస్టు అంత వ్యక్తిత్వం,మహోన్నతప్రేమ శిఖరం అమ్మ అని ఆమాతృమూర్తి త్యాగానికి,ప్రేమకి ప్రత్యామ్నాయం లేదని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృదినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మహిళారంగ ప్రముఖులు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో రచయిత్రి ఎ.వి.కే.సుజాత మాట్లాడుతూ తల్లి నిస్వార్ధ ప్రేమకు ప్రతీక అని పిల్లలే తన ఆనందంగా భావిస్తూ మానవత్వానికి ప్రతిరూపంగా అమ్మ నిలుస్తుందన్నారు.ఫ్రీలాన్స్ జర్నలిస్టు పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి తల్లి ఆరోగ్యం పట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో రచయిత్రి ఖాశింబీ,విజయలక్ష్మీ,గాయని లక్ష్మీ,విశ్రాంత ప్రిన్సిపాల్ వరకమలాదేవి ప్రసంగించారు.

## నేడే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం



**పెదనందిపాడు మే 12 (ప్రభాతవార్త)** గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడు లో మంగళవారం ఉదయం 9 గంటల నుండి స్వయంభు శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం మహోత్సవాన్నిఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ని పెళ్ళికొడుకు ను చేసి నెమలి వాహనంపై. పెదనందిపాడు నాగులపాడు పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారి కళ్యాణం అనంతరం అన్నదానం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వహణ కమిటీ తెలియజేసింది.

## రాబోయే రోజులు వైకాపావే : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



**నరసరావుపేట టౌన్, మే 12 ప్రభాతవార్త :** రాబోయే రోజులు వైకాపావేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో ఆదివారం నిర్వహించిన తిరునాళ్ళ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వైకాపా కార్యకర్తలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామంలో తెలుగుదేశంపార్టీకి చెందిన నాయకులు ఉద్దేశపూర్వకంగా గొడవలు పెట్టుకోవడం తగదన్నారు. ప్రభ వద్ద అల్లర్లు చేయడం ఎటువంటి సంస్కృతి అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల మహోత్సవాలు జరిగేవని గుర్తు చేశారు. తమ పార్టీ కార్యకర్తలకు ఏ చెడు జరిగినా అందుకు తగిన ప్రతి చర్య ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. తన మాటలు వినిపించకుండా డిజేలు సౌండ్ పెంచి అల్లరి మూకలు ఉద్దేశపూర్వకంగా ఘర్షణకు ఉసిగొల్పుతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు ఉన్నారు.

## ఆకట్టుకున్న భక్తిరంజని

**గుంటూరు కల్చరల్,మే 12,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో శ్రీవేంకటేశ్వరసా ్వమి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక పై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా సోమవారం జరిగిన భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది.తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.గాయని గాయకులు కెవి సాయిబాబా శర్మ,నాగమల్లేశ్వరరావు,కృష్ణకుమారి లు తమ గాత్రధారణలో అన్నమాచార్య విరచిత పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలాపించారు.

13-5Pg5exJ.qxd:13-5Pg5exJ.qxd 01/01/01 8:47 AM Page 1



# మా దాడులు ఉగ్రవాదం పైనే..

## పాక్ ఆర్మీ వైఖరివల్లే ఉద్రిక్తతలు ఉధృతం
## దాయాది దాడులను సమర్థంగా తిప్పికొట్టాం: ఎయిర్ మార్షల్ ఎకె భార్తి



**న్యూఢిల్లీ, మే 12:** పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఫైట్ చేశామని, కానీ పాకిస్థాన్ మిలిటరీ ఆ ఉగ్రవాదులకు సపోర్టు ఇచ్చిందని, దీంతో ఉద్రిక్తతలు ఉధృతమైనట్లు ఎయిర్ మార్షల్ ఏకే భార్తి తెలిపారు. ఆపరేషన్ సింధూర్ గురించి ఇవాళ త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. మూడు దళాలకు చెందిన డీజీ ఎంవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉగ్రవాదులను టార్గెట్ చేసిన సమయంలో పాకిస్థాన్ మిలిటరీ జోక్యం చేసుకున్నదని, ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యవహరించిందని, అందుకే తాము రెస్పాండ్ అయినట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్‌లో జరిగిన నష్టాలకు ఆ దేశ ఆర్మీదే బాధ్యత అని ఆయన అన్నారు. తాము కేవలం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా మాత్రమే పోరాడినట్లు చెప్పారు. భారతీయ వైమానిక రక్షణ వ్యవస్థ పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. ఆకాశ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతంగా పనిచేసినట్లు భార్తి తెలిపారు. గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్ల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ బలంగా తయారైందన్నారు. భారీ సంఖ్యలో డ్రోన్లు, ఏరియల్ వెహికిల్స్‌తో పాకిస్థాన్ దాడి చేసిందని, స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యూఏఎస్ సిస్టమ్స్, శిక్షణ పొందిన ఇండియన్ ఎయిర్ డిఫెన్స్ సిబ్బంది తిప్పికొట్టినట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఇండియా టార్గెట్ చేసిన కేంద్రాల ఫోటోలను ఎయిర్ మార్షల్ ఏకే భార్తి ప్రదర్శించారు. మన మిలిటరీ బేస్‌లు, మన వ్యవస్థలన్నీ పూర్తిగా ఆపరేషన్‌లో ఉన్నాయని, భవిష్యత్తులో ఎటువంటి మిషన్ అయినా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని భార్తి తెలిపారు. మీడియా సమావేశంలో చైనాకు చెందిన పీఎల్15 ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్ శకలాలను చూపించారు. ఇండియాపై అటాక్ చేసిన సమయంలో పాకిస్థాన్ ఆ మిస్సైల్‌ను వాడినట్లు తెలుస్తోంది. టర్కీకి చెందిన వైఐహెచ్, సోన్‌గార్ డ్రోన్ల శకలాలను కూడా ఇండియా ప్రదర్శించింది.

**ఆపరేషన్ సింధూర్ సూపర్ సక్సెస్**

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని రక్షణ శాఖ అధికారుల వెల్లడించారు. ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. పాక్ భూభాగంలో నష్టానికి బాధ్యత వారి ఆర్మీదేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను రక్షణశాఖ అధికారులు ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు, మానవరహిత వైమానిక వాహనాలు, క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకున్నట్లు ఎయిర్ మార్షల్ ఏకే భార్తి వెల్లడించారు. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశామని తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థలో స్వదేశీ తయారీ ఆకాశ్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. చైనా తయారీ పిఎల్15 వంటి క్షిపణులను పాకిస్తాన్ ప్రయోగిస్తే వాటిని కూల్చివేసినట్లు తెలిపారు. పౌర నివాసాలకు దూరంగానే దాడులు చేశామని, భారత్ దాడులపై పాకిస్థాన్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

**ఏదో లేయర్ వాటిని అడ్డుకుంటుంది: లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్:** గత కొన్నేళ్లుగా ఉగ్రవాద కార్యకలాపాల తీరు మారినట్లు DGMO లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ తెలిపారు. అమాయక పౌరులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారని చెప్పారు. భారత్ ఎయిర్‌ఫీల్డ్‌లను, లాజిస్టిక్స్‌ను లక్ష్యంగా చేసుకోవడం చాలా కష్టమని అన్నారు. గ్రిడ్ సిస్టమ్‌లో అన్ని లేయర్లు దాటగలిగినా ఏదో లేయర్ వాటిని అడ్డుకుంటుందని వెల్లడించారు. పాకిస్థాన్ జరిపిన గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామని చెప్పారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు తెలిపారు.

**19 రోజుల తర్వాత ప్రశాంతం**

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణరేఖ వెంబడి ప్రశాంత వాతావరణం నెలకొంది. గతరాత్రి ఇక్కడ ఎలాంటి కాల్పుల మోత మోగలేదని, షెల్లింగ్ జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. పహల్గాం దాడి తర్వాత నుంచి ఎల్ఒసి వద్ద అలజడి నెలకొనగా 19 రోజుల తర్వాత నిన్న రాత్రి ప్రశాంతంగా గడిచిందని తెలిపింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత సైనిక ఘర్షణను ఆపేందుకు భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని గంటలకే పాక్ దాన్ని ఉల్లంఘించి కాల్పులకు పాల్పడింది. దీనిపై భారత్ తీవ్రఆగ్రహం వ్యక్తంచేయడంతో దాయాది దేశం వెనక్కి తగ్గింది. దీంతో జమ్మూకశ్మీర్‌లో నిన్న రాత్రి ఎలాంటి కాల్పులు జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. ఘర్షణలు తీవ్రస్థాయికి చేరడంతో భద్రతా దళాలు సరిహద్దు ప్రాంతాల నుంచి పౌరులను ఖాళీ చేయించారు. దీంతో గత కొద్ది రోజులుగా వారు సురక్షిత ప్రాంతాల్లోనే తలదాచుకుం టున్నారు. అయితే ఇప్పుడే స్వస్థలాలకు వెళ్లవద్దని సరిహద్దు గ్రామప్రజలను జమ్మూకశ్మీర్ యంత్రాంగం హెచ్చరించింది. పేలని షెల్స్ ఇంకా ఉంటాయని, వాటిని గుర్తించాల్సి ఉందని పేర్కొంది. ఇక, పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచు కుంటున్న ఇతర రాష్ట్రాల్లోను నిన్న రాత్రి పరిస్థితులు సాధారణస్థితికి వచ్చాయి. డ్రోన్లు, కాల్పు లు, బాంబుదాడులు జరగలేదు. అయినప్పటికీ భద్రతా బలగాలు పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉన్నాయి.



## పాక్ మిరేజ్‌ను కూల్చివేసిన భారత్

**న్యూఢిల్లీ, మే 12:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియోను భారత ఆర్మీ తాజాగా విడుదల చేసింది. పాకిస్థాన్‌కు చెందిన మిరాజ్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఈ వీడియో ద్వారా భారత్ స్పష్టం చేసింది. 'గగనతలంలో శత్రువును ధ్వంసం చెయ్' అన్న క్యాప్షన్‌తో వీడియోను పంచుకుంది. ఈ వీడియోలో పాక్ మిరాజ్ శిథిలాలను కూడా చూపింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ గురించి ఇవాళ త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. మూడు దళాలకు చెందిన డీజీ ఎంవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## భారత్ దాడులకు బంకర్‌లో దాక్కున్న పాక్ ఆర్మీచీఫ్



**ఇస్లామాబాద్, మే 12:** ఆపరేషన్ సింధూర్ దెబ్బకు పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టినట్లుగా భారత ఆర్మీ విడుదలచేసిన విడియోలను బట్టి అర్థం అవుతోంది. భారత్ చేసిన దాడులకు సంబంధించిన చిత్రాలను, విడియోలను భారత్ డిజిఎంఒ విడుదలచేసారు. విడియోల్లో పాకిస్థాన్‌కు భారీ నష్టం జరిగినట్లు కనిపించింది. ఇదిలా ఉండగా భారత్ జరిపిన దాడుల్లో నూర్ ఖాన్ వైమానికస్థావరం తీవ్రంగా నష్టపోయి నట్లు చైనా విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఆ సమయంలో పాకిస్థాన్ ఆర్మీ ఆసిమ్ మునీర్ బంకర్‌లో దాక్కునట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారు ఝామున భారత క్షిపణులు నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై విరుచుకుపడి ఊహించనిరీతిలో దెబ్బ తీసాయి. దీనితో ఆసిమ్‌మునీర్ బెంబేలెత్తి పోయాడు వెంటనే రావల్పిండిలోని జనరల్ హెడ్‌క్వార్టర్స్‌లోని స్ట్రాంగ్ బంకర్‌లోకి తీసుకెళ్లిపోయినట్లు సమాచారం. నూర్‌ఖాన్ అత్యంత సున్నితమైన సైనిక ప్రాంతం. ఇక్కడ చాలా ప్రధానమైన స్క్వాడ్రాన్‌లు ఉంటాయి. సైనిక సరకు రవాణా సదుపాయాలు ఉంటాయి. సీ-130 ట్రాన్స్‌పోర్టర్‌ల వంటి కీలకమైన ఆస్తులను కలిగి ఉంటుంది. అంతేకాకుండా సాబ్-2000 సైనిక ఉపకరణాల రవాణా విమానాలు కూడా నిలిపి ఉంచుతారు. ఇక గాల్లోనే విమానాలకు ఇంధనాన్ని నింపే ఐఎల్-78 వంటి రీఫ్యూయలర్ విమానాలతోపాటు వివిఐపిలకు సంబంధించిన చిన్న విమానాలకు ఇదే కీలక స్థావరం. అలాగే భవిష్యత్ వైమానిక దళ నాయకులకు శిక్షణాస్థలం కూడా ఇక్కడే ఉంది. ఈ ప్రాంతం పాకిస్థాన్ వ్యూహాత్మకప్రణాళికలకు కీలకమైన ప్రాంతం. ఇక్కడినుంచే అణ్వాయుధ సామగ్రిని పర్యవేక్షిస్తుందిభద్రపరుస్తుంది. ప్రస్తుతం పాక్‌లో 170 లేదా అంతకంటే ఎక్కువ వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా. ఈ వార్‌హెడ్‌లు పాక్ వ్యాప్తంగా వివిధప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం. కేవలం 3 గంటల్లోనే నూర్‌ఖాన్, రఫీఖీ, మరిద్, సుక్కూర్, సియాల్‌కోట్, పస్రూర్, చునియన్, సర్గోధ, స్కారు, భోలారి జాకోబాద్‌ల తోసహా 11స్థావరాలపై భారత్ దాడిచేసినట్లు మే 11న జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో డిజిఎంఒ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌ఘాయ్ అన్నారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.

## ఉగ్రవాదిని మౌలానాగా చూపించే యత్నం
### అడ్డంగా బుక్ అయిన పాక్


**న్యూఢిల్లీ, మే 12:** సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషించే క్రమంలో పాకిస్థాన్ తప్పుల మీద తప్పులు చేస్తోంది. తాజాగా ఆ దేశం మరో తప్పు చేస్తూ అడ్డంగా దొరికిపోయింది. అగ్రరాజ్యం అమెరికా ప్రకటించిన ఉగ్రవాది హాఫీజ్ అబ్దుర్ రవుఫ్‌ను మోలానాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పాక్ చేసింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవా దులకు పాకిస్థాన్‌లో ఇటీవల అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుర్ రవుఫ్ మోలానాగా వ్యవహరించారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అంతేకాదు ఈ ఆపరేషన్‌లో మర ణించిన ఉగ్రవాదుల శవ పేటికలకు పాకిస్థాన్ జాతీయ జెండాలను చుట్టారు. అదే సమయంలో హాఫీజ్ రవుఫ్ పక్కనే ఆర్మీ అధికారులు సైతం ఉన్నారు. అయితే మీడియా ముందుకు వచ్చే సమయంలో హాఫీజ్ టోపి ధరించాడు. ఆర్మీ అధికారులు సూచన మేరకే అతడు టోపీ ధరించాడనే చర్చ అయితే జరుగుతోంది. హాఫీజ్ రవుఫ్ చిత్రాలు బహిర్గతం కావడంతో భారత్ అధికారులు న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పందించారు. ఈ ఫోటోను వివరిస్తూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తుందనడానికి ఇది తిరుగులేని రుజువు అని వారు కుండబద్దలు కొట్టారు. మరోవైపు హాపీజ్ రవుఫ్ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉగ్ర వాద సంస్థలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై సర్వత్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అంతేకాదు జైషే మహమ్మద్ మసూద్ అజార్ సోదరుడే ఈ హాఫీజ్ రవుఫ్.

## మూడు రోజులు అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత వాతావరణ శాఖ ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రానున్న మూడు రోజుల పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిస్తే, మరోవైపు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఐఎండీ అంచనా ప్రకారం మే 12 నుంచి 15 వరకు ఉరుములు మెరుపులతో పాటు బలమైన గాలులు వీస్తాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో ఉపశమనం కలిగించేలా ఉంటే, మరికొన్ని చోట్ల ఆందోళనకరంగా ఉంటాయని ఐఎండీ పేర్కొంది. దేశరాజధాని దిల్లీలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉంటుందని సూచించింది. తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది. విభిన్న వాతావరణ మార్పులు కారణంగా మే 11,12 తేదీల్లో జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో 40-60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అంచనా వేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలున్నాయని, ఈ రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో వర్షపాతం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. బెంగాల్, బిహార్, ఝార్ఖండ్ తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వేడి గాలులు వీస్తాయని పేర్కొంది. ఇక ఉత్తరప్రదేశ్‌లోని 20 జిల్లాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది ఐఎండీ. ఆదివారం ఆగ్రాలో గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో హోర్డింగ్స్, చెట్లు కూలిపోవడం వంటివి జరిగాయి.


## టిబెట్, పాక్‌లో భూకంపం: తీవ్రత 5.7గా నమోదు

**టిబెట్, మే 12:** టిబెట్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలు పై భూకంప తీవ్రత 5.7గా నమోదు అయింది. సోమవారం తెల్లవారుజాము 2.41 గంటలకు ఈ భూకంపం సంభవించింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం లేదని అక్కడి అధికారులు వెల్లడించారు. అర్థరాత్రి 2.41 గంటల సమయంలో భూకంపం వచ్చినట్లు జాతీయ భూకంప పరిశోధనా కేంద్రం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రకంపనలు వచ్చినట్లు పేర్కొంది. మూడు రోజుల కిందట కూడా టిబెట్‌లో భూకంపం వచ్చింది. అయితే, అది రిక్టర్ స్కేల్‌పై 3.7గా నమోదైంది. ఎన్‌సీఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. భూకంపం 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని, దీనివల్ల భూకంపం తర్వాత ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. కాగా మే 8న భూకంపం వచ్చిందని, అది 3.7 తీవ్రతతో ఈ ప్రాంతాన్ని కుదిపేసిందని పేర్కొంది.



ఇలాంటి భూకంపాలు భూమి ఉపరితలానికి దగ్గరగా ఎక్కువ శక్తిని విడుదల చేయడం వల్ల లోతైన భూకంపాల కంటే ప్రమాదకరమైనవని, ఇది బలమైన భూప్రకంపనలకు భవన నిర్మాణాలు కూలిపోయి ప్రాణ నష్టాన్ని కలిగిస్తుందని ఎన్‌సీఎస్ తెలిపింది. పాక్‌ను వణికించిన భూకంపం భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో అల్లాడిపోయిన పొరుగు దేశం పాకిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. శనివారం ఉదయం పాక్‌లో భూ ప్రకంపనలు నమోదైన విషయం తెలిసిందే. మూడు రోజుల వ్యవధిలోనే తాజాగా మరోసారి అక్కడ భూమి కంపించింది. సోమవారం మధ్యాహ్నం 1:26 గంటల సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. అంతకుముందు శనివారం తెల్లవారుజామున 01.44 గంటలకు పాకిస్థాన్‌లో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 4.0గా నమోదైంది. ఇటీవల పాక్‌లో వరుస భూకంపాలు సంభవిస్తున్నాయి. పాక్ యురేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్లు కలిసే ప్రదేశంలో ఉంది. దాంతో తరచుగా అక్కడ భూకంపాలు వస్తుంటాయి. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తున్ఖ్వా, గిల్గిట్‌బాల్టిస్థాన్ తదితర ప్రాంతాలు యురేషియన్ ప్లేట్ దక్షిణ అంచున ఉండడం వల్ల భూకంపాల బారినపడుతున్నాయి.

## రహస్యాలకు యత్నిస్తున్న పాక్ గూఢచారులు



### వెల్లడించిన భారత నిఘా వర్గాలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ఇరుదేశాలు ప్రయ త్నాలు చేస్తున్న క్రమంలో పాక్ గూఢచారులు మాత్రం భారత రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు తాము భారత్ రక్షణ శాఖ అధికారులుగా పేర్కొంటూ జర్న లిస్ట్‌లకు ఫోన్‌చేసి 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించి సైనిక అధికారులు చేసే బ్రీఫింగ్, పాక్ విషయంలో చేసే ప్రణాళికలు మొదలైన సమాచారాన్ని సేకరిస్తున్నారని భారత నిఘా వర్గాలు పేర్కొన్నారు. పాక్ దాడిలో భారత్‌లోని ఏయే ప్రాంతాల్లో ఎంత నష్టం జరిగిందనే విషయాలపై కూడా వారు ఆరా తీస్తున్నట్లు వెల్లడించాయి. ఇతర జర్నలిస్టులు, పలువురు పౌరులకు కూడా గూఢచారుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు సమాచారం. ఈ కాల్స్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నుంచి వస్తున్నట్లు చూపిస్తున్నా యని, కానీ భరాత అధకారులెవరూ అటువంటి కాల్స్ చేయరని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అటువంటి కాల్స్ వస్తే ఆన్సర్ చేయవద్దని తమకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది.

ఇందులో భాగంగా నేడు ఇరుదేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్‌ల మధ్య హాట్‌లైన్‌లో చర్చలు జరగను న్నాయి. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోబాల్, త్రివిధ దళాధిపతులు, పలువురు ఉన్నతస్థాయి సైనికాధికారులతో సమావేశమయ్యారు.

## మా యుద్ధవిమానం ధ్వంసమైంది
### దాయాది దేశం అంగీకారం

**ఇస్లామాబాద్, మే 12:** ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించామని, ఆ దేశ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చామని భారత సైన్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా పాకిస్థాన్ ఆర్మీ స్పందించింది. తమ ఫైటర్ జెట్ ఒకటి ధ్వంసమైన మాట వాస్తవమేనని అంగీకరించింది. అయితే, అది స్వల్పమేనని పేర్కొనడం గమనార్హం. పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మాద్ షరీఫ్‌చౌధరీ.. తమ దేశ ఎయిర్‌ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ 'భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది' అని వెల్లడించారు.



### భారత్-పాక్ ప్రత్యక్ష చర్చలకు
## మా మద్దతు : యుఎస్

**వాషింగ్టన్, మే 12:** భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని ప్రకటించిన అమెరికా తాజాగా ఇరుదేశాల మధ్య ప్రత్యక్ష చర్చలకు తాము మద్దతిస్తామని ప్రకటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్-పాక్ అంశంపై యుకె విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో మాట్లాడారు. కాల్పుల విరమణ కొనసాగించడం, రెండు దేశాల మధ్య కమ్యూనికేషన్ మార్గాలను తెరిచి ఉంచడం ఎంతో ముఖ్యమని ఈ భేటీలో ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ తెలిపారు. కాల్పుల విరమణ తర్వాత ఇరు దేశాలు ప్రత్యక్షంగా చర్చలు జరపడానికి అమెరికా సాయం చేస్తుందని మార్కో రూబియో ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి కొనసాగుతున్న ప్రయత్నాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా విదేశాంగ శాఖ స్వాగతించింది. భారత్, పాక్ సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. భారత ప్రధాని నరేంద్రమోడీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతిమార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్, పాక్ ప్రత్యక్ష చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలు కోరుకుంటున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల భారత విదేశాంగ మంత్రి జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. అవసరమైతే భారత్, పాకిస్థాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తానని ఆయన ప్రతిపాదించారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మార్కో రూబియో స్పష్టం చేశారు.

## 17మంది నవజాత శిశువులకు సిందూర్ పేరు




**లక్నో, మే 12:** దేశవ్యాప్తంగా ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ పేరు మారుమోగుతోంది. పహల్గాం ఉగ్రదాడితో రగిలిపోతున్న భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్ర శిబిరాలపై దాడి చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. పాక్ వెన్నులో వణుకుపుట్టిస్తూ ఇండియన్ ఆర్మీ చేపట్టిన ప్రతీకార చర్చపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. కొందరైతే తమ నవజాత శిశువులకు సింధూర్ అనే పేర్లు పెడుతూ సైనిక జవాన్ల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్ జిల్లాలో అసాధారణ రీతిలో ఈ సెంటిమెంట్ కనిపిస్తోంది. కేవలం రెండు రోజుల్లో 17 మంది ఆడ శిశువులకు వారి కుటుంబ సభ్యులు సిందూర్ అంటూ నామకరణం చేశారు. ఆపరేషన్ సిందూర్ తమ జీవితాల్లో ఎంతటి ప్రాముఖ్యత సంతరించుకుందో చాటుకున్నారు. సిందూర్ అనేది ఇప్పుడు కేవలం ఒక పేరు కాదని, ఒక భావోద్వేగానికి, దేశం పట్ల గౌరవానికి ప్రతీక అని కుషీనగర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే షాహి తెలిపారు. బెడిహరి గ్రామానికి చెందిన అర్చనా షాహి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చారు. పాపకు సిందూర్ పేరు పెట్టాలని ముందే నిర్ణయించుకున్నట్టు చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిలో పలువురు మహిళలు తమ భర్తలను పోగొట్టుకుని పసుపుకుంకుమలను కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ అందర్నీ గర్వంగా తలెత్తుకునేలా చేసిందని చెప్పారు. ఆ కారణంగానే తమ ఆడబిడ్డకు సిందూర్ పేరు పెట్టుకున్నామని చెప్పారు. కాగా, సిందూర్ పేరు తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె భర్త అజిత్ షాహి తెలిపారు. పడ్రౌనా ఏరియాలోని మదన్ గుప్తా కుటుంబ సభ్యులు కూడా ఇదే సెంటిమెంట్ వ్యక్తం చేశారు. గుప్తా కోడలు కాజల్ గుప్తా కొత్తగా పుట్టిన తన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టారు. ఈ పేరుతో ఆపరేషన్ సిందూర్ ఎప్పటికి తమకు గుర్తుండిపోతుందని, అందరూ గర్వించే క్షణాలుగా తాము ఆ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకుంటామని చెప్పారు. తనకు పుట్టిన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టుకోవడం గర్వకారణంగా భావిస్తున్నట్టు భతాహి బాబు గ్రామానికి చెందిన మరో మహిళ తెలిపింది. సిందూర పెరిగి పెద్దయిన తర్వాత తన పేరుకు అర్థం తెలుసుకుని భరతమాతకు పేరు తెస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పింది. ఆపరేషన్ సిందూర్‌కు గౌరవ సూచకంగా తన శిశువుకు సిందూర్ పేరు పెట్టుకున్నట్టు పడ్రౌన ప్రాంతానికి చెందిన ప్రియాంక దేవి తెలిపారు.

## పాక్ ఊసరవెల్లి, ఆ మాటలు నమ్మొద్దు
### బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ భారత్‌కు హెచ్చరిక



**క్వెట్టా, మే 12:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్థాన్ లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంట కవ్వింపులకు పాల్పడటంతో భారత్ తిప్పికొట్టింది. ఈ క్రమంలో కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనకు భారత్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ స్పందించింది. పాకిస్థాన్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని పరోక్షంగా హెచ్చరించింది. పాకిస్థాన్ ఊసరవెల్లిలా రంగులు మారుస్తుందని వ్యాఖ్యానించింది. పాకిస్థాన్ నుంచి వినిపించే శాంతి, కాల్పుల విరమణ, సోదరభావం ప్రవచనాలు కేవలం మోసమని పేర్కొంది. ఆ దేశంతో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బలూచ్ లిబరేషన్ ఆర్మీకి విదేశీ మద్దతు ఉందంటూ వస్తున్న విమర్శలను బలూచిస్థాన్ తోసిపుచ్చింది. తాము కీలు బొమ్మలం కాదని, పాకిస్థాన్ ఏం చేసినా చూస్తూ మౌనంగా ఉండబోమని పేర్కొంది. ఈ ప్రాంతానికి సంబంధించి ప్రస్తుత, భవిష్యత్తు సైనిక, రాజకీయ, వ్యూహాత్మక నిర్మాణంలో తమకు సరైన స్థానం ఉందని చెప్పింది. తనను తాను డైనమిక్, నిర్ణయాత్మక పార్టీగా అభివర్ణించుకుంది. పాకిస్థాన్లోని బలూచ్ ప్రావిన్స్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు పుష్కలంగా ఉన్నాయని తెలిపింది. అయితే దేశ వ్యవసాయ యోగ్య భూమిలో బలూచ్ వాటా కేవలం 5 శాతం మాత్రమేనని వెల్లడించింది. బలూచ్‌లో కఠినమైన ఎడారి వాతావరణం ఉంటుందని, అందుకే పేదరికం ఎక్కువని బీఎల్‌ఏ తెలిపింది. ఎడారి ప్రాంతం కావడంతో జనాభా తక్కువగా ఉంటుందని, అందుకే అభివృద్ధికి దూరంగా ఉందని పేర్కొంది. అందుకే బలూచ్‌లో అనిశ్చితి నెలకొని వేర్పాటువాదులు శక్తిమంతమయ్యారని చెప్పింది. ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని బలూచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారని తెలిపింది.

### చత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం
## 13 మంది మృతి, మరో 30 మందికి గాయాలు

**నయారాయ్‌పూర్, మే 12:** పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారు. వారితో పాటు నలుగురు చిన్నారులు కూడా ఈ ప్రమాదంలో మరణించారు. ఈ ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదం సోమవారం తెల్లవారు జామున జరిగినట్టు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం చటౌద్ గ్రామానికి చెందిన కొందరు తమ కుటుంబ సభ్యుల వివాహ వేడుకలో పాల్గొనడానికి చౌతియా ఛత్తీ గ్రామానికి వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే వివాహం పూర్తయ్యాక ఓ వాహనంలో రాయ్‌పూర్‌కు బయల్దేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలోకి రాగానే వేగంగా వచ్చిన ఓ ట్రక్కు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందగా 30 మందికిపైగా గాయపడ్డారు. అందుకున్న సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలతో పాటు గాయపడిన వారిని స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. అయితే గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇక మృతుల్లో తొమ్మిది మంది మహిళలతో పాటు నలుగు చిన్నారులు ఉన్నట్టు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయ్‌పూర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ తెలిపారు.



13-5Pg6exHMNWJQE.qxd:13-5Pg6exHMNWJQE.qxd 01/01/01 9:33 AM Page 1



# కోనలో వైభవంగా నృసింహుని తిరుకళ్యాణమహోత్సవం

## పట్టువస్త్రాలను సమర్పించిన టిటిడి దేవస్థానం



**రాపూరు (నెల్లూరు), మే 12, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి వారికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో బాగంగా సోమవారం స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి, శ్రీ అంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం 9 గంటలకు స్వామి ఆరి ఆస్థానమండపంలో పల్లకిలో స్వామి,అమ్మవార్లను వుంచి ఉభయ కర్తలు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి,వారిని ఉభయ దేవేరులతో పల్లకీలో తీసుకోని వచ్చి స్వామి వారి కళ్యాణ మండపంలో వుంచారు. ఈ సందర్బంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారికి కళ్యాణ తలంబ్రాలను ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ,ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డిలు ఆందజేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మండపంలో స్వామి,అమ్మవార్ల కళ్యాణాన్ని ఆలయ ఆర్చక స్వాములు వేమంత్రోచ్ఛ రణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ విశిష్టతను,స్వామి,అమ్మ వారి గోత్రాలను, గుంటూరుకు చెందిన పుల్లాభట్ల వెంకటేశ్వర్లు చక్కగా భక్తులకు ఆర్ధమయ్యే రీతిలో వివరించారు. అనంతం స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మేల్యే కురుగోండ్ల రామకృష్ణ, సింధు దంపతులు, సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,అనిత దంపతులు, ఆలయ ఉప కమీషనర్ ఓరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ,దేవాదాయ శాఖ ఇఓ నూతలపాటి శ్రీధర్ నాయుడు,
గోనుపల్లి సర్పంచ్ గోతాటి నారాయణమ్మ, సేవా కమిటీ సభ్యులు రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్టా హజరత్ నాయుడు, తోట క్రిష్ణయ్య, శ్రీశైలం భార్గవ రామ్, కిన్నెర నరసింహా రావు,పెమ్మసాని సుగుణమ్మ,మోమిడి నరసింహులు, బోగులు బాస్కర రెడ్డి, బోతల శివ నాగేశ్వర రావు,దాసరి బాస్కర నాయుడు, యం.నవక్రిష్ణ చౌదరి, ఈతముక్కల యోగేశ్వర రావు వున్నారు.



## డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసి బస్సు 30 మందికి గాయాలు

**చంద్రగిరి, మే 12 ప్రభాతవార్త:** రక్తదాహం తీరని జాతీయ రహదారిపై అర్ధరాత్రి వేళ క్షణ కాలం డ్రైవర్ కునుకు తీశాడేమో వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టడంతో 30 మంది తీవ్ర గాయాలపాల య్యారు. తిరుమల డిపో ఆర్టీసి బస్సు తిరువణ్ణామలై నుండి తిరుమలకు వస్తుండగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని అగరాల వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. డివైడర్‌ను ఢీకొట్టిన ధాటికి బస్సు ముందు భాగం ఛిద్రమైంది. అదృష్టవశాత్తు డ్రైవర్, కండక్టర్ సహా ప్రయాణికులు ప్రాణాపాయ స్థితి నుండి గాయాలతో బయటపడ్డారు. ఆదివారం రాత్రి 12.30 గంటల సమయంలో ప్రమాదం జరగడంతో సిఐ సుబ్బరామిరెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రాజారెడ్డిపై కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రమాదానికి గురైన బస్సును క్రేన్ సాయంతో తొలగించారు.

# యుద్ధం ఉద్రిక్తతల ఎఫెక్ట్ !

## వేసవి సెలవుల్లోనూ తిరుమలలో మోస్తరుగా భక్తులు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ -పాక్ మధ్య మొన్నటివరకు నెలకొన్న ఉద్రిక్త యుద్ధ పరిస్థితులు...రాష్ట్రవ్యాప్తంగా భద్రతా పరంగా పటిష్ట తనిఖీలతో కలియుగవైకుంఠం తిరుమలకు వేసవిసెలవుల్లోనూ భక్తుల సంఖ్య మోస్తరుగానే ఉంది. వేసవిసెలవులు నేపథ్యంలో కొండపై భక్తుల సంఖ్య అనూహ్యంగా రద్దీగా కనిపిస్తుంది. అందునా సామాన్యభక్తులకు దేవదేవుని దర్శనం సులభంగా తక్కువ సమయంలో చేయించేందుకు మే 1వతేదీ నుండి జులై 15వతేదీ వరకు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేయడం, సిఫార్సులేఖలు నిలుపుదలతో తిరుమలకు వచ్చే పలుకుబడి కలిగిన, డబ్బున్న ధనవంతుల భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇందుకు తార్కాణంగా గత ఏప్రిల్ నెలలో వేసవిసెలవులు ఆరంభంలో దేశం నలుమూలల నుండి రెండువారాలు భారీగా భక్తులు తిరుమలకు రావడం, ఏకంగా సర్వదర్శనానికి 20నుండి 24గంటల సమయం కేటాయించారు. అలాంటిది ఒక్కసారిగా మేనెల 1వతేదీ నుండి తిరుమలలో భక్తుల సంఖ్య తగ్గింది. మేనెల 1వతేదీ 57,863మంది భక్తులు మహాలఘులో స్వామివారిని దర్శించుకున్నారు. 2వతేదీ 74,344మంది, 3న 84,113మంది, 4న 83,380, 5న 65,095, 6వతేదీ 69,214మంది, 7న 71,001, 8న 64,850, 9వతేదీ 68,213మంది భక్తులు, 10న శనివారం రోజు 85,078మంది, 11వతేదీ ఆదివారం 80,43మంది ఇలా వరుసగా 70వేలమందికి తగ్గకుండా దర్శనం చేసుకోగలిగారు. ఈ సంఖ్యను బట్టి కొండపై వేసవిసెలవుల్లోనూ సాధారణ రోజుల్లాగే మోస్తరుగానే భక్తులు వస్తున్నారనేది తెలుస్తుంది. కాగా సోమవారం సాయంత్రం 6గంటల వరకు 47వేలమంది భక్తులు మహాలఘులోనే శ్రీవారిని దర్శించుకున్నారు. ఇలా ఉండగా ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక దర్శనాల టిక్కెట్లు 25వేలు, ఆర్జితసేవలు 5వేలు,,ప్రత్యేక దర్శనాలు 2వేలు, ఆఫ్‌లైన్‌లో 20వేల వరకు ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులు అందుకుని దర్శనానికి తిరుమలకు వస్తున్నారు. ఇక ప్రోటోకాల్ దర్శనాలు 2వేలమంది వరకు, శ్రీవాణి బ్రేక్ దర్శనాలు ఆన్‌లైన్‌లో రోజువారీగా 500 టిక్కెట్లు, ఆఫ్‌లైన్‌లో రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు, తిరుమలలో 800టిక్కెట్లు జారీఅవుతున్నాయి. ఈ టిక్కెట్లు అందుకున్న భక్తులు నేరుగా నిర్దేశిత సమయానికి వైకుంఠమ్ 1 క్యూలైన్లో ఆలయంలోనికి చేరుకుంటే కేవలంనాలుగుగంటల్లోనే ఏడుకొండల వెంకన్న దర్శనం జరుగుతుంది. పాక్‌లో ఉద్రిక్తలతో తీవ్రవాదులు భయంతో కూడా తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య కొంతవరకు తగ్గిందనేది తెలుస్తోంది. మొత్తంమీద వేసవిసెలవులు తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. వచ్చిన సామాన్యభక్తులకు గదులు కూడా సులభంగానే కేటాయిస్తున్నారు.

# నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యం

## డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్



ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పిఠాపురం నర్సింగ్ సిబ్బందితో తన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** దేవతలు ఎక్కడో ఉండరని,మన కళ్ళెదుటే ఉంటారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.అత్యవసర సమయాల్లో తమ ప్రాణాలకు తెగించి ఎందరికో ఊపిరిపోసే నర్సు అమ్మలను మించి దేవతలు ఎవ్వరుంటారన్నారు. కరోనా సమయంలో ఎంత మంది నర్సులు ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సేవలందించారో మనం ఎప్పటికి మరవలేమన్నారు.అత్యాంత ఆందోళనకరమైన స్థితిలో రోడ్డు ప్రమాద క్షతగాత్రులు వచ్చినప్పుడు నర్సులు చేసే సేవలు తలుచుకుంటే ఎంతో ఆశ్చర్యం వేస్తుందంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు.వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని పవన్‌కళ్యాణ్ కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు.నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు.నర్సుల చేతి స్పర్శ కూడ రోగిలో మానసిక స్థైర్యంతో పాటు సాంత్వన కల్గిస్తుందని తెలిపారు.అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు భేటీ అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని సత్కరించారు.

## వివాహితుల జనాభాలో ఎపి దేశంలోనే నం.1

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని సామాజికంశాలకు సంబంధించి వ్యత్యాసాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆ మేరకు ప్రభుత్వం సమాచారాన్ని వెల్లడించింది. ఒకవైపు వివాహం అయిన జనాభాలో దేశంలో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రం మరోవైపు వితంతు/విడాకులు తీసుకున్న/ విడిగా ఉంటున్న వారిలో మూడోస్థానం లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పురుషులు వివాహాల్లోనే కాకుండా వితంతు విడాకులు విడిగా ఉంటున్న వారి విభాగంలోనూ దేశంలో మొదటిస్థానంలో ఉన్నారు. మరోవైపు వివాహం అయిన మహిళల్లో అత్యధికంగా కేరళ , హిమాచల్‌ప్రదేశ్ తర్వాత మూడో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ అతివలు వితంతు విడాకులు విడిగా ఉంటున్న వారి విభాగంలో నాలుగోస్థానంలో ఉన్నారు. కేంద్రంతాజాగా విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం నివేదిక ఈ వివరాలను తెలియజేస్తోంది. దీని ప్రకారం పెళ్లయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌ది దేశంలో మొదటి స్థానం కాగా బిహార్ చివరి స్థానంలో నిలిచింది. జాతీయస్థాయిలో పెళ్లికానివారు 51.2% పెళ్లయినవారు 45.5% వితంతు/ విడాకులు/విడిగా ఉంటున్న వారు 3.3% మంది ఉన్నారు.

# రెమ్యూనరేషన్ కోసం టీచర్లు ఎదురుచూపులు!

### సొంత డబ్బుతో ప్యాకింగ్ మెటీరీయల్ కొనుగోలు చేసిన వైనం - తెలిసినా పట్టించుకోని విద్యాశాఖ ఉన్నతాధికారులు

**అనంతపురం న్యూటౌన్, మే 12 ప్రభాతవార్త** పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యూషన్ విధులు ముగిసిన వెంటనే చెల్లించాల్సిన రెమ్యూనరేషన్, టిఏ, డిఏలను నేటికీ చెల్లించకపోవడం విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.పదో తరగతి పరీక్షలు ఫలితాలు వచ్చాయి...వచ్చే వారం నుండి సప్లిమెంటరీ పరీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. అయినా కూడా చెల్లించకపోవడంతో విద్యాశాఖపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల విధులకు అనంతపురం జిల్లాలో దాదాపు 1700 మంది ఇన్విజిలేటర్లు (ఉపాధ్యాయులు), దాదాపు 300 మంది సీఎస్, డీవో (హెచ్‌ఎం-ఉపాధ్యాయులు) హాజరైయ్యారు. వీరికి రెమ్యూనరేషన్‌తో పాటు టిఏ, డిఏ చెల్లించాల్సి వుంది. అదే విధంగా ఏప్రిల్ 3 నుండి 9వ తేదీ వరకు స్పాట్ వాల్యూషన్ (జవాబు పత్రాలు దిద్దడం) జరిగింది. ఈ విధులకు హాజరైన వందలాది మంది ఏఈ,సీఈలు (ఉపాధ్యాయులు)లకు రెమ్యూనరేషన్‌తో పాటు టిఏ, డిఏ కూడా చెల్లించాల్సి వుంది. అలాగే స్పెషల్ అసిస్టెంట్లకు కూడా రెమ్యూనరేషన్ చెల్లించాల్సి వుంది. ఇలా రెమ్యూనరేషన్, టిఏ, డిఏలు చెల్లించడానికి దాదాపు రూ.70 నుండి 80 లక్షలు చెల్లించాల్సి వుంది. ప్రతి ఎడాది పరీక్షలకు ముందుగానే మంజూరు చేయాల్సిన నిధులను ఉన్నతాధికారులు సకాలంలో మంజూరు చేయకపోవడంతో పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యూషన్ ముగిసి ఇప్పటికీ నెల అవుతోంది. ఫలితాలు కూడా విడుదల అయ్యాయి. ఈనెల 19 నుండి 28వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు కూడా జరుగుతున్నాయి. అయినా కూడా నేటికీ రెమ్యూనరేషన్, టిఏ, డిఏలను చెల్లించకపోవడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు.

అంతే కాకుండా పరీక్షల విధుల్లో ఫ్యాకింగ్ మెటీరీయల్‌ను కూడా సీఎస్, డీవోలు సొంత డబ్బుతో కొనుగోలు చేయడం గమనార్హం. అంతే కాకుండా 2023-24లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన రెమ్యూనరేషన్, టిఏ, డిఏలను కూడా ఇంత వరకు చెల్లించలేదని ఉపాధ్యాయ సంఘాలు వాపోతున్నాయి.

## దివ్యాంగునికి గంటలోనే ట్రై సైకిల్ పంపిణీ - కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారుడు

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుని వద్దకే వెళ్ళి సమస్యను ఆలకించి పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గంటలోపే అమలుచేసి దివ్యాంగుని కోరికను నెరవేర్చి మానవత్వాన్ని చాటుకున్న జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణంలో అనుకోని సంఘటన జరిగింది. అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎలా ఉండాలి అనే అంశంపై నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ముగించుకుని తిరువూరు పర్యటనకు బయలుదేరుతున్న సమయంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చూపులు తనపైవు దీనంగా చూస్తున్న దివ్యాంగునిపై పడ్డాయి. ఆయనకు రెండు కాళ్ల పనిచేసే స్థితిలో లేవు. కలెక్టర్ వద్దకు నేరుగా వచ్చి సమస్యనూ చెప్పుకోలేని దీనస్థితి .దీంతో కలెక్టరే స్వయంగా దివ్యాంగుడు కూర్చున్న చోటికి వెళ్లారు. మోకాళ్లపై కూర్చున్నారు. ఆశగా చూస్తున్న దివ్యాంగుడిని చిరునవ్వుతో పలకరించి ఎక్కడి నుంచి వాచ్చరు. ఏమిటి పరిస్థితి ఎందుకోసం వచ్చారు అని అడిగారు. కలెక్టర్ ప్రశ్నలు విన్న దివ్యాంగుడు కన్నీటి పర్యంతమయ్యాడు. విజయవాడ పటమట 10వ డివిజన్‌కు చెందిన గద్దె తంబి తన చేతిలో ఉన్న ఆదార్ కార్డు తన వికలాంగత్వాన్ని నిర్ధారణ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన ధ్రువీకరణ పత్రం కలెక్టర్‌కు చూపిస్తూ తనకు ఉపాధి ఏమీ లేదని నడవలేని స్థితిలో ఉన్నానని తనకు ట్రైసైకిల్ సమకూరిస్తే దాంతో జీవిస్తానని కలెక్టర్ డా.జి.లక్ష్మీశను అభ్యర్థించారు. కలెక్టర్ ఆ వికలాంగుడు ఇచ్చిన పత్రాలను పరిశీలించి తప్పకుండా సమస్యలు అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు.

# ప్రపంచగతిని మార్చిన ధర్మం బౌద్ధం

## బుద్ధ జయంతి సభలో మండలి బుద్ధప్రసాద్



ధమ్మవసి తీయగూర సోతా రామం, రచించిన గౌతమ బుద్ధ నృత్యరూపకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్.గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

**విజయవాడ,వేం12,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచగతిని మార్చిన ధర్మం బౌద్ధమార్గమని అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఒక సంతుష్టమై జీవనగతి కోసం గౌతమ బుద్ధుడు సాగించిన అన్వేషణ,భిన్న మనో ఆవిష్కరణలకు తావిచ్చిందన్నారు.సమాజం పట్ల.పరస్పర సంఘ జీవనం,శాంతి, హేతుబద్ధ ఆలోచనకు దారి తీసిందన్నారు.సోమవారం గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గం లోని బౌద్ధ క్షేత్రమైన ఘంటసాలలో రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి, భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శయన బుద్ధ ప్రాజెక్ట ప్రాంగణంలో బుద్ధ జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సభ అధ్యక్షత వహించిన మండలి మాట్లాడుతూ అందరికీ 2,569 వ బుద్ధ జయంతి శుభాకాంక్షలు తెలుపు తున్నానన్నారు. బోధి వృక్షం నీడన తపోదీక్ష ద్వారా తన హృదయంలో వెలిగిన జ్ఞానజ్యోతి కాంతుల్ని ప్రపంచానికి పంచాలని సత్సంకల్పంతో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభించిన గౌతమ బుద్ధుని జన్మ దినం వైశాఖ పౌర్ణమి అని, బుద్ధుని జననం, బోధి ప్రాప్తి, మహాపరి నిర్వాణం అన్ని ఈ పౌర్ణమి నాడే సంభవించాయన్నారు. ఇదివరకు 2017 లో బుద్ధ జయంతి ఉత్సవాలను ఘంటసాల లో ఘనంగా నిర్వహించామన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు కనక మేడల రవీంద్ర కుమార్ మాట్లాడుతూ మరుగున పడిన రాష్ట్ర రాజధాని అమరావతికి పూర్వ వైభవం తీసుకుని వస్తున్న విధంగానే రాష్ట్ర ప్రభుత్వం బౌద్ధ క్షేత్రమైన ఘంటసాల ఘన చరిత్రను ప్రాచుర్యం కల్పించే ప్రాజెక్ట చేపట్టడం సంతోషదాయకమన్నారు.బౌద్ధ సాహితీ చారిత్రిక సదస్సులో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసారు.
ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన ఘంటసాలకు పూర్వవైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఇనుప వ్యర్థాలతో జైహింద్ చక్ర


## రూప శిల్పి విజయవాడ శ్రీనివాస్ వడకండ్ల

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఇనుప వ్యర్థాలతో అర్థం ఇస్తూ విజయవాడకు చెందిన ప్రముఖ కళాకారుడు శ్రీనివాస్ వడకండ్ల తయారు చేసిన జైహింద్ చక్ర శిల్పం దేశ రాజధాని ఢిల్లీలో కొలువుతీరింది. నేషనల్ ఇంటిగ్రిటీ స్ఫూర్తితో రూపొందించిన ఈ శిల్పాన్ని పార్లమెంట్‌కు వెళ్ళే దారిలో రఫీ మార్గ్ చౌరస్తాలో ఇటీవల నెలకొల్పారు. శ్రీనివాస్,ఈ శిల్పం కోసం 1.5 టన్నుల ఆటోమొబైల్ ఇనుప వ్యర్థాలను వినియోగించారు. నెవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీఐఎల్) అధ్వర్యంలో 10 అడుగుల ఎత్తు,వెడల్పు ఉన్న ఈ శిల్పాన్ని రూపొందించారు.??మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.శిల్పిని అభినందించారు. మన్ కీ బాత్ 75వ ఎపిసోడ్‌లో శ్రీనివాస్ కళాఖండాల గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. తాజాగా కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖకు చెందిన నెవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌ఎల్‌సీఐఎల్) ఆధ్వర్యంలో ఈ శిల్పాన్ని తయారు చేశారు. స్వచ్ఛతాహీ సేవా క్యాంపైన్ 4.0లో భాగంగా దీనిని రూపొందించారు. జాతీయ పతాకం స్ఫూర్తితో ఈ కళాఖండాన్ని తయారు చేశారు. జాతీయ సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యం కలగలిసేలా భారతీయ సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా దీనికి రూపకల్పన చేశారు. 1.5 టన్నుల ఇనుప వ్యర్థాల వినియోగం: పదడుగుల ఎత్తు, వెడల్పుతో తయారుచేసిన ఈ శిల్పం కోసం 1.5 టన్నుల ఆటోమొబైల్ ఇనుప వ్యర్థాలను వినియోగించారు. పైపులు, చిన్న ట్యాంకులు, నట్లు, బోల్టులు, క్లచ్‌ప్లేట్లు, బేరింగ్స్ ఇలాంటి వాటన్నింటినీ వినియోగించారు. బొగ్గు గనుల్లో వినియోగించే వాహనాల నుంచి పనికిరాకుండా పక్కన పడేసిన వ్యర్థాలతోనే దీనిని పూర్తిగా తయారుచేశారు. తమిళనాడులోని కడలూరులో ఉన్న ఎన్‌ఎల్‌సీఐఎల్ ప్రాంగణంలో మూడు వారాలు ఉండి ఈ శిల్పాన్ని శ్రీనివాస్ తన బృందంతో కలిసి తయారుచేశారు. అనంతరం దీనిని ఢిల్లీకి తీసుకెళ్లి రఫీ మార్గ్ చౌరస్తాలో నెలకొల్పారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

**నెల్లూరు క్రైమ్, మే 12, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు కోవూరు పట్టణ పరిధిలోని చుండుగుంట ప్రాంతానికి చెందిన నల్లబోతు సాయి వెంకట ప్రతాప్ (26) నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసు న్నారు. సోమవారం విధుల్లో చేరేందుకు తన స్కూటీపై ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ వంతెన పై వెళుతుండగా వెనక నుండి వచ్చిన ట్రాక్టర్ అతివేగంతో వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ స్కూటీని ఢీకొనింది. కింద పడిపోయిన ప్రతాప్ ట్రాలీ చక్రాల కింద చిక్కుకుపోయాడు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో వెళుతుండడంతో చక్రాల కింద నలిగిన ప్రతాప్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ట్రాక్టర్ వదిలి డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ సిఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# కన్నుల పండుగగా వేదాద్రి యోగానంద శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం



**జగ్గయ్యపేట, మే 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో వేంచేసివున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి గం.12లకు కన్నుల పండుగగా జరిగింది. దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు తరపున కెసిపి సిమెంట్స్ ఏజిఎం రామ్‌ప్రసాదు ఆధ్వర్యంలో శ్రీభూనీళా సమేత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి తిరుక్కళ్యాణ మహోత్సవం వేలాదిగా తరలివచ్చిన భక్తులను తన్మయులను చేసింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వామివారి కళ్యాణ వేడుకలో పాల్గొని సేవించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన పరిమళ పుష్పాలాకృతమై శోభిల్లు కళ్యాణ మండపంలో శ్రీభూనీళ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవాన్ని పరాంకుశం వాసుదేవా చార్యుల యాజ్ఞికంలో దేవస్థాన అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణానంతరం తెల్లవారుఝామున స్వామివారికి గరుడసేవ, చలువ-చక్రపవాహన సేవలు నిర్వహించారరు. తిరుపతి దేవాదాయశాఖ మల్టీజోన్-2 ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ కూడా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు, శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారి ట్రస్టు, కెసిపి లిమిటెడ్ ఫ్యాక్టరీ వారు పులిహోర, చక్రపొంగలి, మహాజన అన్నదానం, దేవస్థానంలో విద్యుదీపాలంకరణ, కళ్యాణ మండప అలంకరణ నిర్వహించి స్వామివారికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు, పుష్పాలు, పూల మాలలు సమర్పించారు. రామ్‌కో సిమెంట్స్ వారు అత్యవసర వైద్య సదుపాయాలు, ఉచిత మందుల పంపిణీ శిబిరం నిర్వహించారు. సోమవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు.

## ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతు

**సంగం (నెల్లూరు), మే 12, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సంగంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతైయ్యారు.విషయం తెలిసి సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ తమ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ఇద్దరు చిన్నారులు కోవూరు మండలం చిన్నపడుగుపాడు ఎన్‌టిఎస్ సమీపంలో నివాసం ఉంటున్న బందా గోవిందయ్య, శేషమ్మ, బెలుదారి పనిచేస్తు జీవనం సాగిస్తు కుమారులను చదించుకుంటున్నారు. ఈ ఇద్దరు పిల్లలు అమ్మమ్మవాళ్ళ ఊరు అయిన సంగంకు వెళ్ళి గల్లంతైయ్యారు. పెద్ద కుమారుడు వెంకట చందు 10 వ తరగతికి వస్తాడు. చిన్నకొడుకు వెంకట నందకిషోర్ 8 వ తరగతికి వస్తాడని బందువులు తెలిపారు.

# భారత్ సైన్యానికి రూ.3.15లక్షలు విరాళం



**తిరుపతి,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా దేశంకోసం ప్రాణాలు త్యాగంచేసిన వీరసైనికులకు మద్దతుగా ఇండియన్ ఆర్మీకి తిరుపతి ఆటోమొబైల్స్ అసోసియేషన్ విరాళం ప్రకటించింది. 3.15లక్షల రూపాలయు డిడిని విరాళంగా హోండా మోటార్స్ అదినేత పృద్వీరెడ్డి పలువురు ఆటోమొబైల్స్ డీలర్లు సోమవారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు ఈ డిడిని అందజేశారు. దేశం కోసం నిరంతరం పోరాడుతున్న సైనికులకు మద్దతుగా నిలచిన డీలర్ అసోసియేషన్ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ చంద్ర శివయ్య వర్ధంతి

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు అమరుడుకామ్రేడ్ చంద్ర శ్రీమన్నారాయణ 17వ వర్థంతి సభను ఆయన స్వగ్రామమైన కమ్మవారిపాలెం గ్రామంలో జిల్లా నాయకుడు కోట్యా నాయక్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అమర స్తూపం వద్ద ఎర్రజెండాను ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు ఆవిష్కరించి నివాళులు అర్పించారు. తరువాత కామ్రేడ్ చంద్ర శివయ్య చిత్రపటానికి ఆయన కుమారుడు, ఆయన సోదరులు గ్రామ సర్పంచి రైతు కూలీ సంఘ నాయకులు బంధువులు అభిమానులు పూలదండలతో ఘనంగా నివాళులర్పించారు. తర్వాత జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం తమ పంటలకు మద్దతు ధరలు కూడా లేక తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారని అలాగే నిరుద్యోగం తాండవిస్తున్నదని ధరలు పెరిగి సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారని మహిళలు దళితులు మైనార్టీ ప్రజలు తమ మనుగడ కరువై బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని అన్నారు. దాదాపు ఇవే సమస్యలతో అటు పాకిస్థాన్‌లో కూడా ప్రజలు ఎదర్కొంటున్నారని అన్నారు. వీటన్నిటికీ కారణం ఉభయ దేశాల వ్యవసాయ రంగంపై పూర్తిస్థాయిలో సామ్రాజ్యవాద బహుళ జాతికంపెనీలు పట్టు సంపాదించడమేనని అన్నారు. అంతేకాక భూములు, గనులు సముద్ర తీరం మొత్తం సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలు అప్పజెప్పడం కోసం భారత ప్రభుత్వం చట్టాలు చేసిందని ఆయా ప్రాంతాల్లో నివసించే రైతాంగాన్ని గిరిజన ప్రజలను ఆయా భూముల నుంచి అడవుల నుంచి ఖాళీ చేయిం చేందుకు వాళ్ళ మధ్య గొడవలు సృష్టించారన్నారు.

# వీర జవాన్ మురళి నాయక్ కోసం పాట పాడుతా

## - ప్రముఖ సింగర్ మంగ్లీ

**అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో** భారతదేశము, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ త్యాగాలు వెలకట్టలేనివి అని, దేశ సరిహద్దుల్లో దేశం కోసం సైనికులు ఎంతో శ్రమిస్తూ త్యాగాలు కూడా చేస్తున్నారని, దేశం కోసం తన ప్రాణాల్ని పనంగా పెట్టిన మురళి నాయక్ త్యాగాలు గుర్తుచేస్తూ ఒక పాట కూడా పాడుతానని ప్రముఖ సింగర్ మంగ్లీ వెల్లడి పేర్కొన్నారు. సోమవారం మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించడానికి ప్రముఖ సింగర్ హైదరాబాద్ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లిగ్రామానికి విచ్చేసి మురళీనాయక్ మృతిపట్ల విచారం వ్యక్తం చేసి నివాళులు అర్పించి, మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రముఖ సింగర్ మంగ్లీ మాట్లాడుతూ.. ఇలా జరగడం చాలా బాధాకరమైన విషయం.. ఒక రకంగా చాలా గర్వంగా కూడా ఉందన్నారు. జవాన్ మురళీ నాయక్ ప్రాణత్యాగం దేశంగర్వించ తగ్గ విషయం అన్నారు. భారతదేశం మొత్తం కల్లి తాండా వైపు చూస్తోందన్నారు. మురళీనాయక్ వీర మరణం ఊరికి గొప్ప పేరు తెచ్చి పెట్టిందన్నారు. మురళీనాయక్ నాడు ఈ అమ్మకు మాత్రమే కొడుకు నేడు దేశంలోని ప్రతి మహిళకు ఒక కొడుకుగా నిలిచాడన్నారు. ప్రతి మహిళ నుదుటిన సింధూరం ధరించే సమయంలో మురళీనాయక్‌ను తలుచుకునే విధంగా ఆయన సింధూర్ ఆపరేషన్‌లో వీర మరణం పొందారన్నారు. ప్రభుత్వం మురళీనాయక్ కుటుంబం పట్ల భరోసాగా నిలవడం గొప్ప విషయమన్నారు.

# తెలుగుదేశం పార్టీలో రాజుకున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ చిచ్చు

**జగ్గయ్యపేట, మే 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ స్థాయిని మరిచి ఇచ్చిన హామీకి తిలోదకాలిచ్చి ఆప్కాబ్ చైర్మన్ పదవిని కల్పించకుండా అవమానపర్చారంటూ టిడిపి నియోజకవర్గ నాయకులు, శ్రేణులు మండిపడుతున్నారు. గతంలో ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన రఘురామ్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో విశేష పరిశ్రమచేసి పార్టీని జిల్లాలో జైత్రయాత్ర చేసే విధంగా సమన్వయంచేసి నాయకత్వ పటిమతో చేసిన పరిశ్రమకు, కృషికి గుర్తింపు లేకుండా కేవలం కెడిసిసి బ్యాంక్ చైర్మన్ పదవిని పార్టీ అధిష్టానం కల్పించి సముచిత స్థానం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందంటూ పార్టీ నేతలు తిరుగుబాటు స్వరం పెంచారు.

ఆప్కాబ్ చైర్మన్ పదవిని కల్పిస్తామని చెప్తూ కెడిసిసి చైర్మన్ పదవికి నియామకంచేసి తుదకు ఆప్కాబ్ చైర్మన్ పదవిని వేరొకరిని నియమించటాన్ని కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. కెడిసిసి చైర్మన్ పదవి నియామకం జరిపే రోజునే ఆప్కాబ్ చైర్మన్ పదవి కల్పిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇది అమలుకాకపోవటంతో కార్యకర్తలు మండిపడుతున్నారు. కాగా సోమవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వకుంటే పార్టీ మనుగడ కష్టమవుతుందని అభిప్రాయపడ్డారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచన చేయాలని నియోజకవర్గ ముఖ్యనాయకులు విజ్ఞప్తిచేశారు.

1995లో టిడిపి సంక్షోభంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు తోడు నిలిచి నాటి నుండి నేటి వరకు పార్టీ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేసిన జెంటిల్‌మెన్‌కు రాష్ట్రస్థాయి పదవి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయటం తగదని నిరసన వ్యక్తంచేశారు.

నిర్ణయం మార్చుకోకుంటే తామంతా తమ పదవులు వదులుకోడాన్కి సిద్ధంగా ఉన్నామని అల్టిమేటం జారీచేశారు. సమావేశంలో పార్టీ నేతలు మేకా వెంకటేశ్వర్లు, కట్టా వెంకటనరసింహారావు, వడ్లమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, మే 12, ప్రభాతవార్త

అమ్మలగన్నమ్మ బెజవాడ దుర్గమ్మవారి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ సోమవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ఇఓ వికె శీనా నాయక్ కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షణను ప్రారంభించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రపఠనాల నడుమ వివిధ రకాల వేషధారణలైన భూత, ప్రేత, పిశాచ, గజకర్ణ, గోకర్ణ వేషధారణలతో, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, భక్తీ గీతాలాపనలతో శ్రీ స్వామి అమ్మవార్ల ప్రదక్షణకు ముందుగా సాగుతూ తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. దారిపొడవునా శ్రీ స్వామి అమ్మవార్ల రథానికి ముందు భక్తులు మోకరిల్లి అనుగ్రహం అందుకున్నారు.

– మే 14న హుండీ లెక్కింపు:

దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 14న బుధవారం నాడు లెక్కిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

– దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ:

దుర్గమ్మవారి దర్శనానికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనమయ్యేలా ఇఓ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు వేసవి తాపం ఉపశమానికి మజ్జిగ పంపిణీ చేశారు. దుర్గమ్మవారిని నూతన వధూవరులు కూడా దర్శించుకోగా వారికి దర్శన ఏర్పాట్లను అధికారులు ఏర్పాటు చేశారు.



వి రామచందర్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

– దుర్గమ్మవారి సేవలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు : దుర్గమ్మవారిని సోమవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు వి రామచందర్ దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన ఇఓ దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## భూభారతి పైలట్ మండలాల్లో స్పీడ్‌గా పరిష్కారమతున్న భూసమస్యలు

### జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :భూ భారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న మద్దూర్, లింగంపేట, వెంకటాపూర్, నెలకొండపల్లి 4మండలాల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూభారతి అమలుపై సోమవారం ములుగు, కామారెడ్డి, ఖమ్మం, నారాయణపేట జిల్లాకలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి మార్గం సులు వైందన్నారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూకార్యాలయంలోనే వాళ్ళ సమస్యకు పరిష్కారంలభిస్తుందని ,ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు లేకుండా వారి భూ సమస్యలను పరిష్కారం చూపిస్తారన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే లోతుగా, క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవావాలని. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సోమవారం నుంచి తహాశీల్దార్లకు ఆన్‌లైన్ నమోదు సౌకర్యం కల్పించామని 4 జిల్లాల పరిధిలో వచ్చిన దరఖాస్తులు, ప్రధాన సమస్యలపై చర్చించి నెలాఖరు కల్లా ఒక పరిష్కారానికి రావాలన్నారు. దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఇతర ప్రాంతాల నుంచి అవసరమైన నైపుణ్యవంతులైన సిబ్బందిని పంపించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కు మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలోకూడా ఎప్పటికప్పుడు అర్హుల జాబితాలను ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులకు పంపించి ఆమోదం తీసుకోవాలని, వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. సమావేశంలో సిసిఎల్ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మకరంద్ నాలుగు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

### త్రిసభ్య కమిటీకి రాష్ట్ర ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ సంఘాల చైర్మన్ లచ్చి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రీ మెన్ ఆఫీసర్స్ కమిటీ ముందు హాజరై ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానం(సిపిఎస్) రద్దు చేసి పాత పెన్షన్ (ఓపిఎస్) పునరిద్ధంచాలని, పొరుగు సేవల ఉద్యోగుల కొరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, 317 జివో ద్వారా మరి కొన్ని రకాల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఖజానా పై తక్షణ భారం పడని 24 అంశాలను తొలుత పరిష్కరించి, ఆ తర్వాత మిగిలిన 14 పైగా ఆర్థిక భారం పడే అంశాలను దశల వారీగా పరిష్కరించాలన్నారు. వీటితో పాటు జేఏసీ భాగస్వామ్య సంఘాలఉద్యోగుల ప్రత్యేక సమస్యల పట్ల ఆయా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించి కమిటీ ప్రభుత్వం తో చర్చించి పరిష్కారం కొరకు కృషి చేయగలమని హామీ ఇచ్చినట్లు లచ్చిరెడ్డి తెలిపారు.

## అమెరికా వద్దంటే యుద్ధం ఆపిన బిజెపి.. ఆ దేశాన్ని లెక్కచేయని వీరవనిత ఇందిర

### రేవంత్‌రెడ్డిని దూషించినా కాంగ్రెస్‌ని తిట్టినా ఒక్కటే

### హైబ్రిడ్ రాజకీయం కాదు.. నాది నాటు రాజకీయం

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త :**అమెరికా వద్దంటే బిజెపి ప్రభుత్వం ఎందుకు యుద్ధం ఆపింది, ఇందిరాగాంధీ అమెరికాను లెక్కచేయకుండా బంగ్లాదేశ్ ఆవిర్భావం వరకు పోరాడిన వీరవనిత ఇందరాగాంధీ అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖ రులతో మాట్లాడుతూ 1971లో ఇందిరాగాంధీ భయంకర యుద్ధం చేయడమే కాకుండా ఆమె తీసుకొన్న నిర్ణయాలు యావత్ ప్రపంచం మెచ్చుకొందని గుర్తుచేశారు. ఇందిరాగాంధీని అటల్ బిహార్ వాజపాయి అపరకాళీగా వర్ణిస్తూ ప్రశంసించారని, అమెరికా ఒత్తిడిని కూడా డోంట్ కేర్ అని పాకిస్థాన్ పై యుద్ధం చేసిన వీరనారి ఇందిరా గాంధీ అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ నాయనమ్మ చరిత్ర ఇది, బిజెపి వాళ్లకు గాంధీ కుటుంబం పై ఏడుపులు ఎక్కువ చేతలు తక్కువ అని అపహాస్యం చేశారు. రేవంత్‌రెడ్డిని దూషించినా కాంగ్రెస్‌ను దూషించినా ఒక్కటే రండ అంటే అర్థం ఏంటో ఈటెల చెప్పాలి దానికి సమాధానం నేను చెబుతా అని ఆగ్రహంవ్యక్తం చేశారు. బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ వలే హైబ్రిడ్ రాజకీయం కాదని, నాది నాటు రాజకీయం నేను అండర్‌ఏజ్‌లోనే 19 ఏళ్ళకు కౌన్సిలర్‌ను అయినాను అప్పుడు నువ్వు చదువుకొంటున్నావ్ అని ఆయన అన్నారు. నేను రౌడీలకు రౌడీని మంచోడికి మంచోడిని నువ్వు ఎక్కువ ఫీల్ కాకు అంత అవసరం లేదు అని ఈటెల పై విరుచుకు పడ్డారు. కెసిఆర్ పార్టీ పెట్టకపోతే ఈటల ఎవరు అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఎవరి వల్ల నువ్వు లీడర్ అఆయ్యావు నీకే అంత ఉంటే మాకు ఎంత ఉండాలి నువ్వు ఒక్క తిట్టుతిడితే మేం వంద తిడుతం కంట్రోల్‌లో ఉండి పరువు కాపాడుకో అని ఆయన హితవు చెప్పారు. బిఆర్ఎస్‌లో పెద్ద నసగాడు ఎందుకని కెసిఆర్ ఈటెలను బయటకు పంపారని ఆయన వివరించారు. ఈటెల రాజేందర్ నువ్వు బిజెపిలో నాకంటే చిన్న పిల్లవాడివి నా చరిత్ర తెలియాలంటే కిషన్‌రెడ్డిని వెంకయ్యనాయుడు, భగవంత్‌రెడ్డిని అడుగు అని అన్నారు. ఈటెల రాజేందర్ నాన్సెన్స్ కామెంట్లు చేయకు అని అన్నారు.

# బిఆర్ఎస్‌లో కవిత పరిస్థితి కరివేపాకు వంటిది

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో కరివేపాకుల కవిత పరిస్థితి దాపురించిందని ప్రభుత్వ విప్ ఐలయ్య ఎద్దేవా చేశారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ హరీష్ రావు , కవిత ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించాలని కేటీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ లో మూడు ముక్కలాట నడుస్తోంది. అందుకే కవితను బయటకు పంపించాలని చూస్తున్నారు. గతంలో విజయశాంతి, ఆలే నరేంద్ర పార్టీ నుంచి బయటకు పంపినట్లే కవిత కూడా బయటకు పంపుతారని చరిత్రను వివరించారు. పార్టీ నుంచి బయటకు పంపించే ప్రయత్నాలు జరుగు తున్నందువల్లనే రైతు బంధు, సామాజిక తెలంగాణ విషయాలను కవిత మాట్లాడుతోంది. తెలంగాణ ప్రజలు అరిగోస పడినప్పుడు మాట్లాడితే బాగుండేది పార్టీలో విలువగౌరవం లేకపోవడం వల్లనే కవిత మాట్లాడుతోందని ఆయన అభివర్ణించారు.

మీ నాన్న చేసిన అప్పులు, మీ అన్న చేసిన తప్పులను కవిత బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కవిత నువ్వు లిక్కర్ స్కాం చేసి జైలుకు వెళ్ళావు కానీ తెలంగాణ ప్రజల కోసం జైలుకు పోలేదని గుర్తుచేశారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పదేళ్ల బిఆర్ఎస్ పాపాలపైన మాట్లాడినందుకు ధన్యవాదాలు భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చింది సామాజిక తెలంగాణ రాలేదన్న కవిత మాట్లాడారని అన్నారు. బిఆర్ఎస్ మూడు ముక్కలు, నాలుగు చెక్కలు గా మారబోతుందని బీర్ల జోస్యం చెప్పారు. పదేళ్లలో కవిత పదవులు అనుభవించి వేల కోట్ల దండుకుని ఆ రోజు మాట్లాడకుండా, ఇప్పుడు మాట్లాడుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.

## సైన్యానికి దేశమంతా సంఘీభావం తెలిపినా

# కేంద్రం పోరాటం ఆపేయడం కలచివేసింది

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, మే 12, ప్రభాతవార్త :** ముక్తకంఠంతో సైన్యానికి దేశం మొత్తం సంఘీ భావం తెలిపిన కేంద్ర ప్రభుత్వం పోరాటం ఆపివేయడం కలిచివేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సైనికులు చేసిన పోరాటం ఎటు వంటి రూపం దాల్చక ముందే ఒక్క ట్విట్టర్‌తో దేశ సార్వ భౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మిగిల్చారని తెలిపారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీలా దాయాది దేశాన్ని కట్టడి చేయలేక పోయారని తెలిపారు. అనాడు చిన్నచిన్న ఘటనలు జరిగితే అప్పటి ప్రధాని మన్మోహన్‌ను ప్రశ్నించిన మోడీ ఇప్పుడు చేసిందేమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చర్యలకు దేశ ప్రజలు, కాంగ్రెస్ అధిష్టానం అన్ని రకాలుగా మద్దతు ఇస్తామంటే ట్విట్టర్‌కు స్పందిచడం అందరిని కలిచివేసిందన్నారు. యుద్ధ విరమణ ఎందుకు జరిగిందో పార్లమెంట్ వేదికగా చర్చలు జరగాలని రాహుల్‌గాంధీ, మల్లికార్జున్‌ఖర్గే కోరుతున్నారని తెలిపారు. ట్విట్టర్‌కు ఎందుకు స్పందించారో ప్రధాని మోడీ వివరణ ఇవ్వాలన్నారు.

అసదుద్దీన్ ఓవైసీ ఎంఐఎం వారు కూడా పాకిస్తాన్‌పై చేసే దాడులకు మద్దతిస్తే విరమణ చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. జరిగిన పరిణామాలు, ఎందుకు విరమణ చేయాల్సి వచ్చిందో జరిగిన సంఘటనపై ముఖ దర్శనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చర్చలు లేకుండా ఒక ట్విట్టర్ ద్వారా యుద్ధ విరమణ ప్రకటిస్తే సైనికుల మనోధైర్యం దెబ్బతిందన్నారు. ఎందుకు పోరాటాన్ని ఆపారాని దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందని ఒక భారత దేశ పౌరుడిగా నేను ప్రధానినీ ప్రశ్నిస్తున్నన్నారు.

సమావేశంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీనియర్ నాయకులు చిత్తారి రవీందర్ తదితరులు ఉన్నారు.

# ట్రంప్ ప్రకటన భారత్‌కు తలవంపు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**హైదరాబాద్ (చిక్కపల్లి), మే 12, ప్రభాతవార్త:** పాకిస్థాన్‌తో భారత్ చేస్తున్న ఉగ్రవాద నిర్మూలన యుద్ధం ట్రంప్ మధ్యవర్తిత్వంలో ముగిసినట్టుగా ట్రంప్ ప్రకటించుకోవటం భారతదేశానికి తలవంపుగా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. ట్రంప్ భారతదేశంతో మరీ ప్రత్యేకంగా మోడీతో స్నేహంగా ఉన్నట్లు నటిస్తూనే పాకిస్థాన్‌కు పూర్తి సహ కారం అందిస్తున్నట్టుగా ఈ యుద్ధం ద్వారానైనా మోడీ అర్థం చేసుకుంటే మంచిదన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ట్రంప్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులను తొలగించటానికి అమెరికా ప్రభావం కింద నడుస్తున్న ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటర్ ఫండ్) సంస్థ నుండి లక్ష కోట్ల డాలర్లు అప్పు పాకిస్థాన్‌కు ఇప్పించటంలో ట్రంప్ కపటనాటకం భారత ప్రజలకు పూర్తిగా అర్థమయిందన్నారు. గతంలో అమెరికా ప్రోద్బలంతో మొదలైన రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ట్రంప్ ముగిస్తానని ప్రకటించి దాని కొరకు ఉక్రెయిన్‌పై అక్రమంగా ఒత్తిడి తీసుకొచ్చి ఉక్రెయిన్‌లో ఉన్న ఖనిజ సంపదను అమెరికాకు ధారాదత్తం చేయాలని డిమాండ్ చేయటం దుర్మార్గమన్నారు. తప్పని పరిస్థితుల్లో ఉక్రెయిన్ ప్రభుత్వం ఖనిజ సంపద అమెరికాకు ధారాదత్తం చేసే ఒప్పందంపై సంతకాలు చేయాల్సి వచ్చింది. అలాగే పాలస్తీనా దేశంపై ఇజ్రాయెల్‌ను అమెరికా ఉసిగొల్పి యుద్ధాన్ని ప్రోత్సహించింది. అలాంటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాల మధ్య యుద్ధాన్ని ఆపుతానని, దానికొరకు గాజా ప్రాంతాన్ని ట్రంప్‌కు ధారాదత్తం చేయాలని షరతు విధించటం ట్రంప్‌లో దాగి ఉన్న రాక్షసుడు బయటపడుతున్నాడు. ఉక్రెయిన్‌లోను, ఇజ్రాయెల్‌లోను యుద్ధానికి పూర్తి కారకులు అమెరికా ప్రభుత్వమేననేది జగమెరిగిన సత్యం. ప్రపంచంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించేది అమెరికా అనేది అందరికి తెలిసిన విషయమని ఆయన అన్నారు.

# కౌలు రైతుల హామీలు తక్షణమే అమలు చేయాలి

### సాగుదారు గుర్తింపు కార్డుల చట్టాన్ని అమలు చేయాలి

### రైతు స్వరాజ్య వేదిక డిమాండ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 12, ప్రభాతవార్త:** తెలంగాణలో లక్షలాది కౌలు రైతులు అనేక సంవత్సరాలుగా గుర్తింపు లేక, ఎటువంటి ప్రభుత్వ పథకాల నుండి లబ్ధి పొందక అప్పుల ఊబిలో పడి ఆత్మహత్య చేసుకుంటున్న వారిని ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వికారాబాద్ జిల్లా పెరిగి మండలానికి చెందిన కురువ మంజుల. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జి చెందిన రమాకాంత్, కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన మాదాసు మాధవి, ఉమ్మడి ఖమ్మం జిల్లా గార్ల మండలానికి చెందింగ్ చాపల సుజాత, భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందింగ్ ముదస్తు సుమలత, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు గ్రామానికి చెందిన జెడి శ్రీనివాస్ , ఎం.రమేష్ , యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం కు చెందిన రాందాస్, రైతు స్వరాజ్య వేదిక నుండి బి. కొండల్ కన్నెగంటి రవి, విస్సా కిరణ్ కుమార్, ఎస్. ఆశాలత తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన కౌలు రైతులు నిరాశకు లోనవు తున్నారని, తక్షణం 2025 ఖరీఫ్ సీజన్ నుంచి కౌలు రైతులు గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని రైతు స్వరాజ్య వేదిక డిమాండ్ చేశారు. రైతు స్వరాజ్య వేదిక, ఇతర రైతు సంఘాల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, కౌలుదారులు సంబంధం లేదని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తనకు న్యాయం జరుగుతుందని నమ్మిన తమకు ఇప్పటి వరకు నిరాశే ఎదురయిందని కౌలు రైతులు బాధ వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలానికి చెందిన కురువ మంజుల. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జి చెందిన రమాకాంత్, కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన మాదాసు మాధవి, ఉమ్మడి ఖమ్మం జిల్లా గార్ల మండలానికి చెందింగ్ చాపల సుజాత, భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందింగ్ ముదస్తు సుమలత, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు గ్రామానికి చెందిన జెడి శ్రీనివాస్ , ఎం.రమేష్ , యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన రాందాస్, రైతు స్వరాజ్య వేదిక నుండి బి. కొండల్ కన్నెగంటి రవి, విస్సా కిరణ్‌కుమార్, ఎస్. ఆశాలత తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రైతు స్వరాజ్యవేదిక ప్రతినిధులు

## రాష్ట్ర ప్రజలకు బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** గౌతమ బుద్ధుని జయంతి, బుద్ధ పూర్ణిమ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు. మానవాళి ప్రగతి కోసం బౌద్ధం చూపిన బాట నేటికీ ఆచరణీయమన్నారు. తెలంగాణ సమాజపు మానవత్వ పరిమళాలు, శాంతి సహనంతో కూడిన అహింసాయుత జీవన విధానం.. వీటిలోని మూలాలు బౌద్ధ వారసత్వం నుంచే అలవడ్డాయని అన్నారు. అరుదైన బౌద్ధ చారిత్రక సంపద.. గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాలను అల్లుకొని తెలంగాణలో బౌద్ధం పరిఢవిల్లిందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. నాగార్జున సాగర్‌లో బుద్ధవనం అంతర్జాతీయ బౌద్ధ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, రాష్ట్రంలోని బౌద్ధ వారసత్వ కేంద్రాలను పునరుజ్జీవింపచేసి ప్రపంచ బౌద్ధ పటంలో తెలంగాణకు సముచిత స్థానాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## బ్యాంకుల జోక్యం లేకుండా రాజీవ్ యువ వికాసం వర్తింపచేయాలి : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే సబ్సిడీ రుణాలను ప్రతి దరఖాస్తుదారునికి వర్తింపచేయాలని బిసి సంఘాలు డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన 13 బిసి సంఘాల సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి నిర్దేశించిన 6వేల కోట్లు బడ్జెట్‌ను 15వేల కోట్లుకు పెంచాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో 50వేలు, లక్ష, 2లక్షలు, 3లక్షలు, 4లక్షల చొప్పున సబ్సిడీ కింద రుణాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే దీనికి సంబంధించి రాష్ట్రంలో 16.26లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే ఈ రాజీవ్ యువ వికాసం పథకానికి గందరగోళం పరిస్థితులు ఏర్పాటు అయినట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ పథకానికి సిబిల్ స్కోర్ అంటూ ముడిపెట్టి యువతకు రుణాలు అందకుండా కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఇప్పటికే సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టి బీసీలకు చెందిన 5,35,666 దరఖాస్తులలో సగం దరఖాస్తులు తిరస్కరించినట్టుగా తెలుస్తుందన్నారు. సెలక్షన్ ప్రాసెస్‌లో బ్యాంకుల జోక్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## చెన్నై విద్యార్థినిపై ఇద్దరు లైంగికదాడి

### ఆలస్యంగా వెలుగులోకి..

**హైదరాబాద్ (కొంపల్లి), మే 12, ప్రభాతవార్త:** చెన్నై విద్యార్థినిపై తోటి విద్యార్థి సహా అతడి మిత్రుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఈ నెల 4న సైబరాబాద్ కమిషనరేట్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థిని చెన్నైలోని కళాశాలలో బయోమెడికల్ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. అదే కళాశాలకు చెందిన అజయ్ బిటెక్ చదువుతున్నాడు. వీరిద్దరు స్నేహితులే. ఈ నెల 3న హైదరాబాదులో ఉన్నతవిద్య అడ్మిషన్‌ల కొరకు హైదరాబాదు వెళ్లి వద్దామంటూ తన స్నేహితురాలికి అజయ్ చెప్పాడు. అందుకు సమ్మతించిన ఆమె అజయ్‌తో కలిసి హైదరాబాదులోని నిజాంపేట రాజీవ్‌గృహకల్పకు వచ్చారు. అజయ్ మిత్రుడు హరి వీరికి తన ఫ్లాట్లో ఉండడానికి అంగీక రించాడు. దీంతో ఈనెల 4వ తేదీ రాత్రి ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్నారు. అనంతరం మద్యం మత్తులో అజయ్ తన స్నేహితురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం హరి కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె తిరగబడి కేకలు వేయగా ఇరుగుపొరుగు గమనించి బాచుపల్లి పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేశారు. రాత్రి 1 గంటకు బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి నిందితులు అజయ్, హరిలను అదుపులోకి తీసుకుని పోలీసు కస్టడీకి తరలించారు. బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. బాచుపల్లి పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి ఎస్‌హెచ్‌ఒ ఉపేందర్‌రావు తెలిపారు.

## కాలు నరం తెగిందని ఆస్పత్రికెళ్తే తలకు ఆపరేషన్!

### ఆస్పత్రిలో మృతి

**హైదరాబాద్ (దుండిగల్), మే 12, ప్రభాతవార్త:** కాలు నరం తెగిందంటూ ఆస్పత్రికి వెళ్తే... తలకు ఆపరేషన్ చేసి ప్రాణాలు తీసిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేటలోని ఎరకారం గ్రామానికి చెందిన కుర్ర పరమేష్(26) హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 5న బహదూర్‌పల్లిలోని ఒక ఇంట్లో ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో ఇంటి సామాను తరలించేందుకు పనికివెళ్లాడు. సామను షిఫ్ట్ చేస్తున్న క్రమంలో రేకు లాంటి వస్తువు పర మేశ్ కాలికి తగిలి నరంతెగి రక్త స్రావం అయింది. దాంతో గమ నించిన తోటి పనివారు దగ్గర్లో ఉన్న బహదూర్‌పల్లిలోని ఎస్.వి.సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజులు చికిత్స చేసిన ఆస్పత్రి యాజమాన్యం, రోగి కోలుకున్నాడని రేపు డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. నాలుగు రోజులు గడిచినా పరమేశ్‌ను డిశ్చార్జ్ చేయట్లేదని అడగ్గా.. పరమేష్ తలలో రక్తం గడ్డ కట్టిందని, ఆపరేషన్ చేశామని, అతని పరిస్థితి సీరియస్‌గా ఉందంటూ వైద్యులు చెప్పారు. తలకు ఆపరేషన్ ఎందుకు చేశారని నిలదీస్తే వైద్యులు సమాధానం దాటవేశారనీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉం డగా రోగి పరమేశ్ బతికే ఛాన్స్ తక్కువని అక్కడి వైదులు చెప్పడంతో కుటుంబీకులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తీరా గాంధీ ఆసుపత్రి వైద్యులు రోగి పరమేశ్ మరణించాడని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ప్యాకర్స్ అండ్ మూవర్స్ వాళ్లపై ఫిర్యాదు ఇవ్వండని అన్నారు. ఎస్.వి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతో పరమేశ్ చనిపోతే, ఆస్పతిపై చర్యలు తీసుకోకుండా తమకు అన్యాయం చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పరమేశ్ (ఫైల్)

## జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..
# విజేతగా ఇంగ్లండ్ స్టార్ హ్యారీ

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ లీగ్ బుండెస్ లీగ్‌లో హ్యారీ కేన్ తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు. 2024-25 బుండెస్ లీగ్ సీజన్‌లో బాయెర్న్ మ్యూనిక్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టును విజేతగా నిలబెట్టాడు. ఏకంగా ఆరుసార్లు కెరీర్‌లో మేజర్ ట్రోఫీలు సాధించే అవకాశాన్ని తృటిలో కోల్పోయిన హ్యారీ ఏడో ప్రయ త్నంలో విజయవం తమయ్యాడు. ఈ క్రమంలో తన కెరీర్ లో లోటుగా ఉన్న మేజర్ ట్రోఫీని అందుకున్నాడు. బెర్లిన్‌లో సోమవారం బొరుసియా మొంచెన్‌గ్లాడ్‌బాచ్ క్లబ్‌తో జరిగిన 33వ లీగ్ మ్యాచ్‌లో మాన్యుయేల్ నెయుర్ సారథ్యంలోని బాయెర్న్ మ్యూనిక్ జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. తద్వారా ఈ సీజన్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే బాయెర్న్ మ్యూనిక్ జట్టు రికార్డ్ స్థాయిలో 33వ సారి బుండెస్ లీగ్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మ్యూనిక్ జట్టుకు హ్యారీ కేన్ 31వ నిముషంలో, మైకేల్ ఒలిస్ 90వ నిముషంలో ఒక్కో గోల్ అందించారు. ఈ సీజనులో 30 మ్యాచ్‌లు ఆడిన హ్యారీ కేన్ 25 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా సీజన్‌లోని నామమాత్రపు చివరి మ్యాచ్ ఈ నెల 17న హాఫెన్‌హీమ్ జట్టుతో బాయెర్న్ మ్యూనిక్ టీం తలపడుతుంది.



ఇక మొత్తం 18 జట్లు ఇంటా, బయట పద్దతిలో బుండెస్ లీగ్‌లో పోటీపడుతున్నాయి. ఒక్కో జట్టు 34 మ్యాచ్‌లు ఆడుతుంది. 33 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న బాయెర్న్ మ్యానిక్‌జట్టు 24 విజయాలు సాధించింది.7 మ్యాచ్‌లను డ్రా చేసుకుని, 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 95గోల్స్ సాధించి, 32 గోల్స్‌ను సమర్పించుకుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 79 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది.

## ఆసియా బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో..
# భారత్‌కు తృటిలో చేజారిన పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్ బ్లిట్జ్ విభాగంలో భారత్‌కు తృటిలో రెండు కాంస్య పతకాలు చేజారాయి. పురుషుల విభాగంలో తమిళనాడు గ్రాండ్ మాస్టర్ మరళీ కార్తికేయన్, మహిళల విభాగంలో ఒడిశా అమ్మాయి పద్మిని రౌత్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను కోల్పోయారు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత కార్తికేయన్ ఏడు పాయింట్లతో మరో ముగ్గరితో కలిసి ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాడు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. రష్యాకు చెందిన రుడిక్ మకారియన్ మూడో స్థానంతో పాటు, కాంస్య పతకం ఖరారైంది. కార్తికేయన్‌కు నాలుగో స్థానం, భారత్‌కు చెందిన మరో ప్లేయర్ నీలాశ్ సాహాకు ఐదో స్థానం, చైనాకు చెందిన జియాంగ్ హావోచెన్‌కు ఆరో స్థానం లభించాయి. పురుషుల విభాగంలో మొత్తం 111 మంది ప్లేయర్లు పోటీపడగా, 8 పాయింట్లతో రష్యాకు చెందిన 15 ఏళ్ల ఇవాన్ జెమ్లియాన్‌స్కి విజేతగా అవతరించాడు. ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల సినా మొవాహెద్ 7.5 పాయింట్లతో రజతాన్ని దక్కించుకున్నాడు. ఇక మహిళల విభాగంలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత పద్మిని రౌత్, చైనాకు చెందిన యుజిన్ సాంగ్, కజకిస్తాన్‌కు చెందిన ఎల్నాజ్ కలియాక్‌మెత్ ఏడు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా కాంస్య పతకాన్ని ఖరారు చేయగా, అది యుజిన్ సాంగ్‌కు లభించింది. పద్మిని నాలుగో స్థానంలో, ఎల్నాజ్ ఐదో స్థానంలో నిలిచారు. 7.5 పాయింట్లతో కజికిస్తాకు చెందిన అలువా నుర్మాన్, రష్యాకు చెందని వాలెంటీనా గునీనా సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌లను వర్గీకరించగా, నుర్మాన్‌కు స్వర్ణం, గునీనాకు రజతం లభించాయి.



ఆట

# టెస్టులకు గుడ్ బై
## రోహిత్ బాటలోనే విరాట్

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లండ్ టూర్‌కు ముందు టెస్టులకు కింగ్ కోహ్లి రిటైర్మెంట్‌తో షాక్ ఇచ్చాడు. రోహిత్ శర్మ బాటలోనే టెస్టు క్రికెట్ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించాడు స్టార్ క్రికెటర్ కోహ్లి. ఈమేరకు ఇన్‌స్టాలో సోమవారం సుదీర్ఘ ఎమోషనల్ పోస్ట్ చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో భారతదేశం తరపున అత్య ధిక పరుగులు చేసిన నాల్గవ ఆటగాడిగా కోహ్లి రిటైర్ అయ్యాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవి డ్, సునీల్ గవాస్కర్ తర్వాత టెస్టుల్లో అత్యధిక పరు గులు చేసింది కోహ్లినే. ఇంగ్లాండ్ పర్యటనకు తన ను ఎంపిక చేయొద్ద ని బ ా ం ల్ త్ క్రి కె ట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి ముందుగానే సమాచారమిచ్చిన కోహ్లి తాజాగా తన రిటైర్మెంట్‌ను అధికారికంగా ప్రకటించాడు. ఈ సమయంలో రిటైర్మెంట్ వద్దని బీసీసీఐ వారించినప్పటికీ కోహ్లి వాటిని పట్టించుకోలేదు. 2011లో భారతదేశం వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైన రెండు నెలల తర్వాత, అతను జమైకాలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. ఇక 2025 జనవరిలో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన నూతన సంవత్సర టెస్ట్ సందర్భంగా అతను ఈ ఫార్మాట్‌లో చివరిసారిగా కనిపించాడు. 123 టెస్టుల్లో కోహ్లి 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించాడు. వాటిలో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోరు - 254 నాటౌట్. 2019లో దక్షిణాఫ్రికాతో పుణెలోని మహారాష్ట్ర క్రికెట్‌అసోసియేషన్ స్టేడియంలోజరిగిన మ్యాచ్‌లో ఈ అత్యుత్తమ ప్రదర్శనచేశాడు. 14 ఏళ్ల టెస్టు కెరీర్ తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు.

**'ప్రేమతో సైనింగ్ ఆఫ్'**

"టెస్ట్ క్రికెట్‌లో నేను తొలిసారి బ్యాగీ బ్లూ దుస్తులు ధరించి 14ఏళ్లు అయింది. నిజాయితీగా చెప్పాలంటే, ఈ ఫార్మాట్ నన్ను ఈ ప్రయాణంలో తీసుకెళ్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితాంతం నేను పాటించాల్సిన పాఠాలు నేర్పిం ది. తెల్లని దుస్తుల్లో ఆడటంలో ఏదో లోతైన విషయం దాగుంది. నిశ్శబ్దమైన ఆనందం, సుదీర్ఘమైన రోజులు, ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉండిపోతాయి. అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక అయిన విషయం కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చాను. ఆశించిన దాని కంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావం తో ఈ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నా. ఈ గేమ్ నేను మైదానంలో ఆడిన నా తోటి ప్లేయర్లు, ఈ ప్రయాణాన్ని నేను చూడటానికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రేమతో ఇక 269, సైనింగ్ ఆఫ్" అని కోహ్లి తన పోస్టులో రాసుకొచ్చాడు.

# ఐపిఎల్ హిస్టరీలో చెత్త రికార్డ్స్
## ముందే నిష్క్రమించిన నాలుగు జట్లు.. జాబితాలో చెన్నై, ముంబయి, బెంగళూరు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. 12 మ్యాచ్‌ల్లో ఏకంగా 9 ఓడి, 3 మ్యాచ్‌ల్లో నెగ్గి 6 పాయింట్లతో పట్టికలో అట్టడుగున నిలిచింది. ఫలితంగా సీజన్ 18నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా చెత్త రికార్డ్ మూటుగట్టుకుంది. అయితే టోర్నీ నుంచి అందరికంటే ముందే నిష్క్రమించడం చెన్నైకు ఇది రెండోసారి. 2020లో తొలిసారి ఈ చెత్త రికార్డ్ నమోదు చేసింది. మరి ఇప్పటి వరకు ఐపీఎల్ హిస్టరీలో టోర్నీ నుంచి తొలుత పలు జట్టు నిష్క్రమించాయి. దక్కన్ ఛార్జర్స్ 2008 నుంచి 2012 సీజన్‌లలో ఐపీఎల్‌లో పాల్గొంది. ఇందులో 2008, 2011, 2012లో మొదటగానే ఎలిమినేట్ అయ్యింది. పుణె వారియర్స్ ఇండియా కేవలం మూడు సీజన్లలో 2011, 2012, 2013 లోనే ఆడింది. ప్రతి సీజన్‌లోనూ లీగ్ స్టేజీలోనే తొలి సారిగా వైదొలిగిన టీమ్‌ల జాబితాలో చోటు సంపాదించుకుంది. ఇక దిల్లీ క్యాపిటల్స్ ఒక్కసారి కూడా టైటిల్ గెలుచుకోలేదు. కానీ చరిత్రలో మూడుసార్లు తొలుత నిష్క్రమించిన జట్టుగా నిలిచింది. 2014లో 14 మ్యాచ్‌ల్లో కేవలం రెండే నెగ్గి లీగ్ టేబుల్‌లో అట్టడుగున నిలిచి అందరి కంటే మొదటగా నిష్క్రమించింది. 2018లో 5 మ్యాచ్‌ల్లో, 2023లో కూడా 5 మ్యాచ్ ల్లోనే గెలిచి ఇంటిబాట పట్టింది. పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకూ రెండుసార్లు టోర్నీ నుంచి తొలుత నిష్క్రమించింది. 2010లో ఆడిన 14మ్యాచ్‌లలో నాలుగు మాత్రమే నెగ్గి పదింట్లో నిరాశపరిచింది. లీగ్ టేబుల్‌లో చివరి స్థానంలో నిలిచి టోర్నీ నుంచి ఇంటిబాట పట్టింది. 2015లో 14 మ్యాచ్‌లకు కేవలం 3 మ్యాచ్‌లలో విజయం సాధించి పాయింట్స్ టేబుల్‌లో చివరి స్థానంలో నిలిచి మొదటగా వైదొలిగింది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒక్కసారి కూడా టైటిల్ గెలవకపోవడం గమనార్హం. ఆర్సీబీ ఇప్పటివరకూ రెండు సార్లు లీగ్ నుంచి తొలుత వైదొలిగింది. 2017లో ఆడిన 14 మ్యాచ్‌లలో 3 మాత్రమే నెగ్గి పదింట్లో ఓడి ఒక మ్యాచ్ టై చేసుకుని ఇంటిబాట పట్టింది. 2019లో 5 మ్యాచ్ లలో గెలిచి 8 మ్యాచ్ లలో నిరాశపరిచి మొదటగా నిష్క్రమించింది. ముంబయి ఇండియన్స్ ఇప్పటి వరకూ 2013, 2015, 2017, 2019, 2020లో టైటిల్ కైవసం చేసుకుంది. అయితే రెండుసార్లు లీగ్ నుంచి మొదటగా ఎలిమినేట్ అయ్యింది. 2022లో ఆడిన 14 మ్యాచ్‌లలో నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. 2024 లోనూ నాలుగే నెగ్గి 10 మ్యాచ్‌లలో ఓటమి చెంది లీగ్ నుంచి తొలుతగా బయటకు వచ్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 3సార్లు (2012, 2014, 2024) టైటిల్ గెలుచుకుంది. ఒక్కసారి మాత్రమే లీగ్‌లో తొలుతగా వైదొలిగింది. 2009లో టీమ్ ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం మూడునెగ్గి, 10 ఓటమిపాలై మొదటగా నిష్క్రమించింది. కాగా 2013లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చింది. వచ్చిన మూడేళ్లకే 2016లో ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2021 ఐపీఎల్ సీజన్‌లో 14మ్యాచ్‌లలో 3 మాత్రమే నెగ్గి 11 విఫలమైంది. దీంతో లీగ్ నుంచి నిష్క్రమించిన తొలి టీమ్‌గా నిలిచింది.



## మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో..
## భారత్ షూటర్స్ చెనాయ్,
# సబీర కంచుమోత

**న్యూఢిల్లీ:** ఐఎస్‌ఎస్‌ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్-2025 లో భారత షూటర్లు సత్తా చాటారు. కినన్ చెనాయ్, సబీరా హ్యారిస్‌లు పతకంతో మెరిశారు. నికోసియా వేదికగా జరుగుతున్న మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అదరగొట్టి కంచు మోతో మోగించారు. మూడో స్థానం కోసం తుర్కియే షూటర్లతో పోటీ పడిన ఈ జోడీ అద్భుత ప్రదర్శనతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 34వ స్థానంలో నిలిచిన భారత ద్వయం అసమాన ప్రతిభాపాటవాలతో పతకం కొల్లగొట్టడం విశేషం. ఐఎస్ ఎస్‌ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్ మిక్స్‌డ్ పోటీల క్వాలిఫికేషన్‌లో నిరాశపరిచిన కినన్, సబీరలు ఆ తర్వాత పుంజుకున్నారు. టీమ్ విభాగంలో 142 పాయింట్లు సాధించి 34వ స్థానం సాధించారు. మూడో స్థానం కోసం తుర్కియే ద్వయం తొల్గా టన్సర్, పెలిన్ కయాపై 34-33తో విజయం సాధించారు. అగ్రస్థానంలో నిలిచిన చైనా బంగారు పతకం గెలవగా, పొలాండ్ షూటర్లు సిల్వర్ సాధించారు. భారత్‌కు చెందిన శార్దూల్ విమాన్, కీర్తి గుప్తాలు 137 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచారు.

# అప్పుల్లో తమిళనాడు టాప్..

**న్యూఢిల్లీ, మే 12:** దేశంలోని రాష్ట్రాల్లో ఏటికేడు అప్పులు పెరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు భవిష్యత్తులో తమకు ఉపయోగపడేలా స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పనకు అప్పులను వాడుతున్నాయి. ఇంకొన్ని రాష్ట్రాల్లో వేతనాలు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు వంటి వాటికోసం వీటిని వినియోగిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని ఇటీవల ఆర్‌బిఐ నివేదిక తెలిపింది. మధ్య మొత్తం తమిళనాడు రుణాలు రూ.1.01 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బలమైన ఆర్థిక వ్యూహం, వృద్ధి ఆధారిత పెట్టుబడుల పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తూ తమిళనాడు రాష్ట్రం పెట్టుబడులను సమీకరిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. గత కొన్నేళ్లుగా అప్పుల్లో తమిళనాడు నిలకడగా ముందంజలో ఉంది. సంవత్సరాలవారీగా అప్పులు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.87,977 కోట్లు, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో రూ.87వేల కోట్లు, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.1.13 లక్షల కోట్లు, 2025 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2024 నుంచి 2025



ఫిబ్రవరి వరకు రూ.1.01 లక్షల కోట్లు. తమిళనాడు తర్వాత 2025 ఆర్థిక సంవత్సరంలో మహారాష్ట్ర రూ.99వేల కోట్ల అప్పుతో రెండో స్థానంలో నిలిచింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయంలో 22శాతం పెరుగుదలను రాష్ట్రం బడ్జెట్లో ప్రతిపాదించింది. ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థికవృద్ధికి బలమైన నిబద్ధతను సూచిస్తుంది. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన 28.7శాతంలోపు దాని డెట్-జిఎన్‌డిపి నిష్పత్తి 26.43శాతంగా ఉంది. ఇది ఆర్థిక స్థిరత్వం, సుస్థిరతను నిర్ధారిస్తుంది.

# రూ.16 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

**ముంబై, మే 12:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఖరారైన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. అమెరికా చైనా వాణిజ్య చర్చలు, రష్యా ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి వంటి అంతర్జాతీయ అంశాలు ఇందుకు తోడయ్యాయి. దీంతో మన సూచీలు ఆకాశమే హద్దుగా పైకెగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 3 వేలకు పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. 2024 డిసెంబర్ 16 తర్వాత బెంచ్ మార్క్ సూచీలు ఈ స్థాయిని అందుకోవడం ఇదే తొలిసారి. ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరిగి రూ.432 లక్షల కోట్లకు చేరింది. భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ సెన్సెక్స్ ఆరంభంలోనే 80,803.80 పాయింట్ల వద్ద భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే దూకుడు కొనసాగించింది. ఇంట్రాడేలో 3 వేల పాయింట్లకు పైగా లాభంతో 82,495.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2975.43 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 916.70 పాయింట్ల లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువగా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా మిగిలిన షేర్లు లాభాలు చవి చూశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్లు, బంగారం ఔన్సు 3222 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6.70 శాతం మేర లాభపడింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు కూడా 4 శాతం మేర రాణించాయి.






# భారత్ వృద్ధి 6.5శాతం: సిఐఐ

**న్యూఢిల్లీ, మే 12:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 6.5శాతం వృద్ధి చెందుతుందని పరిశ్రమల సంఘం సిఐఐ అంచనా వేసింది. భౌగోళిక రాజకీయ సమస్యల వల్ల కొంత ప్రభావం ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధిని కొనసాగగలదని కూడా సిఐఐ అధ్యక్షుడు సంజీవ్ పురి అన్నారు. పెరుగుతున్న వాణిజ్య సవాళ్ల నేపథ్యంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవ డానికి దేశం కీలక వాణిజ్య భాగస్వాములతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కొనసాగించాలని ఆయన ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పెట్టుబడులకు కొంత అవరోధం ఏర్పడవచ్చు. ఇది స్వల్పకాలమే, ఆ తర్వాత పరిస్థితులు సాధారణంగా మారతాయని సంజీవ్ పూరి వివరించారు. ఈ కారణంగా దేశ ఆర్థిక వృద్ధి అంచనాను 6.5శాతంగా భావిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఆర్‌బిఐ వడ్డీరేట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణం క్రమంగా దిగివస్తోంది. తాజా ఇంధనం, రవాణా, లోహాలు, రసాయనాలు, ఆతిథ్యం వంటి రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితి పెంచింది. దీని వల్ల వినియోగం గణనీయంగా పెరుగుతుంది. దీనికి తోడు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

# ప్రీమియం స్కూటర్లపై టివిఎస్ ఫోకస్!

**ముంబై, మే 12:** దేశీయ స్కూటర్ల మార్కెట్ అంతకంతకూ విస్తరిస్తోంది. ప్రస్తుతానికి 110, 125 సీసీ సెగ్మెంట్‌దే హవా. ఇందులో హోండా యాక్టివా, టీవీఎస్ జుపిటర్, సుజుకీ యాక్సెస్ వంటివి సత్తా చాటుతున్నాయి. తనదైన స్పోర్టీ లుక్‌తో టీవీఎస్‌కు చెందిన ఎన్‌టార్క్ కూడా కుర్రకారును ఆకట్టుకుంటోంది. మరోవైపు ప్రీమియం, పెర్ఫార్మెన్స్ స్కూటర్లకు ఆదరణ పెరుగుతోంది. దీనిపై టీవీఎస్ దృష్టి పెట్టింది. ఎన్‌టార్క్ రూపంలో 150 సీసీ సెగ్మెంట్‌లోకి ప్రవేశించాలని చూస్తోంది. ప్రస్తుతం ప్రీమియం స్కూటర్ల సెగ్మెంట్‌లో యమహా ఏరోక్స్ 155, హీరో మోటోకార్ప్ జూమ్ 160, ఆప్రిలియా 160 సీసీ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. యమహా మొత్తం సేల్స్‌లో ఏరోక్స్ 155వాటా 45 శాతం మాత్రమే. హీరో మోటోకార్ప్ మొత్తం అమ్మకాల్లో జూమ్ వాటా కూడా అంతంత మాత్రమే. కానీ, కుర్రకారు అంచనాలు పెరుగుతున్నాయి. తదనుగుణంగా ప్రీమియం స్కూటర్లకు డిమాండ్ పెరగబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీవీఎస్ కూడా ఎన్‌టార్క్‌ను 150 సీసీలో తీసుకొచ్చేందుకు సన్నద్ధం అవుతోంది.



# 32 విమానాశ్రయాలు ఓపెన్

**న్యూఢిల్లీ, మే 12:** భారత్‌పాక్ నడుమ ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తొలగిపోవడంతో విమానాశ్రయాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. తొలుత ఈనెల 15 వరకు వాటిని మూసి వేయాలని భావించినప్పటికీ పరిస్థితులు మెరుగుపడటంతో వాటిని తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. పౌర విమానయాన కార్యకలాపాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని.. ఈ విషయాన్ని దృష్టిలోఉంచుకొని ఏర్పాట్లు చేసు కోవాలని సూచించారు. విమానాల సేవలు, వివరాలకు సంబంధించిన ఇతర విషయాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్‌లను పర్యవేక్షించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సూచించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాక్‌లోని వివిధ ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో సరిహద్దులకు దగ్గరగా ఉన్న దాడులు జరిగేందుకు అవకాశమున్న చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లూథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, భఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బికనేర్, పఠాన్‌కోట్, జమ్ము, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేస్తున్నట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఇటీవల ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ఈ సేవలను తిరిగి పునరుద్ధరించింది.



# వాణిజ్యం

## టారిఫ్ వార్‌కు విరామం..

**వాషింగ్టన్, మే 12:** పరస్పర ప్రతీకార సుంకాల ప్రకటనలతో ప్రపంచ దేశాలకు, స్టాక్ మార్కెట్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన అమెరికా, చైనా ఓ అవగాహనకు వచ్చాయి. పోటాపోటీగా విధించుకున్న టారిఫ్‌లను తాత్కాలికంగా తగ్గించేందుకు నిర్ణయించాయి. ఇరుదేశాలు 90 రోజుల పాటు తమ టారిఫ్‌లను 115 శాతం మేర తగ్గించుకుంటాయని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ నిర్ణయం వెలువడింది. వివిధ భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై భారీగా టారిఫ్‌లు విధించారు. ప్రతిగా ఆ దేశం కూడా టారిఫ్ వార్‌కు దిగింది. దీంతో ట్రంప్ చైనా ఉత్పత్తులపై అమెరికా తన టారిఫ్‌లను 145 శాతానికి పెంచగా.. చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఆర్థిక మాంద్యం భయాలు తలెత్తాయి. ఈ క్రమంలో అమెరికా, చైనా ప్రతినిధులు స్విట్జర్లాండ్ వేదికగా జరిపిన వాణిజ్య చర్చల్లో టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదా వేసేందుకు నిర్ణయించారు. ఇందులోభాగంగా అమెరికా దిగుమతులపై చైనా తన సుంకాలను 115 శాతం అంటే 125 శాతం నుంచి 10 శాతానికి తగ్గించనుంది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా తన సుంకాలను 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గిస్తుంది. 90 రోజుల పాటు ఈ టారిఫ్‌లు అమల్లో ఉండేలా ఇరుదేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14